ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి



# గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ | మాతృ దేవోభవ ! పితృ దేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ ! | సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డా॥ ప్రణవ్‌పండ్యా
సంపాదకులు
బి.సి.హెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
ఉప సంపాదకులు
ముక్కామల రత్నాకర్
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 21 - సంచిక 01
జూన్ 2016

పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
040-23700722
99491 11175
94407 69798

## యువశక్తి

గాఢమైన సంవేదన మరియు సాహసములోనే యువశక్తి ఎగిసిపడుతు ఉంటుంది. పరవళ్ళు త్రొక్కుతున్న భావములు మరియు పెల్లుబుకుతున్న సాహసమే యవ్వనము అనే నిప్పు కణికను ప్రచండాగ్నిజ్వాలగా మార్చుటకు తపిస్తూ వుంటుందని గ్రహించాలి. విరుద్ధవిషయములు యువతకు ప్రేరణనిస్తూ వుంటాయి. విషమపరిస్థితుల నుండి యువతకు ఉత్సాహము లభిస్తుంది. సంవేదనను రగిలించే సమస్యలు యువతలో కొంగ్రొత్త శక్తి ప్రవహించేలా చేస్తాయి.

వయస్సు ఎంతైనాసరే ఓడిన మనస్సు, అలసిన శరీరముతో ఎవ్వరూ ఎన్నడూ యౌవనముతో ఉండలేరు. శక్తి యొక్క తుఫాన్ తన సంపూర్ణమైన ప్రచండత్వముతో చరిస్తూ, తన మహావేగముతో సమస్యలనే కొండశిఖరములను కూలదోస్తూ, విషమపరిస్థితులనే మహా వనములను వ్రేళ్ళు సహా నేలమట్టము కావిస్తూ వ్యతిరేక వాతావరణ పరిస్థితులనే కందకాలను, గోతులను పూడ్చి మెరక-పల్లములు లేకుండా సరిచేస్తూ మున్ముందుకు సాగిపోయేదే యౌవనావస్థ. యువత చేయలేనిది ఏమున్నది? యువత శక్తిని నిలువరించగలిగే అడ్డంకి, శక్తి ఏమున్నది? అవరోధము కలిగి ఆగిపోయేది అసలు యువశక్తి అవుతుందా?

రాణీలక్ష్మీబాయి, వీరుడు సుభాస్‌చంద్రబోస్, స్వామీ వివేకానంద, దేశభక్తుడు భగత్‌సింగ్ రూపములో యువశక్తి యొక్క లెక్కలేనన్ని పనులు ప్రకటితమైనాయి. ఈ ప్రక్రియ ఇప్పుడు కూడా కొనసాగుతున్నది. మహా గొప్ప శారీరక బలముతో, పరాకాష్ఠనందుకొన్న ప్రతిభ, పరమతేజోవంతమైన ఆత్మ, అన్నింటినీ మించి మహోన్నత ఉద్దేశ్యముల కొరకు వీటన్నింటిని అందిపుచ్చుకొని త్యాగపూరితమైన సాహసముతో యువశక్తి ఎల్లప్పుడూ అసంభవమును సంభవముగా చేసి చూపిస్తూనే ఉన్నది.

యవ్వనములో అందరికి శక్తి అనే మహావరదానము లభిస్తుంది, కానీ దానిని సదుపయోగము చేసినవారినే అది అంటిపెట్టుకుని ఉంటుంది అనే విషయమును మరువరాదు. ఏ కొంచెమైనాసరే దురుపయోగమైనచో ఆ శక్తే యౌవనమును హరించివేసేదిగా మారిపోతుంది. దీని 'ప్రతిభ' కాటుకవంటి కాళరాత్రిలో కలిసిపోతూ ఉంటుంది. ఇందువలన యౌవనములోనే యువత జీవితము ప్రగతిబాట పట్టి సార్థకం కావాలి.

*- అఖండజ్యోతి, సెప్టెంబర్ 2006*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**సాధకుడు గాయత్రీ తీవ్రసాధన ద్వారా వాతావరణాన్ని, ఆరోగ్యాన్ని, ఇతరుల మనస్సును తెలుసుకొనగలడు**

# విషయసూచిక


1. **సంపాదకీయం:** యువశక్తి 3
2. **విషయసూచిక-సద్గురువాణి:** సమృద్ధి – సర్వతోముఖ ప్రగతి 4
3. **యుగనిర్మాణ చిత్రావళి – 14:** జనక మహారాజు శ్రమవిలువను పెద్దదిగా చేశాడు 5
4. **అశ్వమేధం-16:** యజ్ఞ సక్రియ – దివ్య అనుశాసనము – యజ్ఞ సంసద్ 6
5. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర – 48:** హరిజనోద్ధరణకై కులవ్యవస్థ నిర్మూలనకై శ్రీరామ్ కృషి – 2 8
6. **సూక్ష్మీకరణ సాధన-7:** మనిషీ – ఋషిరూపంలో నా పరోక్ష భూమిక 12
7. **పరమపూజ్య గురుదేవుల అమృత వచనాలు – 10:** సమయదానం యొక్క విశిష్టత 15
8. **అతీంద్రియ విజ్ఞానం-12:** భవిష్యదర్శనము యాదృచ్ఛికము కాదు, సత్యమే! 17
9. **తంత్ర విద్య-3:** మౌనబాబా 19
10. **గాయత్రీ జయంతి ప్రత్యేకం:** మహాతపస్సుకు సంకల్పించే సమయము ఆసన్నమైనది 23
11. **గాయత్రీ జయంతి ప్రత్యేకం:** ముక్తిదాత మన గురుదేవులు 26
12. **భారతీయ సమాజం ప్రవర్తనపై స్వామి వివేకానందుని విశ్లేషణ-1** 29
13. **మనం-మన ఆరోగ్యం:** ఆరోగ్యము మందులపైన కాక మనలోనున్న జీవనీశక్తి మీద ఆధారపడి ఉంటుంది 32
14. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** ఆధ్యాత్మికతకు అసలైన గీటురాయి 35
15. **నా వారితో నా మాట:** యువక్రాంతి సంవత్సరపు ప్రణాళిక-1 39
16. **ఆయుర్వేదవైద్యం-14 :** క్యాల్షియం భాండాగారము – నువ్వులు 43
17. **స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు-25** 45
18. **తొమ్మిది రోజుల సంజీవిని సాధనా శిబిరంపై నివేదిక-1** 47
19. **వార్తలు :** ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు 48
20. **దేవసంస్కృతి విశ్వవిద్యాలయము** 50


# సద్గురు వాణి



## సమృద్ధి - సర్వతోముఖ ప్రగతి

సమృద్ధి కొరకు ప్రయత్నం చేయడం తప్పు కాదు. ఇది ఒకరకంగా శ్రమశీలతకు పురస్కారం. వ్యక్తి సమృద్ధి కొరకు మాత్రమే ప్రయత్నం చేస్తుంటే అది వ్యక్తిగత, సామాజిక పతనం వైపు దారితీస్తుంది. ఇట్టి ప్రయత్నం వలన ఇతరుల ప్రగతి, పురోగతికి అడ్డుగా నిలుస్తుంది. తన భౌతిక సంపదలపైనే దృష్టిపెడితే అది అసమానతలను పెంపొంది స్తుంది. అందు వలన ప్రతి వ్యక్తి సమాజ సర్వోతోముఖమైన ప్రగతికి ప్రయత్నించాలి, సాధించాలి. (ఆరోగ్యం, జ్ఞానం, స్నేహితులు వగైరా).

*– అనువాదం: ముక్కామల రత్నాకర్*

## యుగశక్తి గాయత్రి


**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**
**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ.5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపే వారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు
బ్యాంకు పేరు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.




**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు – 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


**అందంగా ఉన్నవారితోకన్నా తన చుట్టూ ఉన్నవారిని ఆనందంగా ఉంచేవారితోనే మన జీవితం సంతోషంగా ఉంటుంది**

యుగనిర్మాణ చిత్రావళి-14

# జనకమహారాజు శ్రమ విలువను పెద్దదిగా చేశాడు



మహారాజు జనకుడు రాజులందరిలో భిన్నంగా ఆలోచించేవాడు – ఎవ్వరైతే తమ పూర్తి సమయాన్ని, శ్రమను మరియు పురుషార్థాన్ని రాజ్య వ్యవహారాల పరిష్కరించుటలో, ప్రజల హితం కొరకై వెచ్చిస్తారో అట్టివారిని నిజమైన ప్రజాప్రతినిధులుగా గుర్తించుట విధాయకము. దీనివలన తప్పుడు పనులు జరిగెడి అవకాశము ఉండదు! ప్రజలు అట్టివానిని తమ తండ్రి సమానునిగా చూస్తూ ఆయనకై తమ ప్రాణాలను అర్పించుటకు సైతం సిద్ధంగా ఉంటారు!

నేడు శాసకులు ప్రజల యొక్క నామ మాత్రపు గౌరవాన్ని మరియు ఆదరాభిమానాలను కూడా పొందజాలకున్నారు. రాజనీతిలో ఏదైనా మంచిదశ సంప్రాప్తించిన వేళ, ఈ సమాజంలోని జనులు ఒక విశిష్ట మార్గంలో పయనిస్తున్న విషయాన్ని మరచి, స్వార్థం, కోరికలు, భ్రష్టాచారాలలో మునిగి తన కుటుంబం, సోదరుడు, సోదరి మరియు కుమారుడు అనెడి భావజాలంలో మునిగిపోయెదరు. రాజు అప్పుడు రక్షకుడుగాకాక భక్షకుడుగా మారగలడు. పెద్ద పెద్ద పదవులలో ఉన్నవారు సైతం నేడు ప్రజల యొక్క హృదయాలలో ప్రేమ పూర్వకస్థానాన్ని పొందజాలకున్నారు. వీరు ప్రజావంచకులుగా మిగిలిపోవుచున్నారే కాని, ప్రజలను తమ కన్నబిడ్డల్లా చూచుట లేదు. వారిపట్ల తగిన వాత్సల్యాన్ని చూపుటలేదు.

రాజులు తమ సేవలకొరకై తమ అధికారాలను వినియోగించుకొనుచున్నారు. ప్రజలు రాజులపోషణకై పన్నులరూపంలో భరణాల చెల్లిస్తూ వారి జీవనపర్యంతం వారి పోషణ సమస్యల నుండి వారిని విముక్తులగావించుట పరిపాటి. కాని జనక మహారాజు తన విషయంలో రాజు జీవితం ప్రజలకు ఆదర్శంగా మార్చి, ప్రజలకు రాజపోషణ విషయంలో ఎట్టి సమస్యలు లేకుండా చేశారు. ఆయన తన పోషణకై ప్రజలపై ఆధారపడక తన ఏర్పాట్లను తానే చేసికొన్నాడు. తానే శ్రమించ నిశ్చయించుకున్నాడు. ప్రజల ధనం ప్రజలకే ఖర్చు చేయాలనెడిది ఆయన ఆదర్శం.

చిత్రంలో ఒక ప్రక్క మహారాజు రాజ్య వ్యవస్థను సమీక్షిస్తూ మరో ప్రక్క తన పోషణకై తాను నాగలి చేబూని భూమిని దున్ని పంట పండించు కొంటున్నట్లు చిత్రించుట జరిగింది.

జనకుడు తన ఆదర్శభావాలను ఆచరణలో చేసిచూపుతూ ప్రజలకు సేవ చేయుటకై రాజుకు అధికారమివ్వబడింది కాని, ప్రజల ధనాన్ని తన సుఖస్వార్థాలకు ఖర్చు చేయుటకు కాదు అని నిరూపించాడు. ఆయన తన పోషణతో పాటు తన పరిజనుల పోషణను కూడా తన శ్రమ ద్వారా లభించిన ధనంతోనే నిర్వహించాడు. ఒక సామాన్య రైతులా భూమిని దున్ని సేద్యం చేశాడు. జనకుడు నాగలితో దున్ను తున్నప్పుడు నాగలి చాలులో సీత దొరికింది.

జనకుని మనుస్సులో తాను రాజుననెడి భావనను ఏనాడు ఉత్పన్నం కానివ్వలేదు. న్యాయపాలనలో ఆయన ఎంత నిష్ఠగా, కఠినంగా వ్యవహరించేవారో అంతకన్నా ఎక్కువ నిష్ఠను కఠోరతను తన కోర్కెలపట్ల, మహత్వపూర్ణ ఆకాంక్షల నెరవేర్చుకొనుట పట్ల ప్రదర్శించేవారు! ఇందువలన సమాజంలో ఏ ఒక్కరు జనకుని ప్రవర్తనపట్ల, జీవన విధానం పట్ల వ్రేలెత్తి చూపేవారు కాదు! గొప్ప గొప్ప మహర్షులు మరియు జ్ఞానులు కూడా ఆయనను గౌరవించేవారు మరియు ఆయన నుండి యోగ విజ్ఞానాన్ని పొందుటకై వస్తూ ఉండేవారు.

రాజ్యక్షేత్రాల్లో జనకునితో పోల్చదగిన మరో ఆదర్శ పాలకుడు లేడు. నేడు జనకుడు జీవించి ఉన్నచో, ప్రజలు ఆయనకు తన ప్రాణాలను సైతం అర్పించెదరు. కనీసం అంతటి నిస్వార్థ, నిజాయితీ అధికారులున్నా కూడా ప్రజలు అట్టివారికి బ్రహ్మరథం పడతారు–ప్రజాస్వామ్య రాజ్యవ్యవస్థలో రాజ్యపాలన సఫలత మరియు జనామోదితము, జనరంజ కతలు పాలకులు అందించెడి నిస్వార్థసేవలపైన, త్యాగాలపైన ఆధారపడి మనుగడ సాగిస్తాయి, కాని, పాలకులు ప్రదర్శించెడి వైభవాల పైన కాదు – కావున శాసకులైన వారు పై సత్యాన్ని మనోగతం గావించుకొని వీనిని తమ నిత్యజీవితాల్లో అనుసరించుటకై కృషి చేయవలసి ఉంది.

– *అనువాదం: పార్థసారథి*

**మన వ్యక్తిత్వమే మనకు తరగని సిరి మనకు చివరకు మిగిలేది మన వ్యక్తిత్వమే**

అశ్వమేధం - 16

# యజ్ఞ సత్క్రియ - దివ్య అనుశాసనము - యజ్ఞ సంసద్

యజ్ఞము మనోవిజ్ఞానము, భావ విజ్ఞానము. (Emotional Science) మంత్ర విజ్ఞానము, క్రియా విజ్ఞానముల యొక్క అద్భుత సంగమము - దివ్యచేతన, సృష్టిగత పరమాత్మ చేతనతో సంబధము ఏర్పరచగలిగే దివ్య ద్వారము. అందువల్ల యజ్ఞము లోని ప్రతి కర్మకాండ వెనుక భావన మొదలైన దానితో దివ్య అనుశాసనము కూడా కలుప బడి ఉంటుంది. ఈ దివ్య అనుశాసనాలు గుర్తుంచుకొనుటకు యజ్ఞశాలలో వాటి ప్రతీకలు స్థాపించబడతాయి. యజ్ఞప్రక్రియలన్నీ ఒక క్రమ పద్ధతిలో, అనుశాసనక్రమములో జరిపించుటకు ఒక యజ్ఞ సంసద్ నిర్మించబడుతుంది. భావనాత్మక పక్షము గురించి ఇంతవరకు చెప్పుకున్నాము. ఇప్పుడు దృశ్య ప్రతీకాత్మిక స్వరూపము దేశకాలానుసారముగా శాస్త్రీయ నియమాను సారము ఏర్పరచబడుతుంది.

### ప్రతీకముల స్థాపన

సహస్రకుండ అశ్వమేధ యజ్ఞశాల-దివ్య చిహ్నములు, చక్రములు, దేవ విగ్రహములతో అలంకరింపబడుతుంది. కొన్ని ముఖ్యమైన ప్రతీక స్థాపనలు క్రింది విధంగా ఉంటాయి- యజ్ఞశాల నలువైపులా నాలుగు దివ్యద్వారాలు ఏర్పరుస్తారు.

ఇది దేవ ప్రయోజనానికి మాత్రమే. ప్రజోపయోగానికి కాదు. ఇక్కడ తోరణ శూల శంఖచక్రగదా పద్మ చిహ్నములు ఏర్పరచబడతాయి. పూర్వదిశలో ఎరుపురంగులో శంఖము, దక్షిణదిశలో నలుపురంగులో చక్రము, పశ్చిమదిశలో, తెలుపు రంగులో గద ఉత్తరాన పసుపురంగులో పద్మము స్థాపించ బడతాయి. నాలుగు ద్వారాల వద్ద 8 మంది దేవద్వార పాలకులు స్థాపించబడతారు. వీరు జయ-విజయులు, భద్రక-సుభద్రకులు ఆనంద-విశ్వరూపులు, ధ్రువ-సుప్రన్నులు.

8 దిశలలో విభిన్న దేవశక్తుల ప్రతీక పతాకాలు స్థాపించ బడతాయి. పూర్వదిశలో ఇంద్ర వాహనము ఏనుగు, తెలుపు రంగులో, అగ్నికోణములో అతని వాహనము మేక తెలుపు రంగులో, దక్షిణదిశలో యముడి వాహనము మహిషము, ఎరుపు రంగులో, నైఋతిలో దుర్గ వాహనము సింహము, తెలుపు రంగులో, పశ్చిమదిశలో వసు వాహనము మకరము, ధూమ్ర రంగులో, వాయువ్యములో చంద్రవాహనము లేడి, నలుపు రంగులో, ఉత్తర దిశలో సూర్యవాహనము గుఱ్ఱము స్వర్ణిమ రంగులో ఈశాన్యములో శివవాహనము వృషభము, తెలుపురంగులో స్థాపించబడతాయి. అంతేగాక ఈశాన్య పూర్వదిశలో మధ్యలో బ్రహ్మవాహనము హంస - నైఋతి పశ్చిమ దిశల మధ్యలో అనంత దేవుని వాహనము గరుడుడు అంకితము చేయబడ్డ పతాకాలు స్థాపించబడతాయి.

8 దిశలలో ఎనమండుగురు దిక్పాలకులకు ప్రతీకగా ఏనుగులు స్థాపించబడతాయి. ఆకాశము పాతాళ దిశ దిక్పాలకులు స్థాపన అదృశ్యంగా జరుగుతుంది.

యజ్ఞ కుండముల ఆకృతి విభిన్న దిశలలో క్రింద చెప్పిన విధముగా ఉంటుంది. పూర్వదిశలో చతురస్ర కుండము (స్తంభన కొరకు) భోగము కొరకు, అగ్నికోణములో యోని కుండము మారణ ప్రయోగాలకు దక్షిణ దిశలో అర్ధచంద్ర కుండము, నైఋతిలో త్రికోణము, శాంతికొరకు పశ్చిమదిశలో వృత్తకుండము ఉచ్చాటనకు, వాయువ్యములో షడస్రకుండము పౌష్టికకర్మలకు, ఉత్తరదిశలో పద్మకుండము ముక్తికొరకు, ఈశాన్యములో అష్టాస్ర కుండము స్థాపించబడతాయి. యజ్ఞ కుండ నిర్మాణము, వాటి అకృతి, ఉపయోగించబడే రంగులు భావనాత్మక, మనోవైజ్ఞానిక, భౌతిక జ్యామితీయ, తాంత్రిక విజ్ఞానము ఆధారముగా అవసరాన్ని బట్టి నిర్మించ బడతాయి.

8 దిశలలో సప్తఋషులు 8వ దానిగా అరుంధతి మూర్తి స్థాపన జరుగుతుంది. ఉత్తరదిశలో గౌతముడు ఈశాన్యదిశలో భరద్వాజుడు, పూర్వదిశలో విశ్వామిత్రుడు, ఆగ్నేయములో కశ్యపుడు, దక్షిణములో జమదగ్ని, నైఋతిలో వశిష్టుడు, పశ్చిమదిశలో అత్రి, వాయువ్యములో అరుంధతిని స్థాపిస్తారు.

సర్వతో భద్ర చక్రము యజ్ఞశాలలో ముఖ్య దేవవేదికకు ముందు పూర్వదిశలో వేయబడుతుంది. దానికి రెండువైపులా షోడశ మాతృకాచక్రము, ద్వాదశ వినాయక చక్రము ఏర్పాటు చేస్తారు.

తత్త్వవేదికలలో ఆకాశతత్వ ప్రతీకగా స్వాస్థిక చిహ్నము దేవ వేదిక ప్రక్కన పెట్టబడుతుంది. అగ్నికోణము అగ్నితత్త్వము, నైఋతిలో పృథ్వీతత్త్వము, వాయువ్యములో వాయుతత్త్వము ఈశాన్యములో జలతత్వవేదికలు స్థాపించబడతాయి.

**అమ్మాయి అందంగా ఉందని ఆశపడకు ఆ ఆశకు తగ్గ అర్హత సంపాదించుకో అప్పుడు ఆ అమ్మాయే నిన్ను ఇష్టపడవచ్చు**

యజ్ఞశాల మధ్యలో నవగ్రహ చక్రము ఈశాన్యదిశలో పంచోం కారవేదిక వాయువ్యములో క్షేత్రపాల చక్రము అగ్నికోణములో యోగినీ చక్రము, నైఋతిలో వాస్తు వేదిక స్థాపించబడతాయి.

ఇది అలంకరణ కొరకు స్థాపించబడే వర్ణన కాదు. దీనిలో సన్నిహితమైన ప్రేరణలను శక్తులను యజ్ఞీయ కర్మకాండలో యాజకుల మనోభావాలను ప్రేరేపించుటకు ఉపయోగించు కుంటారు.

### క్రమశిక్షణ కేంద్రము - యజ్ఞ సంసద్

యజ్ఞీయ అనుశాసనాన్ని పాటించటానికి పాటింపచేయ దానికి యజ్ఞ సంసద్ ఏర్పాటు చేయబడుతుంది. యజ్ఞ సంసద్ ప్రముఖ బాధ్యతలు క్రింది విధముగా ఉంటాయి.

**యజ్ఞాచార్యుడు:** ఆచార్యుని రుద్రయామల తంత్రములో సర్వాధ్యక్షుడుగా వర్ణించారు. ఏ విశిష్ట ప్రయోజనము కొరకు యజ్ఞము చేయబడుచున్నదో దానికి అనుగుణ్యమైన కర్మకాండ జ్ఞానము ఉండుటయే గాక పని ప్రాముఖ్యత బట్టి తగిన తపశ్శక్తి కూడా ఉండాలి. దేవశక్తులను ఆహ్వానించి ఆకర్షించ టానికి యజ్ఞ ఉద్దేశ్య అనుకూలముగా సూక్ష్మశక్తి ప్రవాహాలు తయారుచేయడము తపశ్శక్తి వల్లనే సాధ్యమవుతుంది దశరథుని పుత్రకామేష్టి యజ్ఞము అందరికీ తెలుసు. వశిష్టుడు ఆ రోజులలో అతి ఎక్కువ తపస్సంపన్నులైనప్పటికి ఆ యజ్ఞ ఉద్దేశ్యం పూర్తి కొరకు, ఉపయుక్తమైన తపశ్శక్తిగల ఋష్యశృంగుని ఆచార్యులుగా నియమించారు. అందువల్లనే ఆ యజ్ఞము అంత శ్రేష్ఠ ఫలితాలను ఇచ్చింది.

: సమాప్తం :

---

## ఆత్మబలము యొక్క మహిమ

*ఒకరోజు మొగల్ దర్బారులో చాలా హడావుడిగా ఉంది. మొగలులతో సంధి మంతనాలు జరపటానికి సిక్కు గురువు గోవిందసింహ్ ఆహ్వానింపబడ్డాడు. అందరిముఖాలలోను ఆందోళన, ఆనందము మిళితమై ఉన్నాయి. గురువు విచ్చేశాడు. మొగలులలో ఒక మౌల్వీకి ఆయనను గురువు అనడమే ఇష్టంగా లేదు. సైన్యాన్ని నడిపించి యుద్ధం చేసేవాడు గురువెట్లా అవుతాడు? గురువైనవాడు విద్యను గాని, ఆధ్యాత్మిక విషయాలుగాని నేర్పించాలి.*

*మౌల్వీ: అయ్యా! మీరు గురువులు కదా! ఏదైనా ఒక మహిమను చేసి చూపండి.*

*గురువు: (నవ్వుతూ) మౌల్వీగారూ! ఆధ్యాత్మికతకు, మహిమలకు సంబంధం లేదు. మహిమలు చూపటమే గురువుల పనికాదు.*

*మౌల్వీ: మరి మీ పని ఏమిటి?*

*గురువు: శిష్యులకు సరియైన మార్గదర్శనం చేయటం.*

*మౌల్వీ: ఏదైనా ఒక చిన్న మహిమ చూపండి.*

*గురువు: మహిమలే చూడాలనుకుంటే నీ చుట్టు ప్రక్కల వీక్షించి దానిని సృష్టించిన భగవంతుని మహిమను చూడు.*

*మౌల్వీ: నేను మానవుని మహిమను చూడాలనుకుంటున్నాను.*

*గురువు: అయితే మీ చక్రవర్తి ఒక్కడే ఇంతపెద్ద రాజ్యాన్ని తన కన్నుసన్నల్లో నడుపుతున్నారు కదా! అది మానవ మహిమయే.*

*మౌల్వీ: లేదు నేను మీ పరిధిలోనున్న మహిమను చూడాలనుకుంటున్నాను.*

*గోవిందసింహ్‌కు చిర్రెత్తుకొచ్చింది. ఒక్కసారిగా లేచి నిలబడ్డాడు. ఒరలోనుండి ఖడ్గాన్ని సర్రునలాగాడు "నా పరిధిలో మహిమను చూడాలనుకుంటే ధైర్యంగా నా ముందుకు రా" అంటూ సింహగర్జన చేశాడు. మౌల్వీకి ముచ్చెమటలు పట్టినవి. పాదుషా కనుక వినయంగా బుజ్జగించి మౌల్వీని తన ప్రక్కకు చేర్చుకోకపోయినట్లైతే ఆతని తల మొండెం నుండి వేరైపోయేదే. ఆత్మబలము యొక్క మహిమ ఎలాంటిదో అందరూ చూచేవారు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం : శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

---


**పిల్లల్ని ప్రేమతో పెంచండి కాని పైసల్తో కాదు వాళ్ళు పాడైపోతే పోయే ప్రాణాలు మీవే**

పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-48

# హరిజనోద్ధరణకై కులవ్యవస్థ నిర్మూలనకై శ్రీరామ్ కృషి - 2

**ఉద్యమ వ్యవహారాలను దళితులే చూచుకొనసాగారు**

దళితుల ఉన్నతికై ఉద్దేశించి, ప్రారంభించిన ఉద్యమ నిర్వహణ, బాధ్యతలను, దళిత సభ్యులే చేపట్టుట మంచిది అని శ్రీరామ్ వారికి నచ్చచెప్పి దళితుడైన మంగీలాల్‌కు ఈ బాధ్యతలను అప్పగించుట జరిగింది.



ప్రవచనం ప్రారంభించిన 8-10 రోజులలో ఉద్యమస్ఫూర్తి శ్రోతలలో, ప్రజలలో ఊపందుకొన్నది. స్వాతంత్ర్య ఉద్యమ కార్యకర్తలు, రచయితలు, వార్తావిలేఖరులు మున్నగువారంతా ఉద్యమంలో భాగస్వాములు కాసాగారు. దీనికితోడు సైనిక్ పత్రిక కార్యాలయంలో పనిచేసేవారు కూడా మరింత మందిని ఈ ఉద్యమంలో చేర్చసాగారు. ఈ రీతిగా ఉద్యమం దినదినం వ్యాప్తి కాసాగింది.

ఒకరోజు ప్రసిద్ధుడైన బాబు గులాబ్‌రాయ్, శ్రీరామ్ ప్రవచనాన్ని వినుట జరిగింది. కథా ప్రవచనాన్ని ఆసాంతం విన్న గులాబ్‌రాయ్‌గారికి శ్రీరామ్ కథాగమనం ఒక వినూత్న అనుభూతిని మిగిల్చింది. కథానంతరము, గులాబ్‌రాయ్ వేదిక వద్దకు వెళ్ళి శ్రీరామ్‌ను అభినందిస్తూ ఇలా అన్నారు. "శ్రీరామ్! మీ భాగవత కథా ప్రవచనం, హిమాలయాల నుండి మైదాన ప్రాంతంలోనికి ప్రవహించెడి గంగానదీ ప్రవాహాన్ని తలపింప జేసింది. హిమాలయాల్లో అమితవేగంతో గలగలా శబ్దాలు చేస్తూ భయాన్నిగొల్పెడి గంగ నేలపైకి రాగానే మెల్లిగా ప్రవహిస్తూ నిర్మలత్వాన్ని, నిశ్చలత్వాన్ని సంతరించుకుంటుంది. నిర్భయంగా, నిర్మోహమాటంగా, ఆత్మవిశ్వాసంతో శ్రీరామ్ నోటినుండి వెలువడిన భాగవత కథా ప్రవచనం, గులాబ్ రాయ్‌ను ఎంతో మంత్రముగ్ధుణ్ణి చేసి కట్టి పడవేసింది. నిన్నటి వరకు శ్రీరామ్ "నాకు ఒక పత్రికా విలేఖరిగా రచయితగా, సమాజసేవకునిగా మాత్రమే తెలుసు. కాని నేడు అతనిలో ఒక నూతన వ్యక్తిని కాంచాను. అతడు కథా వ్యాసునిగా నాకు నేడు కనపడుచున్నాడు. ఈ సందర్భంగా నేటి నుండి శ్రీరామ్‌ను పండిట్‌జీగా పిలుస్తాను" అన్నారు. గులాబ్ రాయ్. మీరు కూడా (శ్రోతలు) శ్రీరామ్‌ను ఇదేపేరుతో సంబోధించినచో నేను ఆనందిస్తాను అన్నారు.

**నేటి నుండి పండిట్ శ్రీరామ్**

సభలోని శ్రోతలంతా మూక్కుమ్మడిగా గులాబ్‌రాయ్ ప్రతిపాదనకు ఆమోదిస్తూ చప్పట్లు కొట్టారు. ఈవిధంగా శ్రీరామ్ మట్టా పేరు. "పండిట్" శ్రీరామ్‌శర్మ మట్టాగా ప్రజలనోళ్ళలో స్థిర పడిపోయింది. ఆ రోజులలో "పండిట్" బిరుదును ఇచ్చుట అంత సులభం కాదు- వ్యక్తి ఒక ప్రాచీన గ్రంధసారాన్ని ఆపోచన పట్టి దానిపై సంపూర్ణ అవగాహనను పెంచుకొని, స్వచ్ఛమైన మనస్సును కలిగి పవిత్రతను పెంపొందించుకున్ననే గాని అతనిని "పండిట్" అనెడి బిరుదుతో పిలచుట జరుగుతుంది. ఒక జ్ఞాని నోటినుండి పై మెచ్చుకోలు వచ్చుట. అత్యంత ముదావహం. ప్రస్తుతం ఒక పేరెన్నికగన్న గులాబ్‌రాయ్ నోటివెంట ఈ మెచ్చుకోలు వచ్చుట అత్యంత ఆనందదాయకం. ఆనాటి నుండి కథా గానం వినుటకై వచ్చిన వారంతా శ్రీరామ్‌ను మట్టాజీ లేక "పండిట్ జీ" అని పిలువసాగారు. కాని వయో వృద్ధులు, వయోజన కార్యకర్తలు, స్నేహితులు, శ్రీరామ్ అని పిలుస్తూనే ఉన్నారు.

మాసంపాటు పారాయణ పూర్తి అయ్యేసరికి శ్రీరామ్ లక్ష్యం నెరవేరింది. ఒక భాగవత పుస్తక పఠనంపై దక్షిణ క్రింద నూట దెబ్బది రూపాయిలు ప్రోగుపడ్డది. కార్యక్రమం ఖర్చు శ్రీరామ్ తదితర కార్యకర్తలు భరించారు. తదుపరి ఈ కార్యక్రమానికి వసూలైన నిధి మొత్తాన్ని హరిజనోద్ధరణ కార్యక్రమానికి వినియోగించ నిర్ణయించారు. ఆశించిన నిధి మొత్తాన్ని గ్రామంలోని ధనికులను, ముఖ్యులను సంప్రదించి వసూలు చేయగల సామర్థ్యమున్నది. దీని ప్రధాన లక్ష్యం నిధిని ప్రోగుచేయుటకాక, సమాజంలోని 250-300 మంది ప్రజలకు ఈ ఉద్యమ సందేశాన్ని చేర్చుట, వారి మనస్సులను పవిత్రం చేసి సమాజాన్ని సంస్కరించుట.

**పొదుపు చేయాల్సిన చోట ఖర్చు చేయకు. ఖర్చు చేయాల్సిన చోట పొదుపు చేయకు**

భాగవత కథ ప్రవచన విషయం, తాయిజీకి 20-30 రోజుల క్రితమే తెలిసింది. తండ్రి అడుగుజాడల్లో నడచుచున్న కుమారుని చూచి ఆమె ఎంతో సంతోష పడింది. తదుపరి కృష్ణుని విగ్రహం ముందు ప్రణమిల్లి తన ధన్యవాదాలు తెలుపు కుంటూ – "ప్రభూ! నా ప్రియపుత్రుని, మా పూర్వీకులు నడచిన బాటలో నడిపించు" అని కోరుకొంది. వెనువెంటనే తన ఆలోచనను మార్చుకొని "తన కుమారుని ఏ మార్గంలో నడిపించాలో తన భర్తకు, తన కన్నా బాగా తెలుసు. ఆయన ఎందుకు నడిపించలేదు కుమారుని – తాను తొందరపడ్డానేమో" అని తనను తాను సవరించుకొంటూ సందిగ్ధంలో పడిపోయింది. ఈ సందిగ్ధావస్థలో ఆమె కృష్ణుని విగ్రహం నుండి దూరంగా వెళ్ళింది. రెండు వారాల తరువాత ప్రజలంతా తన కుమారుని ప్రేమతో, గౌరవంగా "పండిట్ జీ" పిలుస్తున్నారని తెలుసుకొని ఎంతగానో భావసంవేదనలకు లోనయ్యింది.

## తల్లి వేచిచూచుట

ఆరోజు కుమారునిరాకకై నిజంగా ఆమె ఎదురు చూచింది. కుమారుడు కథా ప్రవచనం చేస్తున్నాడని తెలిసిన నాటినుండి కుమారుని కలిసి "పండిట్" అని నోరారా పిలవాలని మాతృ హృదయం ఉవ్విళ్ళూరుచున్నది. శ్రీరామ్ ఆగ్రా నుండి వస్తున్నాడని తెలిసి ఇంటి గేటు వద్దకు ఇంటిలోనికి పలుమార్లు వచ్చిపో సాగింది. ఇంతకు పూర్వంలా కాక శ్రీరామ్ స్నేహితులను చూడకుండా నేరుగా ఇంటికి చేరుకునేలా చూడమని శ్రీరామ్ అనుచరులను ఆదేశించింది. దారిలో శ్రీరామ్ స్నేహితుల వద్ద ఆగక, నేరుగా వచ్చి కన్నతల్లిని దర్శించుకొనమని ఆదేశాలిచ్చింది అతని స్నేహితులకు.

ఇంటిలో తాయిజీతోపాటు శ్రీరామ్‌రాక కొరకై వేయి కళ్ళతో ఎదురుచూస్తూ, భావావేశంతో, భావోద్వేగంతో నిండిపోయి, ఉక్కిరి బిక్కిరై మూగబోయిన మనస్సుతో నిశ్శబ్దంగా మరో వ్యక్తి ఎదురు చూస్తున్నది. ఇంటిలో ఆమెను "బహురాణి" అనగా కోడలు అని పిలుస్తారు. పండిట్‌జీ స్నేహితులు ఆమెను సోదరుని భార్య (బాబాజీ)గా సంభోధిస్తుంటారు. పండిట్‌జీ ఆమెను ప్రేమ పూర్వకంగా తన కుమారుడు ఓమ్‌ప్రకాష్ పేరుతో పిలుస్తూ ఉండేవాడు. తరువాత కుమార్తె పుట్టిననాటినుండి ఆమెను కుమార్తె పేరుతో దయామ తల్లి (దయాజీమాత) లేక 'దయ' అని సంభోధించేవారు. బహుశ ఆ నిశ్శబ్ద సాధకురాలి అసలు పేరైన "సరస్వతిదేవి"ని మరచిపోయి ఉంటారు. గృహస్థ ఆశ్రమంలోని సాధనను అనుభవంలోనికి తెచ్చుకోవాలన్నచో దానిని ఆచరించక తప్పదేమో! ఆనాటి ఆచార వ్యవహారముల అనుసరించి, కోడలు తన భర్తను కుమారుని పేరుతో సంభోధించుట ఆనవాయితీ! అసలు నామంతో భర్తను సంబోధించుట జరిగేదికాదు. వివాహానంతరం శ్రీరామ్ ఇంటిలో గడిపింది బహు కొద్ది కాలమే – తన సమయాన్నంతా దేశస్వాతంత్ర్య ఉద్యమంలో మరియు సైనిక్ పత్రికలో గడిపేవారు. పండిట్‌జీ భార్య కూడా ఎంతో ఆతృతతో భర్త రాకకై ఎదురు చూడసాగింది.

## కుటుంబాన్ని కలిసికొనుట

ఇంటి ప్రధాన గుమ్మం వద్ద సందడిని గమనించిన కోడలికి భర్త శ్రీరామ్ వస్తున్నాడని తెలిసింది. తాయిజీ మోముపై ఆనందం తొణికసలాడుట ప్రస్ఫుటంగా కన్పించుచున్నది. కుమారుని రాక, ఆమెలో భర్తలేని లోటును కనిపించకుండా చేసింది. (భారతీయ విధవరాలైన స్త్రీ మోములో భర్తలేనిలోటు కనిపిస్తూ ఉండుట సహజం) తన కుమారుడు తన మొదటి సంపాదనను 'పండిట్ జీ' బిరుదును తీసికొని, సన్మార్గంలో నడుస్తూ, గౌరవంతో ఇంటికి చేరుటను చూచిన ఆమె ఒకింత గర్వంగా ఉంది. ఆమె ముందుకు వచ్చి, కుమారునికి స్వాగతం పలుకుటకై నిలబడి కుమారుని ఇలా అన్నది – "నా శ్రీరామ్ పండిట్ అయ్యారు. – పెద్ద పెద్ద పేరెన్నిక గన్న పండితులు నా శ్రీరామ్‌ను 'పండిత్' అని పిలుస్తున్నారు. నా కొరకు ఏమి తెచ్చారు? బాబుకు ఏమైన బహుమతులు తెచ్చావా? ఓమ్‌కు మరియు దయకు బొమ్మలు తెచ్చి ఉంటావని భావిస్తున్నాను" అంది.

అందరు చూస్తుండగా శ్రీరామ్ తన తల్లికి చీరను బహుకరించగా ఆమె కన్నులు ఆనందంతో చెమర్చాయి. ఆనంద భాష్పాలు రాల్చాయి. ప్రేమతో నిండిన ఆనందభాష్పాలు వస్తుండగా తన కోడలికి, మనుమనికి ఏమి తెచ్చాడో చూడాలని తల్లి ఎదురుచూడసాగింది. ఆమె తన ఆనందాన్ని పట్టజాలక తన కుమారుని పూజాగదిలోనికి తీసికెళ్ళింది. అచ్చట కృష్ణునికి ప్రణమిల్లి తన కుమారుని వీపుపై నిమిరి ఆశీర్వదించింది. ఒక రోజంతా తన కుటుంబసభ్యులతో పిల్లలతో భార్యతో గడిపాదు. భార్య ఎట్టి ఫిర్యాదు చేయలేదు భర్తను ఏమికోరలేదు.

**ఎప్పుడూ ఒకరికి ఇవ్వడం నేర్చుకో, తీసుకోవడం కాదు**

ఆమె ఆరోగ్యసౌభాగ్యాల గురించి ప్రశ్నించగా భార్య వినయంగా ఇలా బదులిచ్చింది "నాకు ఎట్టిలోటు లేదు. మీకు సేవలందించెడి అదృష్టం నాకు లభించి ఉన్నచో నాకు ఈ ఒక్క అసంతృప్తి కూడా ఉండేది కాదు" అన్నది.

దీనికి బదులిస్తూ "తాయిజీతో చెప్పి, నిన్ను వెంటనే పిలుస్తాను. తరచుగా నేను ఇంటికి వస్తూ ఉంటాను." బాబును, ఆగ్రాలో ఒక పాఠశాలలో చేర్పిద్దాం! అప్పుడు బాబు మనతోనే ఉంటాడు" అన్నాడు. భార్య నిశ్శబ్దంగా వినసాగింది.

## గాంధీజీని తిరిగి కలిసికొనుట

గాంధీజీ ఆగ్రాను సందర్శించుట జరిగింది. ఆయన బహిరంగ సభను ఆగ్రాలోని కచ్చేరిరోడ్‌లో ఏర్పాటు చేశారు. ఆయన ఆగ్రాలో 4 గంటలు మాత్రమే బసచేయాల్సి ఉంది. అందులకై రెండే కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఒకటి కార్యకర్తలతో సమావేశం, రెండవది ప్రజలతో బహిరంగ సమావేశం – కాంగ్రెసు పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. కార్యకర్తల ఉద్దేశిస్తూ గాంధీజీ ఇలా అన్నారు "ఒక సంవత్సరం పాటు దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని మరచిపోవాలని నిశ్చయించుకున్నాను. మన సమాజంలోని ప్రజలలో 30 శాతం వెనుకబడిన తరగతులు అణగద్రొక్కబడిన వారు, దళితులు మన్నగువారు ఉన్నారు. వీరిని ఉద్ధరించని సమాజానికి స్వాతంత్ర్యం వచ్చినా అది కేవలం 15 శాతం ప్రజలకు మాత్రమే ఉపయుక్తం. అధిక సంఖ్యాకులు దారిద్ర్య రేఖకు దిగువలోనే ఉండిపోయి ఉన్నారు. అదే సమావేశంలో గాంధీజీకి, శ్రీరామ్‌ను పరిచయం చేయుట జరిగింది. ఆ ప్రాంతంలో హరిజనోద్ధరణకై శ్రీరామ్ చేసిన కృషిని గాంధీజీకి, పాలీవాల్జీ తెలియజేశారు. దీనిలో భాగంగా భాగవత కథ ప్రవచనం మరియు దక్షిణల గురించి తెలుపగా గాంధీజీ నవ్వుతూ ఇలా అన్నారు – "పుస్తకానికై అర్పించిన దక్షిణ భగవంతునికి చెందుతుంది. భగవంతుని సొమ్మును ఆయన ప్రజలకు వినియోగించుట ఒక వినూత్న ప్రయోగం" – సాయంత్రం జరుగనున్న బహిరంగ సమావేశానికి నాకు ఒక ఆలోచన తోచింది.

కచేరిరోడ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు వెయ్యి మంది వరకు హాజరైనారు. ఆనాడు ఆగ్రా పట్టణ జనాభా 25000 నుండి 30000 వరకు ఉంటుంది. ఇట్టి స్థితిలో సమావేశానికి వచ్చిన జనాభా అత్యధికమే! ఆ సమావేశంలో గాంధీజీ శ్రీరామ్ భాగవత కథా శ్రవణాన్ని ప్రస్తావించారు. దీని నుంచి పొందిన స్ఫూర్తిని గురించి తెలుపుచూ "భగవంతుని సంపదలను సమాజ కళ్యాణానికి, హరిజనోద్ధరణకు వినియోగించుట చాలా స్ఫూర్తిదాయకం – "పండిట్ శ్రీరామ్ తన భాగవతకథ ప్రచారాన్ని హరిజనోద్ధరణకై వినియోగించుట చాలా స్ఫూర్తిదాయకం. తనకెంతో సంతోషాన్ని కలిగించింది. ఇచ్చుట ఆ ధనాన్ని వినియోగించిన తీరు స్ఫూర్తిదాయకం, ప్రేరణాత్మకమైనది, శ్రీరామ్‌ను, పండిట్ అని పిలచిన వ్యక్తి చాలా సమర్థవంతుడు, సరియైన దృక్పథం కలిగినవాడు."

## సభలో ప్రసంగిస్తూ "పండిట్ జీ"ని ప్రస్తావించుట

తన ప్రసంగంలో బాపూజీ, హరిజనోద్ధరణ గురించి సవివరంగా మాట్లాడారు. ఆయన ప్రసంగంలో హరిజనులను దేవాలయాల లోనికి అనుమతించుట, సమాజ బావుల నుండి నీటిని తీసుకువెళ్ళనిచ్చుట, వారికి కూడా చక్కని హోదాను, సమాన ప్రతిపత్తిని సమాజంలో కల్పించుట, చేయాలన్నారు. హరిజనోద్ధరణ నిధికై ధనాన్ని ఇచ్చుట గూర్చిన సంభాషణ ప్రారంభం కాగా కొందరు వచ్చి, శ్రీరామ్‌ను నాయకత్వం వహించమని చెప్పుట జరిగింది. దీనిని చూచిన గాంధీజీ వెంటనే స్పందిస్తూ "ఈ ఉద్యమనిధికై సమాజంలో ఉన్నత వర్గానికి చెందిన ఒక పుణ్య పుంగవుడు ముందుకు వచ్చి దానికి మార్గనిర్దేశనం చేయుట చాలా సంతోషదాయకం. ఉన్నత వర్గానికి చెందిన మనం తగినంత చొరవతీసుకొని సమాజ కళ్యాణం కోసం ఇవ్వాలి. మన పూర్వీకులు చేసిన తప్పిదాలను మనం సవరించాలి. ఇప్పుడు దళితుల ఉద్ధరించుట సంవత్సరానికి మించి పట్టదు" అన్నారు.

శ్రీరామ్ తాను ప్రోదిచేసిన నిధిని హరిజనుల ఉద్ధరణకై వినియోగించుటను చూచి గాంధీజీ భావోద్వేగానికి లోనైనారు. గాంధీజీ నిలబడి శ్రీరామ్ రెండు చేతులను తన చేతులలోనికి తీసికొని, మూసి ఉంచిన శ్రీరామ్ గుప్పిటను తన ముక్కుతో తాకారు. (పెద్దలు, ప్రేమతో ఆదరాభిమానాలతో పిన్నల నొసటిని ముద్దాడుట వంటిది ఈ చర్య.) గాంధీజీ శ్రీరామ్‌ను ఉద్దేశించి ఇలా అన్నారు – "భాగవత కథ అందరికీ వర్తిస్తుంది అవునా? ఈ ఆధ్యాత్మిక సంస్థ (గ్రంథము) ప్రేమతో నిండిన ఆర్ద్రతతో నిండిన హృదయం గల వారికి మాత్రమే రుచిస్తుంది.

**భయం, కంగారు ఇవి మన నమ్మకాన్ని ఆత్మస్థైర్యాన్ని దృష్టిని పూర్తిగా ధ్వంసం చేయగలవు**

ఇది అహంకారులను, తర్కానికి దిగేవారిని, అతి తెలివిగల వారిని సంతృప్తిపరచజాలదు. ఇది నిజమేనా?" అని ప్రశ్నించారు.

గాంధీజీ మాటలకు శ్రీరామ్ అవాక్కయిపొయ్యాడు. ఆనందంతో మునిగిపోయాడు. వెంటనే జవాబు చెప్పలేదు – "మీరు చెప్పింది యదార్ధం" అని చెప్పాలనుకొని చెప్పజాలక తలపంకించి మిన్నకుండిపోయాడు. బాపూజీ మరోప్రశ్న అడిగాడు. శ్రీరామ్‌ను – "నీ జేబు నుండి నీ స్వార్జితాన్ని ఏమిచ్చావు? నూటడెబ్బది రూపాయిలు భాగవతకథకు చెందినది కదా! నీదేమీటి?"

దీనిని "నేను రహస్యంగా ఉంచదల్చాను!" పండిట్‌జీ, ఓర్మితో నమ్రతతో అంటూ "మీరు అనుమతిస్తే ఎవ్వరికి చెప్పనని మాట ఇస్తే మీ చెవిలో చెప్పుతాను" అన్నాడు శ్రీరామ్. గాంధీజీ ఒప్పుకున్నాడు. శ్రీరామ్ గాంధీజీ చెవిలో చెప్పగా, ఆనందంలో తెలియాడుతూ శ్రీరామ్ బుగ్గపై నిమిరాడు గాంధీజీ!

అనేక సంవత్సరాలు గడచిన పిదప, పూజ్య గురువర్యులు ఈ రహస్యాన్ని బహిర్గతం చేస్తూ తన తండ్రి ద్వారా సంక్రమించిన చొక్కా బంగారు గుండీలను బాపూజీ నిధికి అందించాడు. ఈ గుండీలను తీసికొని వచ్చుటకై ఆవల్‌ఖేడా వెళ్ళాడు. కోడలికి ఈ గుండీలను అప్పగించింది తాయిజీ! శ్రీరామ్ నిర్ణయాన్ని విన్న తాయిజీ గర్వంతో ఉప్పొంగిపోతూ కుమారుని చేతిలో పెట్టింది ఆ గుండీలను.

బాపుజీ ఇలా అన్నారు – "నీ వద్ద ఇంకా కొంత, మిగిలి ఉంది, దానిని కూడా ఇచ్చేయి!" దానికి – పండిట్‌జీ ఆశ్చర్య పోయి గాంధీజీ వంక చూస్తూ ఇలా అన్నాడు – "నేను ఏమి దాచలేదు" అనగానే గాంధీజీ అన్నారు – "నీ చొక్కా జేబులో ఉన్నది బహుశ రూపాయి బిళ్ళ అయి ఉంటుంది. నాకు ఇచ్చటికి కనిపించుచున్నది." అన్నారు.

శ్రీరామ్ తన చేతిని జేబులో పెట్టాడు. బాపూజీ తీక్షణ దృష్టి, కలుపుగోలుతనం, హాస్యం, శ్రీరామ్‌ను నవ్వించింది. నవ్వుతూ ఆ రూపాయిని తీసి బాపు పాదాలవద్ద పెట్టాడు. చెయ్యిని ఎత్తుతూ బాపూజీ ఇలా అన్నారు "ఇప్పుడు బాగున్నది– బ్రాహ్మణుడు దేవునిపై నమ్మకముంచాలి. తన రోజువారి పోషణను గురించి బాధపడరాదు నేను కూడా నీ వద్ద ఏమి ఉంచుకోను–కులపరంగా నేను వైశ్యుడను, వ్యాపారకులస్తుడను – అయినా నేను అపరిగ్రహన్ని పాటిస్తాను – ఏమి ఉంచుకోను నాకై."

పండిట్‌జీ వెంటనే జవాబిచ్చాడు–"బాపూజీ నాకై ఉంచు కొనకుండుట నా నిర్ణయం కూడా – నా సమస్యలను భగవంతునిపై మోపాను–ఆయనే చూచుకుంటాడు" – అన్నాడు.

(సశేషం)

*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## ప్రజాసేవలో బంధాలకు తావు లేదు

*మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికా నుండి తిరిగి వచ్చారు. తన సంపదనంతా సామాజిక కార్యాల కోసం ఇచ్చి వేయాలన్న దృఢనిశ్చయంతో వచ్చారు. తన సంబంధీకులను, నలుగురు కుమారులను సమావేశపరిచారు. విషయాన్ని వివరించారు. పుత్రులచేత సంతకాలు తీసికున్నారు. ఇప్పుడు గాంధీ పూర్తిగా నిరుపేద అయ్యారు. విధవరాలైన సోదరి నుండి లేఖ వచ్చింది. పాపం ఆమెకు కూడ విధవరాలైన ఏకైక కుమార్తె ఉన్నది. ఇరువురు కూడ గాంధీగారి మీదే ఆధారపడి జీవిస్తున్నారు. ఈయన సర్వసంగ పరిత్యాగంతో వారు కూడా అనాథలైపోయారు.*

*"అన్నయ్యా! ఇప్పుడు మేము పొరుగువారి దగ్గర పిండి విసిరి జీవిస్తున్నాము. మాకేదైనా ఆధారం చూపించు" అని వ్రాసింది.*

*వెంటనే మహాత్ముడు చెల్లెలికి సమాధానం వ్రాశాడు. "చెల్లీ పిండి విసిరి జీవించటం ఏ రకంగా చూచినా మంచిదే శరీరారోగ్యం చక్కబడుతుంది. మూడు పూటలా కడుపు నిండుతోంది. మేము కూడ ఇక్కడ పిండి విసురుతూనే ఉన్నాము. ఇష్టమైతే మీరిద్దరూ కూడ ఇక్కడకు రావచ్చు. నాతో కలసి శ్రమించవచ్చు. ప్రజాసేవ చేయనూ వచ్చు. అందరం కలసే జీవిద్దాం. అంతేకాని నా ద్వారా వేరే సహాయం అర్థించటం వ్యర్థం. ప్రజాసేవలో నేను, నా వారు అన్న బంధానికి తావే లేదు."*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం : శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

**నిన్ను నమ్మినవారిని మోసగించకు**

సూక్ష్మీకరణ సాధన - 7

# మనీషీ - ఋషి రూపంలో నా పరోక్ష భూమిక

మనిషి తన అంతశ్శక్తి ద్వారా, ప్రసుప్తసామర్థ్యాల ప్రకటీకరణ ద్వారా ఎత్తుకు ఎదుగుతాడు. ఇది నిజమైనప్పటికి తప-తితీక్షల వలన ప్రఖరము (తీవ్రము) చేయబడ్డ వాతావరణము, శిక్ష, సాన్నిధ్య-సత్సంగాలు, పరామర్శ-అనుకరణములు కూడా వ్యక్తి సామర్థ్యమును పెంచటానికి చాలా శక్తివంతమైన పాత్రను నిర్వహిస్తాయి. సాధారణ శ్రేణికి చెందిన సామాన్యవ్యక్తి కూడా ఒక ప్రచండశక్తి సహాయంతో అసంభవమనిపించే పురుషార్థమును సంభవము చేస్తాడు. వారు యుగసాధనారతులై లేఖిని-వాణి ద్వారా ఒక సశక్త తంత్రము (Medium) ద్వారా జనమానస ఆలోచనాస్థాయిని పెంచేవారు. ఇటువంటి సాధన అనేక ఉచ్చస్తరీయ వ్యక్తిత్వములకు జన్మనిచ్చి వారి ప్రసుప్త సామర్థ్యమును మేలుకొలిపి, సవ్యమైన దారి చూపి, సమాజంలో వాంఛనీయ, అవసరమైన మార్పులు తీసుకొని వచ్చేవారు. శారీరక స్థితిలో సామాన్యులుగా దృష్టిగోచరమయ్యే వ్యక్తులు ప్రతిభ-కుశలత-ఆలోచనలలో శ్రేష్ఠత్వముతో నిండిపోతారు.

ముని, ఋషి అనే రెండు వర్గాలు, ఆధ్యాత్మిక క్షేత్ర ప్రతిభలు అనేది సర్వవిదితమే. ఋషి-శరీరము యొక్క చేతనాత్మక అనుసంధానము తపశ్చర్యల ద్వారా చేసి ఆ ఫలితాలను జన సముదాయ లాభము కొరకు అందచేసేవాడు. ముని-చింతన, మనన, స్వాధ్యాయాల ద్వారా జనమానస పరిష్కారము చేస్తాడు. ఒకరు పవిత్రతకు ప్రతీక అయితే, ఇంకొకరు ప్రఖరత (తీవ్రత)కు ప్రతీక. ఇరువురు తమ స్వరూపాలను విరాట్ వ్యాపకము చేయుటకు తపస్సాధనలుచేసి, సూక్ష్మీకృతమై, ఆత్మ బల సంపన్నులై, యుగచింతనా ప్రవాహాన్ని మార్చగలిగే శక్తి సంపన్నులవుతారు. మునులు, ప్రత్యక్షసాధనములు ప్రయోగించ వలసి వస్తే, ఋషికి అది అనివార్యము కాదు. వారు తమ సూక్ష్మరూపంలో కూడా వాతావరణమును ఆందోళితము (సంక్షోభింప) చేసి, సుసంస్కారాలను పెంపుచేయగలరు.

లోకవ్యవహారంలో 'మనీషీ' అనే పదము తన మనస్సును పూర్తిగా వశం గావించుకున్న ప్రతిభావంతులకు వర్తిస్తుంది. అతను మనస్సుద్వారా సంచలితుడు కాకుండా, తన ఆలోచనల ద్వారా మనస్సును నడిపిస్తాడు. అతనిని మనీషీ అని, ఇటువంటి ప్రజ్ఞను 'మనీషా' అని అంటారు. శాస్త్రకారులు ఇలా అంటారు. 'మనీషా అస్తి యేషాం తే మనీషి నః' కాని ఇలా కూడ అన్నారు. 'మనీషి నస్తు భవన్తి, పాపాని నభవన్తి' అనగా మనీషులు ఎంతోమంది ఉంటారు. పెద్దపెద్ద తెలివైనవారు వుంటారు. కానీ వారంతా పవిత్రులై వుండకపోవచ్చు. ప్రతిభాశాలి, బుద్ధిమంతుడై ఉండటం ఒకయెత్తు, పవిత్రశుద్ధ అంతఃకరణ ఉండుట కూడా మరో ఎత్తు. ఇది ఈనాటి పరిస్థితులలో అక్షర సత్యము. ఈనాడు ప్రతిభాశీలురైన బుద్ధిజీవులు, రచయితలు, అన్వేషకులు, వైజ్ఞానికులు అనేకమంది దేశదేశాంత రాళములలో విస్తరించి ఉన్నారు. కానీ వారు తపస్సు ద్వారా అంతఃసాధన కావించుకొని, పవిత్రత సంపాదించుకొనలేదు

ఈనాడు సాహిత్యానికి లోటు ఏమున్నది? అచ్చవుతున్న పత్రికలు, పుస్తకాల సంఖ్య చూస్తే మనీషుల సంఖ్య, చదివేవారి సంఖ్య చాలా పెరిగిందనే అనిపిస్తున్నది. కానీ వాటి ప్రభావం ఎందుకు కనిపించుట లేదు? ఎందుకు రచయితల కలము కుచ్ఛిత సామగ్రులను పెంపొందిస్తోంది? అటువంటి సాహిత్యాన్ని చదివి ఆనందించేవారి సంఖ్య పెరుగుతున్నది. దీనికి కారణము ఒక్కటే. 'పావనాని న భవన్తి'- ఇంత పరిమాణంలో ఉచ్చస్తరీయ ఆలోచనలను ఉత్కృష్టము చేసే సాహిత్యము రచించబడి వుంటే దాని రుచి జనసామాన్యులకు కలుగజేసి ఉంటే, ఈనాడు సమాజంలో కనిపించే వికృతులు ఉండేవి కావు. నిత్యజీవిత సమస్యలకు సమాధానము, తపోనిధులైన యుగమనీషుల చేతిలోనే ఉన్నది.

నేను ఇంతకు పూర్వమే చెప్పాను, 'నవయుగం ఆలోచనల శోధన వలన మాత్రమే వస్తుంది. క్రాంతి అనేది నెత్తురు-తుపాకీల వలన కాక, ఆలోచనలతో-ఆలోచనలు ఢీకొంటే వస్తుంది. నవనిర్మాణము సదాలోచనల ప్రతిష్ఠాపన వల్లనే సంభవము. ఇంతవరకు సమాజంలో ప్రవేశించిన కుళ్ళు, తెలివైనవారివల్లనే జరిగింది. ద్వేషకలహాలతో జాతివాదము, మతవాదము వ్యాపకనరసంహారములలో బుద్ధిజీవి వర్గమే ప్రముఖపాత్ర వహించింది. వారు సన్మార్గగాములైవుంటే, వారి అంతఃకరణములు పవిత్రంగా ఉండి ఉంటే, తపశ్శక్తి బలము

నిన్ను ఇష్టపడినవారిపై ఆధిక్యత ప్రదర్శించకు

వారికి లభించివుండేది, వారు విధేయాత్మక (positive) ఆలోచనా ప్రవాహానికి జన్మనిచ్చి ఉండేవారు, సత్సాహిత్య రచన చేసి ఉండేవారు. అటువంటి ఆందోళనలు (ఉద్యమాలు) నడిపి ఉండేవారు. హిట్లర్, నీట్షే యొక్క సూపర్‌మాన్ స్వరూపమైన అధినాయకుడిని, తనలో సాకారము చేసుకొనదలచినప్పుడు మొట్టమొదట సంపూర్ణ రాష్ట్ర ఆలోచనాసరళిని అటువైపు త్రిప్పాడు. అధ్యాపక, వైజ్ఞానికవర్గము, నాజీవాదము యొక్క సమర్థకులుగా మారారు. దీనికి కారణము అతను వ్రాసిన 'మీన్ కెంప్'. ఆతర్వాత సంపూర్ణ దేశం యొక్క పాఠ్యప్రణాళిక, వార్తాపత్రికల యొక్క దిశ, తను అనుకున్నట్లు మార్చివేశాడు. జర్మనీ రాష్ట్రము, జాతివాదము సర్వోత్కృష్టజాతికి ప్రతీక అనే అహంలో గర్వోన్మత్తమై నరసంహారానికి కారణమై స్వయంగా నష్టపోయింది. ఇదికూడా 'మనీషీ' యొక్క ప్రభావమే. ఈ మలుపు సవ్యమైన దిశలో ఉండి ఉంటే, ఇంత జనసమర్థన పొందిన దేశము అత్యంత ఉచ్ఛస్థితికి ఎదిగి ఉండేది.

కారల్‌మార్క్స్ అభావగ్రస్త జీవితంలో వ్రాసిన అర్థశాస్త్ర దర్శనము సమాజంలో ఒక క్రాంతిని తీసుకువచ్చింది. పూంజీవాద్ (పెట్టుబడిదారీ) (Capitalism) కోటలు జర్జర మయ్యాయి. రెండొంతుల సామ్రాజ్యవాదము పృథ్వినుండి సమాప్తమైపోయింది. 'దాస్‌కాపిటల్' అనే రచన ఒక నవ యుగమును ప్రారంభించింది. కార్మికులకు అధికారాలు లభించి సమాన ధనవితరణ అధ్యాయము మొదలైంది. దానివల్ల కోట్ల మంది వ్యక్తులు, స్వావలంబన ప్రధానమైన, ఆనందదాయకమైన స్వాతంత్ర్యము పొందగలిగారు. రూసో స్థాపించిన ప్రజాతంత్రము యొక్క పునాదికి ప్రేరణ, ఉపనివేశవాదము (వలసవాదము), సామ్రాజ్యవాద శోషకుల నీతులే అయ్యాయి. మతాధికారము ఉపయోగించుకునే స్వాతంత్ర్యము, బహుమత ఆధారంగా ప్రతినిధిత్వ దర్శనము, రూసో రచనల వ్యాపక ప్రభావం వల్లనే సంభవమయ్యింది. లేకపోతే బలవంతుడిదే రాజ్యము అనేది ఇంకా కొనసాగుతూ ఉండి ఉండేది. దానిని వ్యతిరేకించాలి అనే భావనలే వచ్చివుండేవికావు. జాగీర్దారుల, ఉత్తరాధికారుల ఆధారంగా రాజ్యం పొందడం అనేది కొనసాగుతూనే ఉండి ఉండేది. ఇది ఒకవిధంగా 'మనీషా' ప్రేరిత క్రాంతి అనే అనాలి. చూస్తూచూస్తూ ఉపనివేశములు సమాప్తమైపోయాయి. పెత్తందారీ (శోషక) వర్గము తుడిచిపెట్టుకునిపోయింది. ఈ సందర్భంలోనే నేను అనేకసార్లు లింకన్, లూథర్‌కింగ్‌తో పాటు 'హ్యారియట్ స్టో' అనే మహిళగురించి తరుచు చెబుతూ ఉంటాను. ఆవిడ కలము, నీగ్రోలకు ముక్తినిప్పించింది. ప్రత్యక్షంగా ఇదే యుగమనీషీయొక్క భూమిక.

బుద్ధుని నీతి-వివేకము మీద ఆధారపడిన విచారక్రాంతి, గాంధీ-పటేల్-నెహ్రూ ద్వారా స్వాతంత్ర్య ఆందోళన పెను తుఫాన్‌లు, ఈ యుగము మారటానికి పరోక్షంగా ఉన్న 'మనీషీ' యొక్క ప్రతీకలు. వీరు ఆలోచనలను ఉత్తేజపరచే సాహిత్యాన్ని రచించడంకానీ, విశేషంగా ఉపన్యాసము ఇచ్చినట్లుగానీ కనిపించదు. కానీ మరి ఇది ఎలా సంభవము అయినది? దీనికి కారణము వారు మునిస్థాయి జీవితము గడిపి, తమను తపింపజేసుకుని, తమ ఆలోచనలో శక్తి ఉపార్జించుకుని అప్పటి వాతావరణమును ప్రభావితము చేయగలిగారు.

ఈనాటి విషమపరిస్థితులలో వైభవము-వినాశనానికి మధ్య ఊగుతున్న మానవజాతిని రక్షించటానికి వారి నమ్మకాల మర్మస్థలమును గుర్తించాలి. మానవగరిమను పెంపొందించే, దూరదర్శి వివేకశీలతను మేల్కొల్పగలిగే ప్రచండ సాహసం చెయ్యాలి. భౌతికసాధనాలు ఈ కార్యములో వున్న అంతః కరణములకు తత్త్వదర్శన సాధన అనే ఎరువు అవసరము. ఆధ్యాత్మవేత్తలు ఈ మరుభూమిని సరిచేసే బాధ్యత తమపై వేసుకున్నారు. అవసరమైనప్పుడు ఆ కాలంలో వ్యాప్తి చెందిన భ్రాంతికి తగిన నివారణోపాయము మానవజాతికి అంద జేస్తారు. ఆధ్యాత్మికత, విజ్ఞానము కంటే శక్తివంతమైనది.

ఆధ్యాత్మికశక్తి, వ్యక్తి అంతరాళాలలో వున్న వికృతులను మార్చి, సరియైన తత్త్వాలను ప్రతిష్ఠించగలదు. వ్యక్తిత్వాలలో పవిత్రతను, ప్రఖరతను సమావేశపరచుటకు 'మనీషా'నే మాధ్యమంగా ఎన్నుకొన్నాను. ఒక ఉజ్జ్వల భవిష్యత్తుయొక్క స్వప్నం చూస్తున్నాను, దర్శిస్తున్నాను. నేను నా భావిజీవిత క్రమంలో తీసుకున్న మహత్త్వపూర్ణ నిర్ణయాలలో సర్వోత్తమమైన దానిని లోకచింతనకు (Mas thinking) సవ్యదిశ నివ్వటానికి ఒక ప్రబల ఆలోచనాప్రవాహాన్ని నిర్మించడము. అందులో అవాంఛనీయత కొట్టుకుపోతుంది. ఈనాటికి జనమానసంలో దూరివున్న మర్మము, జటిలఛాయావహ పరిస్థితిగా రూపొందు తున్నది. ఈ వాతావరణమును మార్చటానికి వ్యాసుని వలె, బుద్ధుని వలె మరియు గాంధీ, కారల్‌మార్క్స్, మార్టిన్‌లూథర్ కింగ్, అరవిందమహర్షుల వలె పురుషార్థం చేయగలిగే ముని-ఋషియుగ్మము అవసరము. వీరి ప్రత్యక్ష-పరోక్ష ప్రచండ

**నీ అవసరం ఉన్నవారికి బిజీగా ఉన్నానని చెప్పకు**

పురుషార్థముల ద్వారా విచారక్రాంతి (Thought revolution) సంభవమవుతుంది. ఇది అంతఃక్షేత్రంలో తపస్సాధన వల్లనే సంభవము. దీని ప్రత్యక్షరూపము, ఒక యుగమనీషియొక్క లేఖిని ద్వారా రచించబడిన ఉత్కృష్టస్థాయి యుగాంతరకారీ సాహిత్యము అనవచ్చును. 56 సంవత్సరాల క్రిందట అఖండ జ్యోతి ద్వారా తీసుకున్న సంకల్పము కొనసాగించే నైతిక బాధ్యత నామీద వున్నది.

పరోక్షంగా ఋషిపాత్రను పోషిస్తూ, వైజ్ఞానిక ఆధ్యాత్మికవాద ప్రత్యక్ష స్వరూపానికి కావల్సిన అనుసంధానాల (Research) పృష్ఠభూమిని తయారుచేసి, నేటి తర్క-తథ్య ప్రమాణాల ఆధారంగా ఉన్న సమాజానికి అందివ్వాలని నా కోరిక, ఈనాడు జరుగుతున్న వైజ్ఞానికుల ప్రయోగాలు, వాటినుండి ప్రేరణ తీసుకుని ముందుకు వెళితే నాయీ ప్రయత్నము సఫలమైనదని అనుకుంటాను. ఆత్మానుసంధానము కొరకు అన్వేషణ, ఏ దిశలో వెళ్ళాలి? ఉపాసన-సాధన-ఆరాధన యొక్క వైజ్ఞానిక ఆధారము ఏమిటి? అవి మానసిక శక్తుల వికాసమునకు ఏవిధంగా సహాయపడతాయి? ఋషికాలీన ఆయుర్వేద విజ్ఞానమును పునర్జీవితము చేసి తద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాలను ఎలా పెంపొందించుకోవాలి? శబ్దశక్తి-యజ్ఞాగ్ని, ఊర్జ, వ్యక్తిత్వాన్ని ఏవిధంగా సమర్థవంతము పవిత్రవంతము చేస్తుంది? శరీరాన్ని జీవనీశక్తితో నింపితే అది ప్రతికూలతలను ఎదుర్కోవటానికి ఏవిధంగా సమర్థవంతంగా చేస్తుంది? జ్యూలిక్ విజ్ఞానపు పురాతన ప్రయోగాలు, ఈనాటి సమాజస్థితిగతులకు (background)లో మానవ సముదాయాలకు ఏవిధంగా లాభకారి అవుతుంది? ఇలాంటి అనేకానేక విషయాలను నేను అథర్వణవేద ఋషిపరంపర అంతర్గతంగా నా శోధ ప్రయత్నాలలో అభినవస్వరూపంగా ప్రస్తుతీకరణ చేశాను. వీటికి శుభారంభము చేసి బుద్ధిజీవి సముదాయాలకు (intellectuals) ఒక దిశను, ఒక ఆధారము నిచ్చాను. పరోక్షంగా నేను వీటికి నిరంతర పోషణ ఇస్తూవుంటాను. వైజ్ఞానిక సముదాయాల ఆలోచనలన్నీ ఈ దిశలో ప్రవహించి, ఈ ఆత్మకి అనుసంధానములో (spiritual research) వారు తమ ప్రజ్ఞను నియోగించగలిగితే అతి ఉత్కృష్ట స్థితికి వారిని తీసుకువెళ్ళే ప్రయత్నంలో నేను సహకరిస్తాను. సూక్ష్మీకరణ తపశ్చర్యల వలన నేను నా 'మనీషా' ద్వారా శోధ - అను సంధాన నిష్కర్షముల ద్వారా సమస్త మానవజాతికి లాభమును చేకూరుస్తాను. నా ఈ సంకల్పము అతి తీవ్ర ప్రఖరరూపము దాలుస్తుందని రాబోయే రోజులలో చూస్తారు.

**చైనాలో హుయి పేంగే అనే ధర్మోపదేశకుడు గోడవైపు ముఖము పెట్టి ప్రవచనము చేసేవాడు. శ్రోతలవైపు వారి వీపు ఉండేది. 'మీరు గోడ వలె వున్నారు. మీ లోపలికి ప్రవేశించటానికి ఒక చిన్న కిటికీ లేదు. అటువంటప్పుడు విన్నది అర్థము చేసుకుని, ఆచరణలో ఎలా పెడతారు?' అని అనేవారు. కానీ నేను నిరాశ చెందటం లేదు. నేను గోడలకు చెప్పే అభ్యాసము చేస్తున్నాను. ఎప్పుడో అప్పుడు ఎవరో ఒకరి చెవులు తెరుచుకుంటాయి కదా!**

## ప్రోత్సాహము యొక్క శక్తి

*మహా మనిషి "డికెన్స్ చార్ల్స్" చిన్నతనం నుండే వ్యాసాలు వ్రాసేవారు. ఆయన బాల్యంలో అనేక వ్యాసాలు వ్రాసి, తనకు తానే చింపేసేవారు. తన వ్రాతలమీద తనకే నమ్మకముండేది కాదు. చార్ల్స్ విద్యాభ్యాసానికై చేసిన ఋణాన్ని తిరిగి చెల్లించలేకపోయినందున తండ్రి జైలుకు వెళ్ళాడు. కుటుంబపోషణ కష్టమైపోయింది. పాపం చదువుకునే వయస్సులోనే లేబుల్స్ అంటించే చిన్నపాటి ఉద్యోగం చేయాల్సి వచ్చింది. ఇద్దరు ముగ్గురు బాలురతో కలసి అక్కడే ఉండేవాడు. అప్పుడు కూడా తన అలవాటును మానుకోలేదు. అందరు నిద్రించిన తర్వాత వ్యాసాలు వ్రాసేవాడు. చింపితే మిత్రులు చూస్తారని తలగడ క్రింద పెట్టుకునేవాడు. మిత్రులలో ఎవరు చేసిన పనో తెలియదు. హఠాత్తుగా ఒకరోజున ఒక వ్యాసం ఒక పత్రికలో అచ్చయి వచ్చింది. ఆ పత్రికాసంపాదకుడు ఆ వ్యాసాన్ని ప్రశంసిస్తూ వ్రాసిన టిప్పణీ కూడ వచ్చింది. "నీ మేధస్సు, వ్యాసాలు వ్రాయటానికే ఉపయోగ పడుతుంది! అని వ్రాశారు. చార్ల్స్ డికెన్స్ "అది చదువుకున్నాడు. అతని ఆనందానికి అవధుల్లేవు. ఆ ప్రోత్సాహాన్ని ఆధారంగా చేసికొని వ్యాసాలు వ్రాయటంలోనే నిమగ్నమయ్యాడు. ఆత్మవిశ్వాసం రెండింతలు మూడింతలుగా పెరిగిపోయింది. ఆ కాలంలో ప్రసిద్ధ నవలాకారుడుగా ఖ్యాతి పొందాడు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం : శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

**నిన్నే తలచుకునే వారిని మరచిపోకు**

## పరమపూజ్య గురుదేవుల అమృత వచనాలు - 10

# సమయదానం యొక్క విశిష్టత

ఒకరిపై మరొకరు విశ్వాసము నిలుపజాలని కాలమిది. అరాచకత్వం నలుదిశలా వ్యాపించి ఉన్నది. నీవు ఇల్లు విడచి బజారులోనికి రాగానే నీకు తెలియకుండగనే, నీ ప్రక్క నడుస్తున్న వ్యక్తి లేక నిన్నసరిస్తూ నడుస్తున్న వ్యక్తి నీపై హఠాత్తుగా దాడిచేసి నిన్ను గాయపరచి నీ వస్తువులను అపహరించుకుపోవచ్చు, నమ్మజాలము. సమాజం యొక్క నడవడి, సమాజంలోని వ్యక్తుల ఆలోచనలు ఇంతగా చెడుమార్గం పట్టిపోయాయి! ఈ స్థితిలో ఒకరిపై ఒకరికి విశ్వాసం ఉండదు. సోదరుడు, సోదరునిపై విశ్వాసం ఉంచుట లేదు. స్త్రీ-పురుషునిపై విశ్వాసముంచుటలేదు. కుమారుడు, తండ్రిని విశ్వసించడు. ఇలా చెడిపోయి, పూర్తిగా భ్రష్టుపట్టిన వ్యక్తులు, మూర్ఖులు ఉన్న కాలమిది. తత్ఫలితంగా ప్రకృతి కూడా మనపై కినుక వహించింది. దీనితో అతివృష్టిని కలిగిస్తూ ప్రకృతి వికటాట్ట హాసం చేస్తున్నది. అనావృష్టి పరిస్థితులు నెలకొని కరవు కాటకాలకు నిలయమవుతున్నది. ఈ రీతిగా ప్రకృతిని నమ్మి దానిపై ఆధారపడి, మన పనుల నిర్వర్తించుకొనలేని స్థితి నెలకొని ఉంది! వర్షాకాలంలో వర్షాలు పడుటలేదు. ఎవ్వరూ ఏమి చెప్పజాలని స్థితి. చలికాలంలో చలి ఎక్కువ, వేసవిలో వేడిమి ఎక్కువ, దీనిని కూడా ఎవ్వరూ చెప్పజాలకున్నారు. భూకంపం ఎప్పుడు వస్తుందో ఎవ్వరు చెప్పజాలరు. వరదలు ఎప్పుడు వచ్చేది చెప్పజాలం! ప్రకృతి మనపై పూర్తిగా కినుక వహించింది. తత్ఫలితంగా ప్రకృతి, నియమ విరుద్ధంగా ప్రవర్తించుచున్నది.

ఈ సమయం చాలా భయంకరమైనది. ఇట్టి భయంకర సమయంలో మనం చేపట్టవలసిన కర్తవ్యం ఏమీ లేదా? మీలో భావసంవేదనలు ఉత్పన్నమగుటలేదా? మీరు భావ శూన్యులయ్యారా! మీ హృదయం రాయిగా, ఇనుముగా లేక పాషాణంగా మారిందా? కాకూడదు. నా ఆలోచన ప్రకారం మనుష్యులందరూ అలా పాషాణ హృదయులు కాజాలరు. కాని జరుగుచున్న సంఘటనలు పరిశీలించినచో మనుష్యులలో పాషాణ హృదయలక్షణాలు జంతువులలో లా పెరుగుతూ పోతున్నాయి, కాని మీ అందరిపై ఒక ఆశ ఉన్నది. ఇట్టి భయానకవేళ మీ శక్తియుక్తులను కేవలం మీ పొట్ట నింపు కొనుటకు మరియు సంతానాభివృద్ధికి ఖర్చు చేయక మీరు సంకల్పించినచో కొంత సమయాన్ని మిగుల్చుకోగలరు! ఒక్క మనిషి 8 గంటలు సమయం పనిచేసి, తనకు తన కుటుంబ పోషణకై తగినంత సంపాదించగలడు. అట్లే విశ్రాంతి పొందుటకు 7 గంటలు సరిపోతుంది. మరో 5 గంటలు కుటుంబ పనుల నిర్వహణకు సరిపోతుంది.

పై రీతిగా మీరు రోజులో 20 గంటల సమయం మీ శరీరపోషణకు మరియు మీ కుటుంబపోషణకు వినియోగించ వీలున్నది. రోజులో మిగిలిన 4 గంటల సమయాన్ని మీరు తేలికగా మరోపనికి వినియోగించవీలున్నది. ఇది మీ ఇష్టా ఇష్టాలపై ఆధారపడి ఉంది. ఈ సమయాన్ని మీరు సోమరిగా గడపవచ్చు లేక లాభసాటిగా గడపవచ్చు. అది మీ ఇష్టం. మిమ్మల్ని ఎవ్వరు అడ్డగించగలరు? కాని మీరు అభిలషించినచో సమాజంలో దిగజారిపోయిన పరిస్థితులను చక్కదిద్దుటకై, వానిని పురోగమన దిశలో మళ్ళించుటకై, సమాజ భాగ్యాన్ని మరియు భవిష్యత్తును సుధృఢపరచుటకై మీరు కొంత చేయగలరు. తప్పకుండా చేయాలి! దీనివలన వాటిల్లెడి నష్టం ఏమీలేదు. దీనికై మీకు నేను హామీ ఇస్తాను. మీకు ఏమి నష్టం కలుగదు. ఎవ్వరైతే సమాజసేవకై తమ సమయాన్ని ఇచ్చారో! సమాజసేవ చేశారో వారంతా గాంధీజీలా, పండిత జవహర్‌లాల్ నెహ్రూగా, వినోబాభావేగా, స్వామి వివేకా నందునిలా సమాజంలో గుర్తింపు పొందెదరు. సమాజసేవకై తమ సమయాన్ని వెచ్చించిన వారెవ్వరూ ఏ రీతిగానూ నష్ట పోలేదు. పైపెచ్చు ఉచ్ఛస్థితికి ఎదిగారు, ప్రగతిమార్గంలో పయనించారు. వేలకొలది మానవులను ప్రగతిపథంలో పయనింపజేశారు. ఉన్నతస్థితికి వారిని కొనిపోయారు. వారు స్వయంగా లబ్ధిని పొందారు! సమాజసేవకై తమ సమయాన్ని వెచ్చించి నష్టపోయిన వారెవ్వరూ లేరు. ఉన్నచో వారిలో ఒక్కరి పేరు చెప్పండి! గాంధీజీ వసుధ న్యాయవాద వృత్తిలో ఉన్నారు.

**ఈరోజు నీ తల్లిదండ్రులను నీవు ఎట్లు చూస్తున్నావో రేపు నీ సంతానం నిన్ను అలానే చూస్తారు**

ఎంతో సంపాదించారు కాని ఆయన తన సమయాన్ని సేవా కార్యాలలో వెచ్చించారు. ఆయన ఏమి నష్టపోలేదు. ఆయనకు దేనిలోనూ కొరత రాలేదు. పైపెచ్చు గాంధీజీ గొప్ప ధైర్య సాహసాలు కల్గినవానిగా ఎదిగారు. ఏనాడు ఆయన తన పొట్టపోషణకై సంతానపోషణకై తన సమయాన్ని వినియోగించక, సమాజసేవకై ఖర్చు చేశారు. మనిషిగా కర్తవ్య పాలనకై తన సమయాన్ని ఖర్చు చేశారు.

ప్రస్తుత సమయం ఒక ప్రత్యేకతతో కూడి ఉంది. ఈ సమయంలో నా నుండి మరియు ప్రజల నుండి మీకు ఒక ప్రార్థన చేస్తున్నాను. మీ రోజువారి సమయంలో కొంత సమయాన్ని సమాజసేవకై ఇవ్వండి. ఇంతకు పూర్వం ఎన్నోమార్లు మిమ్మల సమయదానం ఇవ్వమని అడిగాం. మా పత్రాలలో వ్రాసి కూడా అర్థించాం. మహాకాలుడు కూడా పిలుస్తున్నాడు. మీరు సమయమివ్వండి – సమయాన్ని వెచ్చించండి – ఏ పనికై మీ సమయాన్ని ఖర్చుచెయ్యమంటున్నామో తెలుసా? ప్రజల మనస్సులను, బుద్ధిని, వారి ఆలోచలను మీరు సరిచెయ్యాలి! ప్రజలలో విచారశీలత, దూరదర్శిత, వివేకశీలతలు పెంపొందినచో ప్రపంచం సుఖసంతోషాలతో నిండిపోతుంది.

సమాజం అసహజంలా ఉండదు. అది దేవతలకు కూడలిగా మారిపోతుంది. భూమి స్వర్గంలా మారిపోతుంది. మనము సమర్థవంతులుగా మారతాం. అప్పుడు కర్తవ్య పాలకులుగా మారతాం. బాధ్యతాయుతవ్యక్తులుగా మారెదరు. నాలుగు గొప్ప లక్షణాలు, గుణాలు ఒకే వ్యక్తిలో, ఒకే వృక్షంలో, లతలు, పూలు, పండ్లు వృద్ధి చెందునట్లు వృద్ధి చెందుతాయి. అందువలన మన యొక్క సామర్థ్యాన్ని పెంచుకొనుటకై పూర్తి ప్రయత్నం చెయ్యాలి. దీనికై ప్రజలు తమ సమయాన్ని ఎంత ఇవ్వగల్గితే అంత ఇచ్చుట మంచిది. వసంత పంచమి 1990నాడు వందనీయ మాతాజీతో, పూజ్యగురుదేవులు ఇలా అన్నారు. "నా జ్ఞానశరీరం జీవించి ఉంటుంది. జ్ఞానశరీరం యొక్క కాంతి ఇంటింటికి మనిషి మనిషికీ చేరాలి. సమాజం మంచి మార్పులకు లోనవుతుంది.

– అనువాదం: *ఎ. వేణుగోపాలరెడ్డి*

## మొదటి పంటలో మొదటి ఫలం

*గిజూభాయి త్రివేది పదవీ విరమణ చేశారు. ప్రతిఫలరూపంలో కొంత పైకం ముట్టింది. స్వగ్రామంలో ఉన్న స్వగృహానికి చేరుకున్నాడు. చివరి రోజులు ప్రశాంతంగా గడపాలనుకున్నాడు. వచ్చిన డబ్బుతో రెండెకరాల భూమిని కొన్నారు. ఆ భూమిలో అంటు మామిడితోటను పెట్టించాడు, దూరదూర ప్రాంతాలనుండి మొక్కలు తెప్పించాడు. అనుభవం ఉన్నా తోటమాలి చేతికి తోట బాగోగులు అప్పచెప్పాడు. మూడు సంవత్సరాలు గడిచాయి. తోటవృద్ధి చెందింది. మొదటిపంటకోయడానికి సిద్ధంగా ఉంది. కాని విధిబలీయమైంది. అది ఆతని పెద్ద కుమార్తె జీవితంతో ఆటాడుకున్నది అకస్మాత్తుగా పెద్దల్లుడు స్వర్గస్తుడయ్యాడు. వారి నివాసం బొంబాయి. అక్కడాయనకు పెద్దవ్యాపారముంది. పిల్లలు చిన్నవారు. అక్కడే చదువుకుంటున్నారు. ఆ పరిస్థితిలో త్రివేది కుమార్తెకు తోడుగా బొంబాయి వెళ్ళవలసి వచ్చింది. ఏం చేస్తాడు పాపం? పంటకు సిద్ధంగా ఉన్నతోటను అమ్మివేసి బొంబాయి వెళ్ళిపోయాడు.*

*కొంతకాలానికి తోటను కొన్న వ్యక్తి తన తమ్ముని చేతికిచ్చి రెండు గంపల మామిడి పండ్లు, ఒక లేఖ పంపించాడు. లేఖలో ఈవిధంగా వ్రాశాడు. "అయ్యా! మీరెంతో శ్రద్ధగా పెంచి నాకు విక్రయించిన తోట ప్రప్రథమంగా పంటనందించింది. తోటలోని మొదటి ఫలాలను ముందుగా మీకు పంపుచున్నాను. మీరు స్వీకరించిన తరువాత మా తమ్మునితో ప్రత్యుత్తరమును పంపగలందులకై కోరుచున్నాను. ఆ జవాబును చూచిన తరువాతనే మేము మామిడి పండ్ల రుచిని చూస్తాము". బాగుగా చదువుకున్న త్రివేది కన్నుల నుండి ఆనందభాష్పాలు జలజల రాలాయి. ఆ మామిడిపండ్లు తియ్యదనం రెట్టింపైనట్లుగా అనిపించింది.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం : శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

**ఆనందం అనేది మన ఆలోచనల బట్టి రూపుదాల్చుతుంది**

అతీంద్రియ విజ్ఞానం-12

# భవిష్యదర్శనము యాదృచ్ఛికము కాదు, సత్యమే!

ఒకానొక ప్రత్యేక సందర్భము, సమయము, పరిస్థితులకను గుణముగా జరిగే ఘటనలు, భవిష్యత్‌దర్శనముల గురించి కొంతమంది అవి కేవలము యాదృచ్ఛికమైనవే అని తేలికగా కొట్టిపారేస్తుంటారు. కానీ ఈ పుస్తకములో వివరించబడిన భవిష్యత్‌దర్శనమునకు సంబంధించిన సంఘటనలన్నీ సాక్ష్యాలపై ఆధారపడినవే. ఈ తరహా సంఘటనలను ముందుగానే అందిన దైవీ హెచ్చరికలుగా స్వీకరించవల్సి ఉన్నది.

భౌతికజగత్తుతో పోలిస్తే మన అంతర్జగత్తు యొక్క శక్తి, సక్రియతా అదృశ్యముగా ఉన్నప్పటికీ ఎక్కువ తీక్షణమైనదీ, ప్రభావపూర్ణమైనదీ కూడా! మెదడులో ఏ ఆలోచనలు మెదలు తున్నాయో బయటకు కనపడదు. కానీ సమస్తమైన క్రియా కలాపములకు మనోజగత్తులోనే పృష్ఠభూమి తయారవుతుంది. ఏ వ్యక్తికైనా-ఎదుటి మనిషి మనస్సులో మెదులుతున్న ఆలోచనలు తెలిస్తే తప్పకుండా మొదటి వ్యక్తి వాటి వలన కలిగే లాభములను తానూ పొందగలుగుతాడు. భవిష్య దర్శనములను ఈ రూపములో తీసుకొనగలిగితే ప్రమాదకర పరిస్థితుల నుండి రక్షించుకొని మేలుకలిగే అవకాశములను మెరుగుపరచుకొనగలగటము ఎవరికైనా సాధ్యము కాగలదు.

అంతర్జగత్తు ఎంతో విశాలమైనది, విరాట్-స్వరూపము కలిగినది. దానివలన ఒక్కరు కాదు, పెద్ద పెద్ద సమూహములే ప్రేరేపితమవుతూ ఉంటాయి. అమెర్ఫాన్ - వేల్స్‌కు చెందిన ఒక చిన్న పల్లెటూరు. అది వర్షాకాలము. పల్లెటూరు అంతటా ఏదో తెలియని ఒక అలజడి ఆవరించింది. ఎక్కువమంది ప్రజలకు రాత్రివేళ స్వప్నములో గానీ లేదా పగటిపూట... చాలా తేలికగా వారికి త్వరలో సంభవించబోయే మృత్యువును గురించిన సమాచారము ముందుగానే తెలుస్తూ ఉండేది. అమెర్ఫాన్ ప్రజల యొక్క ఈ నిస్సహాయస్థితి ఎల్లెడలా చర్చ నీయాంశమైనది. జర్మనీదేశపు సుప్రసిద్ధ మనస్తత్వశాస్త్రవేత్త యైన జాన్‌మార్‌కర్ ఈ సంఘటనపై అధ్యయనము చెయ్యటానికిగాను నియుక్తులైనారు. సర్వే జరిపిన పిదప ఎక్కువమంది ప్రజలకు ఇలాంటి భవిష్యత్‌దర్శనము కలుగుతున్నట్లు ఆయనకు అర్థమైంది. ఇంతేకాదు ప్రజల ముఖాలపై భయచిహ్నములు స్పష్టముగా కన్పట్టసాగాయి.

అతికష్టం మీద ఒక వారం గడిచిందో లేదో సమీపములోని ఒక పెద్ద అగ్నిపర్వతము బ్రద్దలై ఆ బూడిద పెద్ద తుఫానులాగా పెల్లుబికింది. చూస్తూ ఉండగానే వేలాదిమంది మృత్యువాత పడ్డారు. ఒక పాఠశాలలో ఒకేసారి వందమంది పిల్లలు మృత్యు ఒడిని చేరుకున్నారు. ఆ పాఠశాలలోనే చదువుతున్న 9 సంవత్సరముల బాలిక ప్రమాదము నుండి తప్పించుకుని బయటపడింది. కానీ సంఘటన జరిగిన 10 రోజుల తరువాత ఒకరోజు తన తల్లితో 'అమ్మా! నేను మరణమునకు అస్సలు భయపడను. ఎందుకంటే దేవుడు నాకెప్పుడూ తోడుగా ఉంటాడు కదా!' అని అన్నది. జరిగిపోయిన సంఘటన తాలూకూ భయముతో కూతురు కలవరపడుతున్నదని భావించిన మరో తల్లి తన బిడ్డను అక్కున చేర్చుకుని 'తల్లీ! భయము లేదు. జరిగినదేదో జరిగిపోయింది. ఇక నువ్వు నిశ్చింతగా ఉండు' అని చెప్పింది. జాన్‌మార్‌కర్ ఆ బాలికను కలిసి 'అమ్మా! ఎందుకిలా ఆలోచిస్తున్నావు?' అని అడిగాడు.

'నాకు నలువైపులా అంధకారము గోచరిస్తున్నది. కాబట్టి నేను చనిపోతానేమో అనుకుంటున్నాను' అని జవాబు చెప్పింది బాలిక. ఇది జరిగిన మరునాడు మధ్యాహ్నమే ఆ బాలిక మరణించినది. ఆ బాలికను సమాధి చేసిన స్థలము అనుకోకుండా అగ్నిపర్వతపు తాలూకు బూడిద వెదజల్లబడిన ప్రాంతములో 5, 6 అడుగుల లోతున ఉన్నది. ఈ సంఘటనను అధ్యయనము చేసిన జాన్ 'ప్రాణికోటి యావత్తూ ఒకే చేతనా సముద్రములో సంబద్ధమైయున్నది' అన్న నిర్ణయమునకు వచ్చాడు. ఈ సంపర్కము ఎంత నిర్మలమై, ప్రగాఢమై ఉంటుందో తత్సంబంధిత విశేషములు కూడా అధికముగా లభించి, లాభమును చేకూర్చుతాయి. అందుచేత ఆధ్యాత్మిక సాధనల ద్వారా అంతర్జగత్తును వికసింపజేసుకొనట మనేది భౌతిక లాభముల కన్నా ఎక్కువ అవసరము.

**నీ నడత బాగుంటే నలుగురికి గురువుగా అదే చెడ్డదైతే నలుగురికి శిష్యునిగా మారతావు**

పృథ్వి యొక్క గురుత్వాకర్షణశక్తికి 'గ్రేవిటీ' అనే విశిష్ట తత్త్వము ఆధారమని శాస్త్రజ్ఞులు తెలుసుకున్నారు. ఈ గ్రేవిటీ అనేది ప్రతిఒక్క పిండం నుండి వెలువడి, దానియొక్క ఆకర్షణ శక్తికి ఒక స్థాయిని ఏర్పరుస్తుంది. దీని ఆధారముగా ఒక గ్రహము రెండవదానిని ఆకర్షిస్తుంటుంది. ఈ విశ్వ బ్రహ్మాండ మంతా ఒక వ్యవస్థితరూపములో ఒకదానితో ఒకటి బంధించ బడి ఉంది.

గ్రహనక్షత్రముల వలెనే మానవుడిలో కూడా ఒక ప్రత్యేక మైన విద్యుత్ప్రవాహము బహిర్గతమౌతూ ఉంటుంది. అది ఒకరితో ఒకరిని బంధిస్తూ ఉంటుంది. ఈవిధముగా సమస్త మానవజాతికి చెందిన ప్రతి ఒక్క మనిషీ కూడా ఒకరితో ఒకరు తెలిసో-తెలియకో బంధించబడివుంటారు. ఒక వ్యక్తి మరొక వ్యక్తి యొక్క ఆలోచనలతో అనుకోకుండానే పరిచితుడై ప్రభావితుడవుతూ ఉంటాడు. ఐతే ఆ ప్రభావము ఎంతమేరకు ఉంటుందీ, దానిని ఎవరు ఎంతవరకూ స్వీకరిస్తారు-ఎంత వరకూ స్వీకరించరు అనేది వేరే విషయము.

ఐన్‌స్టీన్ 'సమగ్రజ్ఞానమును' సామాన్యజ్ఞానము యొక్క పరిధికి ఆవలి విషయముగా భావించేవాడు. జిజ్ఞాస, శిక్షణ, ఆలోచన, అనుభవములు... వీటి ఆధారముగా నేర్చుకున్నది మాత్రమే జ్ఞానము కాదనీ, చేతనత్వమునకు ఒక ప్రత్యేక స్థాయి ఉంటుందనీ, దానినే అంతర్జ్ఞానమని చెప్పవచ్చనీ భావించే వాడు. ప్రపంచములో కనుగొనబడిన ఎన్నో గొప్పగొప్ప విషయములు ఈ అంతర్జ్ఞానము యొక్క ప్రజ్ఞ సహాయముతో మానవీయమస్తిష్కములోకి దిగివచ్చాయి లేదా అవతరించాయి. ఎటువంటి ఆధారమూ లేని ఒక విషయమును గురించిన సూచన అకస్మాత్తుగా ఎక్కడినుండి వచ్చింది? దీనికి సహజము గానే సమాధానము ఉండదు. రహస్యమయ అనుభూతులు ఏ ప్రజ్ఞ యొక్క సహాయముతో అవతరిస్తాయో దానిని 'అతి మానవీయ అంశముగా' అంగీకరించవలసి ఉంటుంది.

ఈవిధముగా అతీంద్రియజ్ఞానము ప్రత్యక్షముగా నిరూపిం చబడటముతో శాస్త్రజ్ఞులకు కూడా దానియొక్క వాస్తవికతను తెలుసుకోవాలనే జిజ్ఞాస జాగృతమైనది. ప్రస్తుత కాలములో ఇంగ్లండ్, అమెరికా, జర్మనీ, రష్యా, జెకోస్లోవేకియా, నెదర్లాండ్ వంటి ప్రముఖ దేశములలో 'పారా మనో వైజ్ఞానికత'కు సంబంధించిన శాఖలు వేగముగా అభివృద్ధి చెందుతున్నాయి. ఆయా శాఖలలో ఇలాంటి సంఘటనల మీద విస్తృతమైన అధ్యయనము, పరిశీలన చెయ్యటము ద్వారా అసలు(సత్య)స్థితిని తెలుసుకొనటానికి ప్రయత్నములు జరుగుతున్నాయి. రష్యన్ మనస్తత్వశాస్త్రవేత్తలు ఈ 'అతీంద్రియజ్ఞానము లేదా భవిష్యదర్శనము'ను మూడు భాగములుగా విభజిస్తూ.. 'మానవుడి మనస్సులో విజ్ఞానమునకు తెలియనటువంటి కొన్ని తత్త్వములు ఉన్నాయి. వాటిని అభివృద్ధి చేయటము-నియంత్రించడము అనే రెండు పనులు మనిషికి సాధ్యమైతే ఇది ఒక సామాన్య వైజ్ఞానిక ప్రక్రియ వలె ఎల్లప్పుడూ మనకు అందుబాటులోకి రాగలదు' అని అభిప్రాయపడుతున్నారు. ఇది ఇంద్రియముల శక్తిని విస్తరింపజేసే ఒక ప్రారంభిక చమత్కారము. మానవుడి సామర్థ్యము అనంతమైనది, అపారమైనది. దానిని మరింత తీక్షణముగా కేంద్రీకృతము చెయ్యగలిగితే ఎంతో విలక్షణమైన, అద్భుతమైన జ్ఞాన విజ్ఞానములు, అనుభూతులు మనకు లభిస్తాయి.

భవిష్యదర్శనమునకు సంబంధించిన 3 భాగములు 1)పరేంద్రియజ్ఞానము (టెలీపతి) జీవించివున్న ఒక వ్యక్తిలోని ఘనీభూతమైన స్మృతులు ఎంతో భావుకత్వముతో, ఆర్తితో ఒకరిని పిలవటం లేదా సందేశమివ్వటము 2) అతీంద్రియ జ్ఞానము అంటే క్లెయిర్‌వాయిన్స్... స్వయముగా తనకున్న శక్తులు విస్తృతమై ఘటనాస్థలితో సంబంధమును స్థాపించుకొని తన అంతరంగ (స్థితికి అనుగుణముగా) శక్తితో అక్కడి పరిస్థితిని తెలియజేయటము. 3) పూర్వసంచితజ్ఞానము: అనగా పూర్వ జన్మల యొక్క స్మృతి మెదడులో సైనోప్సిస్ అనే రూపములో వెలుగొందుతూ ఉంటుంది. అందులో ప్రత్యేకమైన తెరల లాంటి గీతలు ఉంటాయి. వీటిని సైనోప్సిస్ అంటారు. మనస్సు వీటి తోటి ఒక్క క్షణకాలము పాటు ఏకీకృతమైతే గనుక గ్రామఫోన్ రికార్డ్ మీద ముల్లు తిరుగుతున్నప్పుడు ఉత్పన్నమయ్యే ధ్వని వలె భవిష్యదర్శనము కలుగుతుంది. మానసిక వ్యవస్థానిర్మాణము ఎంత విలక్షణమైనదో అది అంత అద్భుత శక్తి సామర్థ్యములతో ఓతప్రోతమై ఉంటుంది. ప్రకృతి అంతరంగములో ఇమిడి ఉన్న రహస్యములు ఎప్పుడైనా మనకు తేలికగా అర్థమైతే కనుక ఈ మానసిక వ్యవస్థను అభివృద్ధిచేసుకొని మరిన్ని మహత్త్వపూర్ణమైన లాభములను, యోగులకు సహజముగా ఉండే సిద్ధులనూ కూడా మనము పొందవచ్చు.

– అనువాదం: *శ్రీమతి కృష్ణకుమారి*

**కనురెప్పల తడిని అర్థం చేసికోగలిగే సహృదయం ఉంటే, కన్నీటి భాష తెలుస్తుంది**

## తంత్రవిద్య-3

# మౌనబాబా

మాత వింధ్యాచల నివాసిని మందిరము సమీపములోనే బారులు తీరి నిలిచిన హిమాలయపర్వత గుహల్లోనే ఆయన గుహ కూడా ఉన్నది. ఆ గుహలోనే ఆయన తన ఇద్దరి శిష్యులతో నివసిస్తున్నారు. నిరంతర గాయత్రీసాధనామయము ఆయన జీవితము! ఎల్లవేళలా గాయత్రీమంత్రమును జపించుట-సూర్యధ్యానం చేయుట చేత ఆయన వ్యక్తిత్వము కూడా సవితాదేవత వలె తేజస్సుతోనూ, తీక్షణతతోనూ భాసిస్తున్నది. ఆయన వ్యక్తిత్వము అలౌకిక విభూతుల భండారం! రిద్ధి-సిద్ధులన్నీ ఆయన చరణదాసినులు! ఆయన ఖ్యాతి దూరదూర ప్రాంతములకు ప్రాకింది. బహుశః మౌనంగా ఉండే కారణము చేతనేమో జనులు ఆయనను 'మౌనబాబా' అని పిలిస్తూంటారు. ఇక ఇప్పుడు అదే ఆయన పేరుగా స్థిరపడిపోయింది.

ప్రజలు సుదూరప్రాంతములనుండి రకరకముల మనో కామనలతో ఆయన వద్దకు వస్తూవుంటారు. బాబాగారి ఆశీర్వాదమును గైకొని పరమ సంతోషముతో తిరిగి వెళుతూ ఉంటారు. మౌనబాబాగారి వద్దకు వచ్చినవారందరి కోరికలు తప్పకుండా ఈడేరేవి. ఈనాటివరకు ఆయన వద్దకు వచ్చి నిరాశతో వెనుదిరిగి వెళ్ళినవారెవ్వరూ లేరు. ఈ కారణముగానే ప్రజల మనస్సులలో బాబాగారి పట్ల గాఢమైన శ్రద్ధ నిండి ఉన్నది. చెప్పాలంటే మౌనబాబాగారు దేవతుల్యులు! అత్యంత సౌమ్యులు! శాంతస్వరూపులు! దానికితోడు తేజోవంతమైన ముఖమండలం, చక్కని రూపురేఖలు, ఆరోగ్యము, బిగువైన మరియు ఆకర్షణీయమైన దేహదారుఢ్యము ఆయన సొంతం! ఆయన లలాటభాగం నుండి సూర్యసమమైన కాంతి ప్రసరిత మవుతూ ఉంటుంది. బాబాగారు సుమారు 40 సంవత్సరముల నుండి మౌనవ్రతమును పాటిస్తున్నారు. ఆయన ఎవ్వరినీ కలవరు, ఏమీ మాట్లాడరు. ఏదైనా వస్తువు అవసరమైనప్పుడు నేలమీద ఆ వస్తువు పేరును వ్రాస్తారు లేదా సైగలతో సూచిస్తారు. అసలు ఆయనకు పెద్దగా అవసరమైనవి మటుకు ఏమున్నాయి గనుక? ఒకటి-రెండు అంగవస్త్రములు, లంగోటీలతో ఆయన జీవితము నిరాడంబరముగా సాగిపోతున్నది. మారేడు-తులసి-వేప ఆకులనన్నింటినీ ఒక్కటిగా చేర్చి చేతులతో బాగా నలిపి భుజిస్తారు. ఆహార విహారములలోని ఈ ప్రత్యేకతలతో ఆయన తపస్సు మహోజ్జ్వలంగా సాగిపోతున్నది.

బాబాగారు దర్శనమిచ్చినా, ఇవ్వకున్నా-మాట్లాడినా, మాట్లాడకున్నా ఆయన సందర్శనార్థం తరలివస్తున్న జనసంఖ్య రోజురోజుకు పెరిగిపోతూనే ఉన్నది. ఆ ప్రజావాహిని ఎంతగా పెరిగిపోయిందంటే బాబాగారి సాధనకు అది అడ్డంకిగా మారింది. గుంపులు గుంపులుగా వచ్చే ప్రజలవలన ఆ పరమ యోగి తపోసాధనకు విఘ్నం కలుగుతున్నది. అందుచేత ఆయన క్రిందనున్న గుహను విడిచి ఆ పర్వతం పైనున్న మరో గుహలోకి వెళ్ళిపోయారు. తన ఇద్దరు శిష్యులనూ మాత్రం ఇంతకుముందున్న పాతగుహలోనే ఉండమని ఆదేశించారు. వారు ఇప్పుడు బారులు తీరి నిలబడియున్న సందర్శకులను బాబా సాన్నిధ్యమునకు వెళ్ళనీయటం లేదు. బాబాగారి ఇద్దరి శిష్యులు ప్రజలను ఆశీర్వదించి వెనక్కు పంపేస్తున్నారు. ఈ శిష్యద్వయం కూడా సామాన్యమైన వారేమీ కాదు. బాబాగారి ఆశీర్వాదం వలన వారిలో కూడా దివ్యమైన సిద్ధులు ఆవిష్కృత మైనాయి. ఈ ఇద్దరు శిష్యులు ఎవరిని ఏమని ఆశీర్వదిస్తే అది తప్పకుండా ఈడేరుతున్నది. అందుచేత భక్తులకు శిష్యుల పట్ల కూడా పూజ్యభావమేర్పడింది.

మౌనబాబాగారు ఏ ప్రాంతములో నివసిస్తున్నారో ఆ ప్రాంతపు రాజు ఎంతో దయగలవాడు, పరాక్రమవంతుడు, ధర్మపరాయణుడు. కానీ రాజుకు సంతానము కలుగలేదు. ఆయన చక్కని పాలనలో ప్రజలు కూడా సుఖశాంతులతో జీవిస్తున్నారు. ప్రజలందరూ ఒకరి పట్ల ఒకరు ఆత్మీయభావనతో మెలగుతున్నారు. ఎవ్వరికీ కూడా న్యాయస్థానమును ఆశ్రయించవల్సిన అవసరమే లేకుండాపోయింది. లూటీలు, దొంగతనాలు, దోపిడీలు, మోసాలకు అక్కడ రవ్వంతకూడా చోటు లేదు. అసలు ఆ మాటలే అక్కడ వినపడవు. రాజు స్వయముగా శ్రమకు పట్టం కట్టాడు. తత్ఫలితముగా ప్రజలలో శ్రమపట్ల అచంచల విశ్వాసము జాగృతమై శ్రమైకజీవన

**మనకి మంచి చెప్పేవారు దొరకటం మన అదృష్టం ఆ మంచిని వినకపోవటం మన దురదృష్టం**

సౌందర్యము సర్వత్రా వెల్లివిరుస్తున్నది. 'పిన్నలు తమ పెద్దలను అనుకరిస్తారు, అనుసరిస్తారు. శ్రేష్ఠులను అందరూ అనుసరిస్తారు. మంచైనా-చెడైనా ఎల్లప్పుడూ పైనుండి క్రిందకు ప్రవహిస్తుంది.' రాజుగారి సదాచరణ జనులను కూడా సన్మార్గములో నడిపిస్తున్నది.

రాజు వలెనే ఆయన ధర్మపత్నియైన మహారాణి కూడా పరమ ధార్మికురాలు! అంతేకాదు కరుణకు, కోమలత్వమునకు మారుపేరుగా ఉండేది. రాజు-రాణి ఇద్దరూ సంతానభాగ్యం లేనందున అశాంతితో తపించిపోతున్నారు. వారిరువురకు తమ రాజ్యం, ఐశ్వర్యం, వైభవం, విలాసాలు అన్నీ కంటకప్రాయముగా అనిపించసాగాయి. రాజు-రాణి సంతానం కోసం ఎన్నెన్నో ఉపాయాలను అనుసరించారు. జ్యోతిష్యులు, పండితులు చెప్పిన లెక్కలేనన్ని వ్రతాలు, ఉపవాసాలు చేశారు. నాలుగుధామాల యాత్రతోపాటు తీర్థస్థలములను, పుణ్యక్షేత్రములను సందర్శించారు. కానీ ఏ ఒక్కటీ సత్ఫలితాల నివ్వలేదు. రాజు సంతానము కోసం పరితపించిపోతూ రోజురోజుకు తేజోవిహీనుడిగా అయిపోసాగాడు. వేసవికాలంలో సరోవరంలోని నీరు ఇంకిపోయినట్లు రాణి యొక్క సౌందర్యం క్షణక్షణమూ క్షీణించిపోసాగింది.

మౌనబాబాగారి తపఃప్రభావం సాటిలేనిదన్న కథనాన్ని రాజు ఎన్నోమార్లు చెవులారా విన్నాడు. కానీ ఇక ఇప్పుడు రాజుకు ఎక్కడికన్నా వెళ్ళిరావాలనే ఉత్సాహం పూర్తిగా సన్నగిల్లిపోయింది. మహారాణి మటుకు సంతానం కోసం ఏమి చెయ్యటానికైనా సంసిద్ధంగా ఉన్నది. ఆవిడ 'బాబాగారి వద్దకు వెళ్ళివద్దామనే' తన కోరికను రాజుగారి ముందు వెల్లడించింది. దానిని విన్న రాజు ముందు తన అయిష్టతను వెలిబుచ్చాడు గానీ తన మహారాణి మనస్సును సంతోషపెట్టడానికి 'బాబాగారినే రాజమహల్‌కు పిలిపించాలి' అని నిర్ణయించుకున్నాడు. రాజుగారు ఈ నిర్ణయమును తెలిపిన వెంటనే ఆమె దానిని వ్యతిరేకిస్తూ 'శ్రద్ధతోనే మనోభీష్టం సిద్ధిస్తుంది. యాచకుడే దాత వద్దకు వెళ్ళుట సమంజసం!' అని నచ్చజెప్పినది.

రాజు తన రాణి మాటను మన్నించి తన మందీ మార్బలముతో బాబాగారి వద్దకు వెళ్ళటానికి సిద్ధపడ్డాడు. మహారాణి దీన్ని కూడా ఖండిస్తు 'తాపసుల వద్ద రాజవైభవం ఎందుకూ కొరగాదు. నిర్మలత్వము, నిరాడంబరత, నిష్కపటత్వములే సహాయపడతాయి. అందువలన మనం అతి సామాన్యమైన వేషభూషణములతో ఒంటరిగా బాబాగారి వద్దకు వెళ్లాలి' అని తేల్చిచెప్పింది. రాజు తన రాణి చెప్పిన ఈ సూచనను కూడా ఆమోదించాడు.

కేవలం వారిద్దరే మౌనబాబాగారి తపోస్థలికి చేరుకున్నారు. అక్కడి వాతావరణము ఎంతో మనోహరముగానూ, శాంతముగానూ ఉన్నది. దగ్గరలోనే ఒక సెలయేరు ప్రవహిస్తున్నది. జలజలమంటూ ఆ ఏటి నీరు చేసే సవ్వడి వీనులవిందుగా అంతటా ప్రతిధ్వనిస్తున్నది. పక్షులు మధురస్వరముతో కిలకిలా రావములు చేస్తున్నాయి. ఆ ప్రదేశములో కేవలం బాబాగారి శిష్యులుమాత్రమే ఉన్నారు. ఎక్కడెక్కడినుండో వచ్చిన జనులందరూ శిష్యులిద్దరినీ దర్శించుకుని తమ తమ ఇళ్ళకు తిరిగి వెళ్ళిపోయారు. రాజు-రాణి శిరస్సు వంచి బాబాగారి శిష్యుల పాదాలకు ప్రణమిల్లారు. శిష్యద్వయం వారిద్దరినీ ఆశీర్వదించారు. రాజు-రాణి సామాన్యమైన వేషముతో వచ్చినప్పటికినీ సహజముగానే వారిలో ప్రస్ఫుటిస్తున్న తేజస్సు మొదలైన లక్షణములు వారు రాజవంశస్థులని చెప్పకనే చెపుతున్నాయి. ఇద్దరూ కొంత తడవు వరకూ క్రిందనే కూర్చుని ఉన్నారు. ఆ పిమ్మట రాణి తాము బాబాగారిని దర్శించాలనుకుంటున్నామని, తమకు బాబా దర్శనమిప్పించమని వేడుకున్నది.

బాబాగారి శిష్యులు వారిని అడ్డగించలేదు. నేటివరకూ మౌనబాబా గారుండే పైనున్న గుహలోకి ఈ ఇద్దరు శిష్యులూ తప్ప అన్యులెవ్వరూ కాలు కూడా పెట్టలేదు. బాబాను దర్శించాలనే ఆశతో వచ్చినవారందరినీ శిష్యులు క్రిందనే ఆపివేస్తున్నారు. ఐతే ఎందుకో తెలియదుగాని ఈనాడు వారు రాజు-రాణీలను పై గుహలోకి వెళ్ళటానికి అనుమతించారు.

కేవలము రాజు-రాణి మాత్రమే పై గుహలోకి అడుగు పెట్టారు. గుహలోపలంతా కూడా శాంతిమయ, తపోమయ తేజస్సు నలుదిశలా వ్యాపించియున్నది. మౌనబాబాగారి ముఖమండలము నుండి వెలువడుతున్న దివ్యకాంతులతో గుహ వెలిగిపోతున్నది. రాజు ఇప్పటివరకు అంతటి తపోసంపన్నుడిని ఎన్నడూ చూడలేదు. రాణియైతే ఒక్కసారిగా అవాక్కైపోయింది. ఇద్దరూ బాబాకు ప్రణమిల్లారు. బాబాగారు మెల్లగా తమ ఎడమచేతిని పైకెత్తి ఆశీర్వదించారు. చాలాసేపు అక్కడే గడిపిన పిమ్మట రాజు-రాణి తిరిగి తమ రాజమందిరమునకు వెళ్ళిపోయారు. రాజుకు ప్రతిరోజు బాబాగారి వద్దకు వెళ్ళి రావటం

**గొప్ప ప్రయత్నాలు గొప్ప ఆలోచనలన్నీ హేళనతోటే మొదలవుతాయి**

సాధ్యపడదు. అందుచేత రాణిమాత్రము అనునిత్యం ఒంటరిగా బాబాగారి వద్దకు వెళ్ళిరావటానికి అనుమతించాడు.

రాణి క్రమం తప్పకుండా బాబాగారి సాన్నిధ్యమునకు వెళ్ళిరాసాగింది. ఆవిడ అక్కడున్న గుహ పరిసరప్రాంతమునంతా శుభ్రం చేసి, తర్వాత మౌనంగా కొన్ని గంటలపాటు బాబాగారి చెంతన కూర్చునుండేది. రోజులు ఇలానే దొర్లిపోతుండగా వర్షాకాలం రానేవచ్చింది. ఒకనాడు కుంభవృష్టిగా వర్షం కురుస్తున్నది. మెఱుపుల యొక్క విద్యుత్కాంతులతోనూ, భీకరమైన మేఘ గర్జనలతోనూ విలయతాండవం చేస్తూ విరుచుకుపడిన పెనుతుఫాను వాతావరణమును భీతావహముగా మార్చివేసింది. కానీ రాణి యొక్క నిష్ఠ అచంచలమైనది. రాణి తను పెట్టుకున్న నియమమును అనుసరించి బాబాగారి గుహ వద్దకు చేరుకున్నది. ఆవిడ శరీరము అదుపుతప్పి తూలిపోతున్నది. బట్టలన్నీ పూర్తిగా తడిసి ముద్దైపోయాయి. పర్వతం పైకి ఎక్కుతున్నప్పుడు ఆవిడ కాళ్ళకు చాలా చోట్ల దెబ్బలు తగిలి రక్తం కారుతున్నది. అలా వస్తున్నప్పుడు రాణి ఒకచోట ఒక లోతైన గుంటలోకి జారిపడబోయి చివరకు ఆ ప్రమాదం నుండి ఎలాగోలా తప్పించుకుని బయటపడింది. ఐతే దృఢ సంకల్పముంటే కనుక ఏ పనైనాసరే తప్పక నెరవేరితీరుతుంది. నిజమైన సేవాభావము, అచంచల విశ్వాసము ఎన్నడూ వృథా కావు.

గాయాలపాలై, స్పృహతప్పుతున్న స్థితిలో నున్న రాణిని చూసిన మౌనబాబాగారి మనస్సులో కరుణ పెల్లుబికినది. ఆయన మౌనమును విడిచిపెట్టి అత్యంత కరుణాపూరితమైన వాక్కుతో 'పుత్రీ! నీకేమి కావాలి? నువ్వింత కష్టానికోర్చి నా చెంతకు ఎందుకు వస్తున్నావు? ఈనాడు ఇంత భీభత్సమైన తుఫానులో సైతం నువ్వెలా రాగలిగావు? చెప్పమ్మా...నీకేమి కావాలి?' అని అడిగారు.

రాణి తన చెవులను తానే నమ్మలేకపోయింది. ఏమిటి మౌనబాబాగారు మాట్లాడారా!! ఆశ్చర్యము!! ఆవిడ సేవ ఫలించినది. అప్పుడు రాణి చాలా విహ్వలస్వరంతో 'బాబా! నేనొక అభాగ్యురాలైన గొడ్రాలిని. మీ వద్దకు వచ్చినవారెవ్వరూ నిరాశతో వెనుదిరిగి వెళ్ళరు. బాబా! నాకొక పుత్రుడిని ప్రసాదించండి!' అని అంటూ ఆవిడ భక్తిప్రపత్తులతో బాబా శ్రీచరణముల మ్రోల ప్రణమిల్లినది. ఆవిడ పరిస్థితిని గాంచిన బాబాజీ కరుణ ఉప్పొంగుతుండగా 'తల్లీ! నీ కడుపు పండి నీకొక మగబిడ్డ కలుగుతాడు!' అని ఆశీర్వదించారు. బాబాగారి ఆశీస్సుల నందుకొని ఆవిడ సంతోషముతో రాజగృహమునకు వెళ్లిపోయింది.

రాణి వెళ్లిపోయిన తరువాత బాబాగారు తమ దివ్యదృష్టితో ఆమె నుదుటిరాతను దర్శించినప్పుడు 'రాణికి సంతానయోగం లేదు' అని గ్రహించారు. రాణికి వరమనుగ్రహించారుకదా? ఇప్పుడు చేయగలిగేదేమున్నది? 'ఇక ఇప్పుడు నేనే రాణి గర్భాన జన్మించాలి' అని నిర్ణయించుకున్నారు. ఆ నిర్ణయం తీసుకున్న తక్షణమే బాబాగారు సమాధిస్థితిలో తమ ప్రాణములను త్యజించారు. మరునాడు రాణివచ్చి చూసేసరికి బాబాగారి మృతశరీరము కనిపించినది. ఆయన శిష్యులిద్దరూ బాబాగారి అంతిమసంస్కారమునకు ఏర్పాట్లు కావిస్తున్నారు. రాణి అమిత దుఃఖములో కూరుకుపోయింది. తరువాత బాబాగారి వరదాన ఫలితముగా ఆవిడ గర్భం ధరించినది. రాజమందిరమంతటా ఆనందం వెల్లివిరిసింది. రాజు రెండుచేతులా ప్రజలకు దానాలు చేశాడు.

నెలలు నిండాక రాణి మగబిడ్డకి జన్మనిచ్చింది. సులక్షణుడు, సర్వాంగసుందరు డైనప్పటికీ రాకుమారుడు మూగవాడు. కాలచక్రం పరుగులుపెడుతూ ముందుకు సాగుతుండగా రాజకుమారునికి 12 సంవత్సరములు వచ్చాయి కానీ పిల్లవాడు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. వైద్యులు, భిషక్కులు తమ వైద్యంతోనూ; పండితులు, జ్యోతిర్విద్వాంసులు తమ ఉపాయముల ద్వారానూ రాకుమారుడిచేత మాట్లాడించలేకపోయారు. 'రాజకుమారుని చేత మాట్లాడించినవానికి అర్ధరాజ్య మిస్తాను' అని రాజు తన రాజ్యములో దండోరా వేయించాడు.

సాధారణముగా మూగవాడైన వ్యక్తి చెవిటివాడు కూడా అవుతాడు. కానీ రాకుమారుడు చెవిటివాడు కాదు. అతని నాలుక మూగవాడి నాలుకకి భిన్నముగా సుతిమెత్తగా, పల్చగా ఉండేది. అతను మేధావీ, ప్రతిభావంతుడూ కూడా! అతడు అనతికాలములోనే అన్ని విద్యలు ఔపోసనపట్టాడు, ఎన్నెన్నో కళలలో నిష్ణాతుడయ్యాడు.

ఒకనాడు రాజకుమారుడు తన సేవకులు వెంటరాగా

**నీ చిరునవ్వు మాత్రమే తెలిసిన మిత్రుని కన్నా నీ కన్నీళ్ళ విలువ తెలిసిన మిత్రుడు మిన్న**

మంత్రికుమారునితో అయిష్టముగా వేటకు వెళ్ళాడు. నిజానికి రాజకుమారుడికి హింసాత్మకమైన వేట అంటే ఎంతమాత్రమూ ఇష్టములేదు. అయినాకూడా అతడు బలవంతముగానే వారితో వేటకు వెళ్ళాల్సివచ్చింది. దైవవశాత్తు వేటకు వెళ్ళిన బృందము నకు ఆనాడు ఒక్క జంతువు కూడా చిక్కలేదు. కానీ సాయంత్రం ఆ బృందమంతా తిరిగి ఇంటికి వస్తున్నప్పుడు మాత్రము దారిలో ఒక చిన్న పొద వద్ద ఒక లేడి అఱుపు వినిపించినది. వేటగాండ్ర బృందంలోని సభ్యులు ఒక్కపెట్టున లేడిమీద దాడిచేసి దానిని చంపేశారు. లేడి దుర్దశను గాంచిన రాజకుమారుడు విహ్వలుడై కరుణాహృదయముతో స్వగతముగా ఇలా అనుకున్నాడు. 'నేను మాట్లాడితే మాట్లాడాను! మరి నువ్వెందుకు మాట్లాడావు? నేను మాట్లాడటం వలన ఇంకో జన్మ తీసుకోవాల్సి వచ్చింది. కానీ నువ్వు మాట్లాడినందువలన నీకు మృత్యువు ప్రాప్తించినది. ఏమి ఆ విధివైచిత్రి! ముందూ-వెనుకా ఆలోచించకుండా మాట్లాడటం వలన ఎంత దుఃఖము కలుగుతుంది?'

రాకుమారుడు తనలో తాను ఇలా మాట్లాడుకుంటున్నప్పుడు చెంతనే వున్న మంత్రికుమారుడు ఆ మాటలను విన్నాడు. అతను రాజమహల్‌కు వెళ్ళి జరిగినదంతా పూసగ్రుచ్చినట్లు రాజుకు విన్నవించాడు. రాజు ఆనందాశ్చర్యముల మిశ్రమ భావనతో 'ఏమిటి రాజకుమారుడు నిజముగానే మాట్లాడగలడా?' అని ప్రశ్నించి తిరిగి గాంభీర్యం వహించి 'రాజుగారితో అబద్ధం చెప్పటం వలన లభించే శిక్ష ఏమిటో నీకు తెలుసా?' అని అడిగాడు.

మంత్రికుమారుడు 'ప్రత్యక్షం కిమ్ ప్రమాణమ్' అనగా ప్రత్యక్ష ప్రమాణమును మించిన దేమున్నది అని దృఢ విశ్వాసంతో బదులిచ్చాడు. నేను చాలా నమ్మకంతో చెప్తున్నాను. రాజకుమారుడు మూగవాడు కాదు అని చెప్పాడు.

ఒకనాడు సభ ఏర్పాటుచెయ్యబడినది. ప్రజలందరూ ఈరోజు రాజకుమారుడు మాట్లాడుతాడు అన్న ఉత్సాహముతో ఆ సభకు విచ్చేశారు. ఉత్సాహంతోపాటే వారందరి మనస్సుల్లో 'ఒకవేళ మంత్రికుమారుడు చెప్పిన మాట అబద్ధమైతే అతను ఉరితీయబడతాడు' అన్న భయం కూడా గూడుకట్టుకుని ఉన్నది. కొద్దిక్షణములలోనే రాకుమారుడు సభలోకి అడుగుపెట్టాడు. కానీ మాట్లాడలేదు. రాజు కోపోద్రిక్తుడై మంత్రికుమారుడిని ఉరితీయమని ఆదేశించాడు. 'మంత్రికుమారుడు రాజ్య-లోభంతో అబద్ధమాడుతున్నాడు' అని మనస్సులో తలంచాడు రాజు.

సభాస్థలి మధ్యలో ఉరితీయటానికి కావల్సిన వస్తువులన్నీ అమర్చబడ్డాయి. సభలో నిశ్శబ్దము రాజ్యమేలుతున్నది. ఉరిని అమలుచేసే వ్యక్తి కొయ్యపలకకు కట్టిన ఉరిత్రాడును మంత్రి కుమారుడి మెడకు బిగించి దాన్ని లాగబోతున్నంతలో రాజకుమారుడు 'ఇతడిని చంపవద్దు! ఇతను నిర్దోషి!' అని పెద్దగా అఱిచాడు. రాకుమారుడన్న ఈ మాటలతో సభలో నెలకొనియున్న భయావహవాతావరణము తొలగిపోయి క్షణములో ఆనందం వెల్లివిరిసింది.

అటుపిమ్మట రాజకుమారుడు తన పూర్వజన్మగాథను సభలో ఇలా వినిపించాడు. 'రాజా! నేను హిమాలయముల గుహలో ఉండే ఆ మౌనసాధువునే! నీ భార్య చేసిన సేవలను, ఆవిడ శ్రద్ధను గాంచి నేను ఆవిడను 'పుత్రవతివగుదువుగాక!' అని ఆశీర్వదించాను. కానీ రాణి నొసటన సంతానయోగం లిఖించబడలేదు. అందువలన నా మాటను నిజం చెయ్యటానికి నేనే జన్మించవల్సివచ్చింది. నేను గొడ్రాలిని అన్న భావన రాణి మనస్సునుండి ఇప్పుడు తొలగిపోయింది. ఆ కారణము చేత ఇక నేను ఇక్కడ ఉండటంలో అర్థమేమీ లేదు. నేను మరలా నా తపోసాధనను కొనసాగించటానికి వెళ్ళిపోతున్నాను. గాయత్రీసాధనలోనే మానవజీవన సార్థకత దాగి ఉన్నది. గాయత్రీసాధనతోనే మానవజీవితము చరితార్థమౌతుంది.' ఉపస్థితమై ఉన్న అశేషజనవాహిని పునర్జన్మ-పూర్వజన్మల ఈ విచిత్రమైన చమత్కారమును గాంచి నిశ్చేష్టమైపోయింది. ఏ గాయత్రీసాధన కోసమై రాకుమారుడు తన రాజ్యమును తృణప్రాయముగా త్యజించివేసి తిరిగి తపస్సు కొనసాగించటానికి వెళ్ళిపోయాడో ఆ గాయత్రీసాధనా మహిమ వారిని చకితులను గావించినది.

మౌనబాబాగారి నుండి ప్రేరణను పొందిన సభికులందరూ తమలో తాము గాయత్రీమంత్రసాధనా మహిమను వేనోళ్ళ పొగడుతూ, తామూ అదే మార్గములో ముమ్ముందుకు పయనించాలని సంకల్పిస్తూ తమ తమ ఇళ్ళకు మరలిపోయారు.

*- అఖండజ్యోతి, సెప్టెంబర్ 2000*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**జీవితంలో ఏది సులభంగా దొరకదు ప్రయత్నంతోనే దొరుకుతుంది**

గాయత్రీ జయంతి ప్రత్యేకం

# మహాతపస్సుకు సంకల్పించే సమయము ఆసన్నమైనది



జ్యేష్ఠశుక్లదశమినాటి శుభ ఘడియలలో గాయత్రీ మరియు గంగ భారత భూమి మీద అవతరించాయి. ఈ అవతరణ ఏరకముగానూ సులభముగా జరుగలేదు అని పురాణములు చెపుతున్నాయి. ఇవి అవతరించటానికి గానూ విశ్వామిత్రుడు మరియు భగీరథుడు అతి భయంకరమైన, దుష్కరమైన, కఠినమైన తపస్సు చేయవల్సివచ్చినది. ఆదికవి మహర్షి వాల్మీకి ఈ మహా తపస్సు యొక్క ప్రసంగమును చాలా రోమాంచితమైన, ప్రేరణ నివ్వగలిగే శైలిలో వర్ణించాడు. మహాతపస్సునుండి ప్రకటితమైన జ్ఞానము మరియు పవిత్రత అనే మహాశక్తులు యుగయుగముల వరకు తపస్సు యొక్క శక్తికి మరియు మహోన్నత జీవన విలువలకు ప్రతీకగా నిలిచిపోయాయి. కలుషితమైన ఈ యుగములో కూడా ఈ రెండిటి యొక్క స్థితి చెక్కుచెదరలేదు, మసక బారలేదు. వీటిని భారతీయ సంస్కృతి యొక్క సార్వభౌమత్వమునకు ప్రతీకగా స్వీకరిస్తారు. జ్ఞానము గురించి ఎప్పుడెప్పుడు చర్చ జరిగినా గాయత్రీ తత్త్వచింతనయే అంతిమ ప్రమాణముగా అంగీకరించబడుతుంది. గంగానదిలోని జలమునే చేతుల నిండుగా తీసుకుని పవిత్రతకు సంబంధించిన ప్రతిజ్ఞలు చేస్తారు. పవిత్రతకు సంబంధించిన ప్రమాణాలు, ప్రతినలు చేస్తారు. బహుశః ఈ కారణముల వల్లనే వాటి స్థితిలో పెద్దగా మార్పురాలేదేమో!

జ్ఞానము మరియు పవిత్రత అనే ద్వయమే భారతీయ సంస్కృతికి చెందిన సనాతన ఆధారములు. భారతీయ సంస్కృతికి సంబంధించిన ఆచార వ్యవహారములు, సంప్రదాయములకు చెందిన సంపూర్ణ విషయములు వీటి సార్వభౌమాధికారము యొక్క ప్రతిపత్తి ద్వారానే నిర్ధారించబడినాయి. ఈ పుణ్యభూమిలో ఏదైనాసరే 'జ్ఞానము, పవిత్రత' అనేవాటి ఆధారముగానే లెక్కించబడినది, కొలవబడినది. ఆ తరువాతే అది శ్రేష్ఠతమమైనది అని భావించబడినది, పిలువబడినది. ధనము, వైభవము, యశస్సు, సమృద్ధి లేక తెలివితేటలు, బుద్ధి లేక వాక్ నైపుణ్యముల గొప్పతనము కీర్తించబడినది కానీ, వాటిని ఎన్నడూ శ్రేష్ఠమైనవని, శ్రేష్ఠతమములని అంగీకరించలేదు, చెప్పలేదు. వాటితో జీవితము సుఖమయము, ప్రీతికరముగా అవుతుందేమో కానీ, జీవితమును శ్రేయస్కరముగా మాత్రము రూపొందించుకొనలేము. భారతీయ సంస్కృతికి చెందిన సూత్రములు, తత్త్వములు ఎన్నడూ కూడా సుఖమును సంపూర్ణముగా అనుభవించమని, వాటిని పొందమనే ప్రేరణను ఇవ్వవు. తన సుఖమును పంచమని, ఇతరుల బాధలను పంచుకోమనే ప్రేరణనే ఇస్తాయి.

ఈనాడు జ్ఞానము గురించి విస్తృతముగా చర్చలు జరుగుతున్నాయి. పాశ్చాత్యులైనా లేక మన దేశవాసులైనా అందరూ ఈ జ్ఞానధారలో పడి కొట్టుకుపోతున్నారు. బుద్ధిమంతులు, విద్వాంసులు అందరూ ఈ జ్ఞానధారను స్పృశించినవారే. జ్ఞానమే మూలముగా ఉన్న సమాజము, జ్ఞానము యొక్క స్వప్నదర్శనము ఒక్క విషయమునే సూచిస్తున్నాయి. అదేమిటంటే 'మనిషి ఒకసారి జీవితము యొక్క గొప్పతనమును తెలుసుకుంటే కనుక మరి ఇంకా ఈ జ్ఞానోపార్జన ఎందుకు? సుఖాన్వేషణ చేయటానికా? లేక వాటిని పంచుకోవటానికా? ఇతరుల బాధలను పంచుకోవటానికా? లేదా కేవలము తమ తమ కుటుంబములు మరియు తమ తమ జాతి లేక ప్రాంతము వరకు పరిమితమవ్వటానికా? లేక సుఖములను పంచుకోవటానికా? లేక అనుభవించటానికా?' ఏ జాతికైనా, దేశమునకైనా లేక స్వయముగా మనిషికైనా

**పదిమందికి మేలుచేసే వారి వెనుక నూరుగురు ఉంటారు**

ఈ ప్రశ్నలు చాలా మహత్త్వపూర్ణమైనవి. జ్ఞానము ఎందుకు? దేనికొరకు? ఈ ప్రశ్నలను ఉపేక్షించరాదు. జవాబియ్యకుండా వదిలేయకూడదు.

మనము ఎవరిని జ్ఞానులు అని అనాలి? కంప్యూటర్‌నా? లేక గ్రంథాలయమునా? లేక ప్రయోగశాల అధిపతినా? లేక తన హితము గురించి లెక్కలేనన్ని విషయములను గురించి ఆలోచించేవాడినా? లేక సదాసర్వదా ఇతరుల మేలు గురించే జీవిస్తూ, వారికొరకే మరణించేవాడినా? ఎవరిని జ్ఞానులనాలి? జ్ఞానము యొక్క అత్యుత్తమసిద్ధి ఏమిటి? పురాతనకాలము నుండి ఈ విషయమును గురించి గొప్పగొప్ప భావనలు అందించబడుతూనే ఉన్నాయి. యుగయుగముల నుండి సాగుతున్న సనాతన ఆలోచనా మంథనము నుండి వెలువడిన నవనీతము, సారము భగవద్గీతలో చెప్పబడినది అనే చెప్పాలి. 'నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే ।' అని యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు బోధించాడు. జ్ఞానము వలె పవిత్రము కావించే తత్త్వము మరేదీ లేదు. అనగా జ్ఞానము యొక్క మహోన్నత సిద్ధి పవిత్రతయే! మనలను పవిత్రము కావించే, సంస్కరించే, మన వ్యక్తిగత జీవితములో, కుటుంబ జీవితములో మరియు సామాజిక జీవితములో పవిత్ర భావనలను నింపే ప్రక్రియ పేరే 'జ్ఞానము!

'జ్ఞానము' అనే పదమునకు గల అన్ని నిర్వచనములకు జన్మస్థానము గాయత్రీమంత్రమే! జ్యేష్ఠశుద్ధదశమినాడు 24 అక్షరములు గల గాయత్రీమంత్ర రూపు ధరించి, అవతరించిన యుగశక్తిలో ఆ నిర్వచనములున్నాయి. ఓం భూర్ భువః స్వః తో కూడిన గాయత్రీలోని మూడు చరణములు ఈ ప్రేరణలతోనే నిండియున్నాయి. ఓంకారము సృష్టియొక్క ప్రప్రథమ నాదము. ధ్యానబీజము. ఓంకారమునుండే సమస్త జ్ఞానము, వేద మంత్రములు, జ్ఞానమును బోధించే వాక్కులు ప్రస్ఫుటిత మైనాయి. ఓంకారమును అవగాహన చేసుకున్నవారు సృష్టిని, దాని రహస్యములు, తన పుట్టుక గురించి కూడా అర్థము చేసుకోగలరు. పరమాత్మే భూర్ భువః స్వః లలో వ్యాపించి ఉన్నాడు. అన్నీ ఆ పరమాత్మకు చెందినవే! సమస్తమూ ఆయన లోనే ఉన్నాయి. ఇందువలన 'సనాతనత్వము, పవిత్రత మరియు ఏకత్వమే' జ్ఞానము!

**తత్సవితుర్వరేణ్యం-దీనిని వరించుటలోనే మేలు దాగియున్నది!**

**భర్గోదేవస్యధీమహి - ఆ తేజస్సును ధారణ చేయుటయే తెలివైన పని. ఆ తేజస్సును ధారణ చేయుటయే బుద్ధి యొక్క పని!**

**ధియో యోనః ప్రచోదయాత్ - ఆ ప్రభువు మన బుద్ధిని సన్మార్గము వైపు ప్రేరేపించుగాక! ఇదే జ్ఞానము!** ఇందులోనే జీవితమును సార్థకము కావించే బోధ ఉన్నది.

గాయత్రి యొక్క ఈ స్వరమే జలధారరూపములో గంగా నదిగా ప్రవహిస్తున్నది. అందుచేతనే గంగానది 'సురగంగ, దేవోపమ' వంటి నామములతో పిలువబడుతున్నది. ఈనాటి భౌతికవాదయుగములో ఈ సత్యమును అర్థము చేసుకోవటము తప్పకుండా కష్టమైన పనే కానీ, ఇప్పుడుకూడా అవగాహన చేసుకోవటము అసంభవము మాత్రము కాదు. అనుభూతి చెందుటే సర్వస్వము అని తలచే భౌతికవాదము బుద్ధిని ప్రక్కదారి పట్టించినది. అయితే పురాతనకాలము నుండీ వస్తున్న సంస్కారములను అది ఇప్పుడు కూడా ఏమాత్రమూ తుడిచి పెట్టలేకపోయింది. గంగాజలము చూడటానికి సామాన్యమైన నీటివలెనే కనిపిస్తుంది. గంగాజలము యొక్క భౌతిక, రసాయనిక గుణములు రంగులేని, వాసన లేని, హైడ్రోజన్+ ఆక్సిజన్ అనే రెండు పరమాణువుల కలయికతోనే ఏర్పడినవి అని చెపుతారు, అయితే కేవలము భౌతికముగా కనిపించే రూపమును గురించి మాత్రమే ఇలా చెప్పబడినది. గంగా జలములోని ప్రాణములను గురించిన అసలు సత్యము వేరే ఉన్నది. గంగాజలములోని ప్రాణములలో స్థూల మరియు సూక్ష్మరూపములో హిమాలయముల ఒడిలో కూర్చుని తపస్సు చేస్తున్న మహాతాపసుల తపోశక్తి ప్రవహిస్తున్నది. అంతేకాదు హిమవంతుని సంపూర్ణ దివ్యత్వము కూడా గంగాజలములో కల్సిపోయి ప్రవహిస్తున్నది.

ఎంతోమంది మహాసాధకులు గోముఖమునుండి గంగా సాగరసంగమము వరకు విస్తరించిన గంగానది ఒడ్డున కూర్చుని సాధన చేస్తూ చేస్తూ తమ ప్రాణములను విడిచిపెట్టారు. లోకకళ్యాణ నిమిత్తము కఠోర సంఘర్షణ చేసిన ఎంతోమంది మహామానవుల శరీరము భస్మీభూతము కావించబడి గంగా

**మాట్లాడుటకు మంచి దొరకనిచో మౌనంగా ఉండుట మేలు**

జలములో కలుపబడినది. పవిత్రతను ప్రసాదించే గంగామాత ఎన్నెన్నో గొప్ప గొప్ప ఆధ్యాత్మిక అభియానములకు ప్రేరణగా నిలిచినది. గంగానది ఎల్లప్పుడూ భారతీయ సంస్కృతిని ఏక సూత్రములో బంధించి ఉంచినది. భారతీయ సంస్కృతీ గౌరవమును చాటే ప్రతి సంఘటనా ఈ నదీమతల్లి గర్భము నుండే పురుడుపోసుకుంది. దివ్య(దైవీ)-జీవనము, దైవీ-భావనలనే వరమును అనుగ్రహించే మాత దేవసంస్కృతికి జనని మరియు జన్మధాత్రి!

కాల(మహిమ)ము అందరి మీద ప్రభావమును చూపిస్తుంది. గాయత్రీ మరియు గంగ యొక్క ప్రకటిత రూపము మీద కూడా కాలము యొక్క ప్రభావము పడుతుంది. ప్రకటితమైన రూపముల యొక్క విశేషత ఇక్కడ ఎందుకు చెప్పబడినదంటే-వీటి అప్రకటిత మరియు దివ్య రూపములను కాలము కూడా స్పృశించలేదు. ఈ కారణము గానే నేటికి వేలాది సంవత్సరములకు పూర్వము ప్రకటితమైన గాయత్రీ రూపము పండితులు మరియు ఆచార్యులకు వివాదాస్పద విషయముగా నిలిచిపోయినది. దీని దైవీకాంతి(ప్రభ) కలుషిత మైన ఆలోచనలు, భావనలతో మసకబారుతున్న సమయములో 'ఈ యుగపు విశ్వామిత్రుడు'గా పరమపూజ్యగురుదేవులు అవతరించారు. గురుదేవులు హిమాలయములోని ఋషుల ఆశీర్వాదములు, శక్తి, సామర్థ్యమును తమలో నింపుకుని జన్మించారు. 24 సంవత్సరములపాటు కఠోర తపస్సుతో చేసిన గాయత్రీ సాధన ద్వారా 'గాయత్రీ యొక్క జ్ఞానధారలో వెల్లువెత్తిన ఆలోచనా కాలుష్యమును' సంపూర్ణముగా తొలగించివేశారు. ఇప్పుడు భగవతి గాయత్రీ యొక్క మంత్రము తన సంపూర్ణమైన సార్థకరూపములో మనిషి మనిషి మనస్సులో పాట వలె మారు మ్రోగుతున్నది.

దేవపురుషులైన గురుదేవులు తమ జీవితములోని చివరి 20 సంవత్సరముల సాధననూ దాదాపుగా గంగానది ఒడ్డుననే పూర్తిచేశారు. వారు స్వయముగా గంగాజలమును పానము చేశారు. శాంతికుంజ్‌కి వచ్చే సాధకులకు ఈ పవిత్రజలము యొక్క మహిమను బోధించారు. గంగానది కాలుష్యరహితమై, తన దైవీవైభవమును పొందనంతవరకు వారి యొక్క ఈ జ్ఞానబోధ అసంపూర్ణముగానే మిగిలిపోతుంది. గంగామాత గౌరవమును పునఃప్రతిష్ఠించటానికి యుగవిశ్వామిత్రుని యొక్క సంతానము 'భగీరథుల' వలె మారాలి! వారే తపస్సును ఆచరించాలి! సర్వశ్రేష్ఠమైన ఈ నూతన యుగ మహా గంగావతరణ ఎంతో దుష్కరమైనదీ, దుస్సాధ్యమైనదీ అయినా పరిజనులు దీనిని చేసి చూపించాలి. సత్యమేమిటంటే ఈ కార్యము ఇంతకుముందుకూడా సులభముగా పూర్తవ్వలేదు. భగీరథునికంటే ముందు అతని పూర్వీకులు ఎంతోమంది గంగావతరణ కొరకు అత్యంత కఠోర తపస్సును చేశారు. మనమందరము గంగావతరణ కొరకు తరతరాలపాటు తిరిగి తపస్సు చేయవల్సివచ్చినా, ఈ కఠోరకార్యము ముందు మన సంకల్పము బలహీనమైపోకూడదు. ఈసారి వచ్చే జ్యేష్ఠ శుక్ల దశమిని మనము సంకల్ప ఉత్సవరూపములో చేసుకోవటమే అన్నింటికన్నా గొప్ప శుభకార్యము. "ఈ పుణ్యకాలములో గాయత్రి-గంగ అనగా జ్ఞానము-పవిత్రత లనే రెండుధారలను నిర్మలము, కాలుష్యరహితము కావించి, వాటి స్వచ్ఛమైన స్వరూపమును భావితరములకు అందించాలి" అని సంకల్పిస్తూ మహాతపస్సును ఆరంభించెదముగాక!!

– *అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## నేను నాయకుణ్ణి కాదు - సేవకుడిని

*శ్రీ రఫీ అహమాద్ కిద్వామి దగ్గరకు కొంతమంది కార్యకర్తలు వచ్చారు. కుశల ప్రశ్నలయ్యాయి. నా వలన కావలసిన పని ఏమిటని అడిగాడు కిద్వాయి. "మేమొకసభ నేర్పాటు చేసికున్నాము. దానికి టెలిఫోన్ అవసరముంది. అంతేగాక సభ్యులంతా సుఖంగా చేరుకోవటానికి రైలులో ఒక ప్రత్యేక బోగీని దయతో ఏర్పాటు చేసి పెట్టాలి. మీరు కూడ సభకు తప్పనిసరిగా విచ్చేయాలి" అంటూ కోర్కెల దండకం చదివారు. అనుకున్న విధంగానే అన్నీ సమకూర్చారు – తరువాత ఫోనుచేసి చెప్పారు. "నేను సభలు సమావేశాలకు దూరంగా ఉంటాను. నేను నాయకుడను కాను. కేవలం సేవకుడను మాత్రమే. కాబట్టి నా కోసం ఎదురు చూడకుండా మీ సభాకార్యక్రమాన్ని నిర్వహించు కోండి. శుభం" అన్నాడు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం : శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

**కదలని బొమ్మకు కవితలు చెప్పినా మారని మనిషికి నీతులు చెప్పినా ఒక్కటే**

గాయత్రీ జయంతి ప్రత్యేకం

# ముక్తిదాత మన గురుదేవులు

పరమపూజ్య గురుదేవుల నుండి ఇంత తొందరగా తన (శుక్లా) ఉత్తరమునకు జవాబు రావటము చూసి శుక్లాకు ఆశ్చర్యము కలిగినది. అయితే ఉత్తరమును తెరచి అందులోని సారాంశమును చదువుతూ, చదువుతూ అతను విస్మయము, ఆశ్చర్యము, శ్రద్ధ అనే ఆనందా(సుఖా)నుభూతులలో మునక లేస్తూ స్తబ్ధుడైపోయాడు. కొద్దిసేపటి తరువాత ఆ భావజాలము నుండి బయటపడి, 2 సంవత్సరముల క్రితము జరిగిన, తన స్మృతిపథములో ఇంకా సజీవముగా నిలచియున్న ఆ అనుభూతిని గుర్తుచేసుకోసాగాడు. మహంతుగారి గొప్పతనము, ఆయన చెప్పిన మాటలు శుక్లా ఇంకా మరచిపోలేదు. కాల ప్రవాహములో ఆ గుర్తులు చెదరిపోలేదు. ఆ సంఘటన జరిగినప్పుడు శుక్లా బీహార్‌లోని మస్తీచక్ అనే ఊరిలో నివసిస్తూండేవాడు. ఒకరోజు సాయంసంధ్యవేళ ఇంటికి తిరిగి వచ్చినప్పుడు సమీపములోనే నివసిస్తున్న మహంతుగారు తనను రమ్మనమని కబురుపంపిన సంగతి తెలిసినది. ఆ మహంతు గారు నిజముగానే ఆధ్యాత్మిక వ్యవహారశైలి కలిగిన గొప్ప వ్యక్తిత్వ సంపన్నుడు! సాధనే ఆయన ప్రాణము. సేవే ఆయన జీవితము. ఆయన రోమరోమములోనూ సంవేదనలు తొణికిస లాడుతుండేవి.

మహంతుగారియొక్క ఈ ఉన్నతమైన వ్యక్తిత్వము కారణముగానే చుట్టుప్రక్కల గ్రామముల ప్రజలు ఆయనను విశ్వసించేవారు. శ్రద్ధతో ఆయన ప్రవచనములను ఆలకించే వారు. అయితే ఆయనను గురించి కొన్ని పుకార్లు షికార్లు చేస్తుండేవి. ఆయన ఇప్పుడు ముసలివారైపోయారు. దరిదాపుగా ఆయన మఠాన్ని అంటిపెట్టుకొని ఉంటున్నారు. మహంతుగారు పిలిచారు అన్న మాట విన్న వెంటనే శుక్లా మనస్సులో ఒక ప్రశ్న తలెత్తింది. అయితే అతను తల పంకించి ఆ ఆలోచనను ప్రక్కనపెడుతూ మఠమువైపుగా సాగిపోయాడు. మహంతుగారు తన మఠ ప్రాంగణములోనే ఒక సాధారణమైన మంచముమీద కూర్చుని ఉన్నారు. శుక్లా రావటం చూసి ప్రసన్నతాపూర్వకంగా తన కుడిచేతిని పైకెత్తి తన దగ్గరకు వచ్చి కూర్చొనమని సూచించి, ఇలా చెప్పసాగారు. 'శుక్లా! నీకు గాయత్రీమంత్రమును సిద్ధింపజేసుకున్న ఆచార్యులవారు గురువు రూపములో లభించారు. కనుక నువ్వు చాలా అదృష్టవంతుడివి!'

మహంతుగారికి గురుదేవుల పట్ల అచంచల భక్తి-శ్రద్ధలు ఉన్నాయి. కానీ ఈ సంధ్యాసమయములో ఆయన తన యొక్క ఈ శ్రద్ధను తెలియజెప్పటానికి తనను పిలిపించియుండరు. శుక్లా ఆలోచనలను మహంతుగారు పసిగట్టారు. 'చూడు నాయనా శుక్లా! నాకు నా అనేవారెవ్వరూ లేరు. అంతా నువ్వే. దగ్గరి బంధువులైనా, ఆత్మీయుడవైనా అంతా నువ్వే.' అని అన్నారు. 'మహరాజ్! ఇది ప్రత్యేకించి చెప్పాల్సిన విషయమేమీ కాదు' అని శుక్లా ఇంకా మాట్లాడుతూండగానే మహంతుగారు ఆ మాటలకు అడ్డుతగులుతూ ఇలా అన్నారు. 'ముందు నువ్వు నేను చెప్పే మాటలను విను. ఆ పిమ్మట జవాబియ్యి.' ఈ మాటలను అంటూ మహంతుగారు నిశ్శబ్దముగా శ్వాసించి, ఏదో ఒక అదృశ్యలేఖను చదివే ప్రయత్నము చేస్తున్నట్లుగా శూన్యదృక్కులతో ఆకాశము వంక చూడసాగారు. మహంతు గారి విస్మయజనకమైన మౌనముతో శుక్లాలో ఉత్సుకత మరింత పెరిగింది. 'ఆజ్ఞాపించండి! తమరు సంకోచించకండి! చెప్పండి!' అని అన్నాడు శుక్లా. 'చూడు శుక్లా! నేటికి 15 రోజుల తరువాత నాకు పక్షవాతము వస్తుంది. నేను మంచానపడతాను. అది ఏ మందులకూ నయముకాదు. నా ఈ అనారోగ్యపరిస్థితి దాదాపు 2 నెలలపాటు ఉండవచ్చు. ఆ పిమ్మట నేను శరీరమును వదిలిపెడతాను. నాకు ఈ వ్యాధి సోకిన సమయములో నువ్వే సేవ చేయాలి. నాకు నువ్వు తప్ప మరెవ్వరూ లేరు. నేను ఒక శిష్యుడిని తయారు చేసుకున్నాను. కానీ అతను తన గురువును వదిలిపెట్టి హిమాలయములలో సాధన చేసుకునేందుకు వెళ్ళిపోయాడు' అని చెపుతున్నప్పుడు ఆయన ముఖములో చింతతోకూడిన విషాదఛాయలు అలము కున్నాయి. శుక్లా ఆయన బాధను, చింతను తొలగించాలనే ఉద్దేశ్యముతో 'మీరు చింతించకండి. మీకు నేనున్నానుగా. నేను మీకు అన్ని సేవలూ చేస్తాను' అని అన్నాడు.

**నేడు కొత్త వస్తువు రేపటికి పాతదే. కావున మార్పులను చిరునవ్వుతో స్వీకరించు - ఆనందం నీదే**

శుక్లా నోటితో ఈ మాట అయితే అన్నాడే కానీ మనస్సులో మాత్రము 'మహంతుగారిని వృద్ధాప్యము ఆవరించిన కారణముగా భ్రమకు లోనైవుంటారు లేదా మరణిస్తానని భయపడుతూ ఉండి ఉంటారు' అని అనుకోసాగాడు. చైతన్య వంతముగా ఉన్న మహంతుగారి సంవేదనలు శుక్లా ఆలోచన లను వెంటనే పసిగట్టాయి. ఆయన సన్నగా నవ్వుతూ 'శుక్లా! నేను తప్పకుండా ముసలివాడినే. కానీ భ్రమకు లోను కాలేదు. నాకు నా ఆరోగ్యము గురించిన చింతా లేదు. మరణ భయమూ లేదు. నాకు కేవలము నా ముక్తి గురించిన చింత ఉన్నది. నాకు కొంత కర్మశేషమున్నదని తెలుసు. అది ఉండగా నాకు ముక్తి లభించదు. నాకు నీ సహాయము లభించి, ఆచార్యులవారు కృప చూపించినచో ఈ చింత మటుమాయమై పోతుంది' అని అన్నారు. 'ఏవిధముగా మహరాజ్!' ఇక ఇప్పుడు మహంతుగారి యొక్క ఈ తలాతోకాలేని మాటలు, రహస్య మయమైన విషయముల పట్ల శుక్లాలో ఉత్సుకత పెల్లుబికింది.

అయితే మహంతుగారు ఇంకా తమ ఆలోచనలలోనే మునిగియున్నారు. ఆయన భావముద్రలోనే ఉండి, 'నేను మరణించిన పిమ్మట నువ్వు నా కొరకు 5 సంవత్సరములపాటు, ప్రతీ సంవత్సరము లక్షాపాతికవేల గాయత్రీజపానుష్ఠానము పూర్తి చెయ్యి. ఆ తదుపరి ఒక గాయత్రీయజ్ఞమును తలపెట్టి, ఆ యజ్ఞమునకు గురుదేవులని ఆహ్వానించు. ఆచార్యులవారు వచ్చిన పిమ్మట ఆయనను నా గదిలో ఒక గంట కూర్చొని సాధన చేయమని ప్రార్థించు. గురుదేవుల సాధన, ఆయన ఆశీర్వాదము, కృప వలన నేను కచ్చితముగా ముక్తిని పొందు తాను' అని చెప్తూ మహంతుగారు తమ మాటలను ముగించారు. శుక్లా ఆయనకు నమస్కరించి వెళ్ళిపోయాడు. తిరిగి ఇంటికి వస్తున్నప్పుడు మహంతుగారు చెప్పిన మాటలే చెవులలో మారుమ్రోగసాగాయి. శుక్లా ఆయన చెప్పిన మాటలను రెండు, మూడు రోజులలోనే మరచిపోయాడు. 15 రోజుల తరువాత మహంతుగారికి పక్షవాతము వచ్చినప్పుడు అతనికి తిరిగి ఆ మాటలు గుర్తుకొచ్చాయి.

ఇక అప్పటినుండి శుక్లా ప్రాణప్రదముగా మహంతుకు సేవ చెయ్యటము ఆరంభించాడు. విధి బలీయమైనది. మహంతుగారు తాము చెప్పిన సమయమునకు మరణించారు. మహంతుగారి అంతిమసంస్కారములన్నీ శుక్లా స్వయముగా నిర్వహించాడు. ఆయనకు తాను ఇచ్చిన మాట ప్రకారము శుక్లా లక్షాపాతికవేల గాయత్రీమంత్రజపానుష్ఠాన సంకల్పము తీసుకుని, రెండు సంవత్సరములపాటు నిరాటంకముగా పూర్తి చేశాడు. అయితే రెండు సంవత్సరముల తరువాత అతని మనస్సు ఎదురుతిరిగింది. ఇక మిగిలిన మూడు సంవత్సరముల అనుష్ఠానమును ఎవరైనా ఒక బ్రాహ్మణుని ద్వారా పూర్తి చేయిస్తాను అని భావించాడు మనస్సులో. ఇచ్చిన మాట మేరకు ఈ సంవత్సరమే యజ్ఞమును తలపెట్టి, పూర్ణాహుతికి పూజ్య గురుదేవులను ఆహ్వానించి, మహంతుగారి కోరికను తీర్చి, ఈ జంజాటమునుండి ఎందుకు బయటపడకూడదు? అని కూడా మనస్సులో విమర్శనాత్మకముగా అనుకున్నాడు. ఇలా ఆలోచించుకుని అన్ని వివరములతో గురుదేవులకు ఉత్తరము వ్రాశాడు.

ఈరోజు ఆ ఉత్తరమునకే గురుదేవులనుండి జవాబు వచ్చినది. ఏ తేదీన అయితే శుక్లా గురుదేవులకు ఉత్తరము వ్రాశాడో, సరిగ్గా ఆ తేదీననే గురుదేవులు అతని ఉత్తరమునకు ప్రత్యుత్తరమివ్వటము చూసి శుక్లా విస్మయము చెందాడు. అంతర్యామియైన గురుదేవులు అతని మనస్సులోని ఆలోచనలను పసిగట్టి ప్రత్యుత్తరమిచ్చివుంటారు. అఖండజ్యోతి సంస్థానము నుండి ఆ ఉత్తరము వ్రాశారు. అయితే గురుదేవులు దానిలో వ్రాసిన విషయములు మరింత చకితము కావించాయి. విస్మయపరచాయి. 'మీ మహంతుగారికి, మాకు మధ్య జరిగిన సంభాషణ, మేము ఇచ్చిన వాగ్దానము గుర్తున్నది. కానీ నువ్వు సంవత్సరమునకు లక్షాపాతికవేలు చొప్పున 5 సంవత్సరముల పాటు గాయత్రీమంత్రజపానుష్ఠానము పూర్తిచెయ్యాలి అన్న ఒడంబడిక చేసుకున్నాము. నువ్వు ఆ అనుష్ఠానము పూర్తిచేస్తేనే అది సత్ఫలితమునిస్తుంది తప్ప, ఎవరో ఒక బ్రాహ్మణుని ద్వారా దానిని పూర్తిచేయిస్తే ఉద్దేశ్యము నెరవేరదు. అంతేకాదు 5 సంవత్సరముల అనుష్ఠానము పూర్తయిన తరువాతనే యజ్ఞము, పూర్ణాహుతి చేయాలి. కనుక నువ్వు ఇప్పుడు తొందరపడకు. సరైన సమయములో మేము తప్పక వస్తాము' అని ఉత్తరము లోని సారంశము.

ఈ ఉత్తరము చదివి చకితుడై, కర్తవ్యపరాయణుడై శుక్లా తన మనస్సులోనే గురుదేవులకు వందనము అర్పించాడు. అంతేకాదు 5 సంవత్సరముల గాయత్రీమంత్ర జపానుష్ఠానమును

**కాకులతో పావురం కలిసి తిరిగితే రూపుమారదు, బుద్ధి మారుతుంది**

పూర్తిచేయుటలో లీనమైపోయాడు. సరిగ్గా 5 సంవత్సరములు పూర్తయిన పిమ్మట అతను యజ్ఞము చేయాలని సంకల్పించి, గురుదేవులను ఆహ్వానించాడు. గురుదేవులు మఠములో అడుగు పెడుతూనే ఎవ్వరితోనూ మాట్లాడకుండా నేరుగా మహంతు గారు నిత్యమూ ఉపాసన చేసుకునే గదిలోకి వెళ్ళబోతూ, శుక్లాను బయట గుమ్మము వద్దే నిలబడమని ఆదేశించి లోపలికి వెళ్ళి తలుపులు గడియపెట్టుకున్నారు. సరిగ్గా గంట తరువాత గురుదేవులు తలుపులు తెరచి, గుమ్మము వద్ద నిలబడిన శుక్లాతో 'ఇక నువ్విప్పుడు లోపలికి వెళ్ళు' అని అన్నారు.

శుక్లా ఆ గదిలోకి అడుగుపెడుతూనే నోట మాట రాక స్థాణువైపోయాడు. ఎందుకంటే అక్కడ మహంతుగారు స్వయముగా దివ్యమైన దైవీరూపములో నిలుచునియున్నారు. ఆయన కళ్ళనుండి ఆగకుండా కన్నీళ్ళు వర్షిస్తున్నాయి. మహంతు గారి ప్రకాశమయ శరీరమునుండి వెలువడే కాంతి గదంతా పరచుకున్నది. మహంతుగారు దివ్యమైన శరీరముతో అక్కడ ఉండటముచేత అలౌకికమైన దివ్యగంధము గది అంతా వ్యాపించసాగింది. ఆయన శుక్లాకు ప్రణామము చేస్తూ తమ కృతజ్ఞతను ఆవిష్కరించినప్పుడు శుక్లా ఎంతో విస్మయానికి గురయ్యాడు. 'శుక్లా! నీవు ధన్యుడవు! నీ కారణముగానే నాకు ఆచార్యులవారి కృప ప్రాప్తించినది. ఆయన దయవలన ఈనాడు నేను సమస్త కర్మబంధములనుండి, భవబంధముల నుండి ముక్తిచెందాను' అని అన్నారు మహంతుగారు. ఈ అపూర్వదృశ్యము చేత విహ్వలుడైన శుక్లా, మహంతుగారు అదృశ్యమయ్యాక గది వెలుపలకి వచ్చి 'మన గురుదేవులు ముక్తిదాతలు! మన గురుదేవులు ముక్తిదాతలు!' అని పలుమార్లు ఎలుగెత్తి చాటసాగాడు. పరమ ముక్తిప్రదాయిని ఐన గాయత్రీ మంత్రమును తమ సమస్త శిష్యగణమునకు సమానభావముతో అనుగ్రహించిన మన గురుదేవులు ముక్తిదాతలే అన్న సత్యమును ఒకటి కాదు అసంఖ్యాకమైన అనుభవములు నిజముగానే ఆవిష్కరిస్తున్నాయి. గాయత్రీజయంతి పుణ్యవేళలో మన ముక్తి మార్గమును ప్రశస్తము కావించే మన గురుసత్తాకు, గాయత్రీ మాతకు మనసా వాచా కర్మణా వందనములు అర్పిస్తూ కృతజ్ఞులమై ఉందుముగాక!

– *అఖండజ్యోతి, జనవరి 2007*

అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు

---

## కూడబెట్టెడి ధన సంపదలు - సమాజ కళ్యాణానికై వినియోగించాలి

*ఒకసారి ఒక రాజ్యంలో ఆ ఆదేశపు రాజు అధికాధిక ధనాన్ని సంగ్రహించగోరి ప్రజలపై అధిక పన్నులు మోపాడు. దీనితో ప్రజల ఆర్థికస్థితి సన్నగిల్లింది. కొన్నాళ్ళకు రాజ్యంలో కరువు సంభవించగా ప్రజలు ఆకలిదప్పులతో మరణించసాగారు. కాని రాజు మనస్సు ద్రవించలేదు. దీనికి తోడు కూడబెట్టిన ధనాన్ని ప్రజలకై ఖర్చు చేయుటకు కూడా సంసిద్ధుడు కాలేదు. ఆ సమయంలో ఒక మహాత్ముడు ఆ రాజ్యంలో ప్రవేశించాడు. ప్రజల దుర్దశను గాంచి, రాజును కలిసికొని మాట్లాడుటకై రాజమహలు లోపలికి వెళ్ళాడు! మహాత్ముని చూచినరాజు "మహనీయా! మీకు నేను ఏమిసేవ చేయగలను" అన్నాడు.*

*జవాబుగా మహాత్ముడు "నా అంతిమ సమయం వచ్చినది! పరలోకానికి చేరిన తరువాత వైభవంగా జీవించాలని ఉంది. దీనికొరకై నాకు కొంత ధనాన్ని ఇవ్వండి" అన్నాడు రాజు. మహాత్ముని కోర్కెను విన్న రాజు "మహాత్మా! మీకు ఈ మాత్రం కూడా తెలియదా? పరలోకానికి ఇచ్చటి నుండి ఏమీ తీసికొని వెళ్ళుటకు సాధ్యం కాదు గదా?" మహాత్మా అన్నాడు. రాజు మాటలు విన్న మహాత్ముడు చిరునవ్వుతో ఇలా అన్నాడు – "రాజా నీవు నిజం చెప్పావు ఎవ్వరైనా పరలోకానికి వట్టి చేతుల్తో వెళ్ళవలసిందే! అటువంటి వేళ మీరు వ్యర్థమైన ధనాన్ని కూడబెట్టుచున్నారెందులకు? మీరు ప్రజాపాలకులు – ప్రజలు ఆకలితో మరణించుచున్నారు – ఇట్టిస్థితిలో మీ ధనం ప్రజలకై వినియోగించనిచో, అట్టి ధనంవలన లాభమేమి?" సాధువు మాటలను విన్న రాజుకు జ్ఞానోదయమై, మహాత్ముని క్షమాపణ కోరి, తన ఖజానాలోనున్న ధనాన్ని సంపదలను ప్రజల సంక్షేమానికై నాటి నుండి ఖర్చుచేయసాగాడు.*

హిందీమూలం: *అఖండజ్యోతి, మార్చి 2016*

తెనుగుసేత: *ఎ. వేణుగోపాలరెడ్డి*

---

**ఉన్నత లక్ష్యాల సాధనకై తాత్కాలిక ఆనందాలను త్యాగం చేయాలి**

# భారతీయ సమాజం (హిందూసమాజం) ప్రవర్తనపై స్వామి వివేకానందుని విశ్లేషణ-1

## సంఘటితంగా పనిచేయుటలోగల గొప్పతనం: చరిత్ర మనకు ఏమి తెలుపుతున్నది?

గత కొన్ని శతాబ్దాల నుండి మన దేశచరిత్రను అవలోకించినచో ఒక గొప్ప చారిత్రాత్మక ఘట్టం జరిగిన ప్రతిసారి దానివెనుక ఒక గొప్పవ్యక్తి ఉన్నట్లు తెలుస్తుంది. దీనిని ఒక్కసారి పరిశీలించండి. ఒక గొప్ప ఆత్మ ముందుకు వచ్చి ఒక చక్కని సూచన, సలహా అందజేస్తుంది. ఒక వ్యవస్థను దర్శిస్తుంది. ఒక ఉద్యమాన్ని చేపట్టి చివరకు, ఒక మంచిని సాధిస్తుంది. ఆ వ్యక్తి బ్రతికి ఉన్నంతవరకు ఆ వ్యవస్థ చక్కగా తన పనిని నిర్వర్తిస్తూ సమాజానికి లాభాలను చేకూరుస్తూ ఉంటుంది. తదుపరి ఆ వ్యక్తి పరమపదించగనే నెమ్మది నెమ్మదిగా ఆ వ్యవస్థ కూడా కనుమరుగవుతుంది. ఇది నిజమయ్యింది మనదేశ చరిత్రలో అనేకమార్లు. అది రాజకీయ రంగం కావచ్చు, మతానికి చెందింది కావచ్చు, సామాజిక పరమైనది కావచ్చు. ఛత్రపతి శివాజీ, గురుగోవిందసింగ్, రాణాప్రతాప్, రామదాస్, మహర్షి దయానంద్, నిన్నమొన్నటి సత్యసాయి మరియు శివానందల ఉద్యమాలను పరిశీలిస్తే ఇదే గోచరమవుతుంది.

మనదేశంలో ఎల్లప్పుడు ఒక గొప్ప వ్యక్తి జన్మించుటకై వేచిచూచుట ఆనవాయితీగా ఉంది అన్నారు శ్రీ వివేకానందుడు. గొప్ప వ్యక్తి జన్మించి మన మధ్య లేనిదే మనము ముందుకు వెళ్ళలేనిది మన అలవాటుగా మారింది. ప్రతి గొప్ప వ్యక్తి జననంతోపాటు ఆయనను ఆరాధించెడి తత్వాన్ని మనం అలవాటు చేసికొన్నాం. ఆయనతోపాటు మనము ఎదుగుతూ ఉంటాం. ఇలా కొంతకాలం జరిగి తదుపరి గతి ఆగిపోతుంది. శివాజీ చరిత్రనే తీసికొందాం. ఆయన అన్నింటిలో గొప్పవాడే నిస్సందేహంగా చరిత్రను సృష్టించాడు. అతని ఆలోచనలు, ఆదర్శాలు ఆయన తదుపరి కొంతకాలం వరకే కొనసాగాయి. తదుపరి బాజీరావు పీష్వా, తరువాత మరో ముగ్గురి పీష్వాలతో ఆ పాలన అంతరించిపోయింది. స్వామి దయానంద సరస్వతి జీవించి ఉన్నంతకాలం ఆయన ఉద్యమం చక్కగా సాగింది. ఆర్య సమాజం పేరు దేశంలో మార్మోగింది. నేడు అది పేరుకు మాత్రమే మిగిలింది. దానిలో జవసత్వాలు నశించి నేడు అది ఒక జీవచ్ఛవంలా మిగిలిపోయింది.

అట్లే గురునానక్ మరియు గురుగోవిందసింగ్‌లది ఇదే పరిస్థితి. ఈ రీతిగా గొప్ప గొప్పవారు వచ్చారు. చెరిగిపోని ముద్రను వేశారు. కాని వారి తరువాత దీనిని కొనసాగించేవారు దేశంలో కరువయ్యారు. ఇతర జాతులను, దేశాలను పరిశీలిస్తే, దీనికి పూర్తి భిన్నంగా ఏ గొప్పవారి ఆగమనం కోసం అవి ఎదురుచూడవు. సామాన్యమానవులంతా కలిసి అసామాన్య రీతిలో అసామాన్యపనులను చేశారు. ఉదాహరణకు ఈస్ట్ ఇండియా కంపెనీని తీసుకుందాం. వారు వ్యాపార నిమిత్తమై భారతదేశానికి వచ్చారు. వారిలో వివేకానందుడు, దయానందుడు, శంకరాచార్యుల అంత గొప్ప పేరున్నవారు ఎవరులేరు. వారికి తెలిసిందల్లా సంపాదించుట, అనుభవించుట, ఆనందించుట మాత్రమే. వారు అనూహ్యంగా చేయిచేయి కలిపి ఒక గొప్ప సామ్రాజ్యాన్ని నిర్మించారు. అలాగే విదేశాలలో కూడా గొప్పవారు జన్మించారు. వారు ప్రారంభించి వెళ్ళిన దానిని వారి అనుచరులు అదే ఉత్సాహంతో, శ్రద్ధాసక్తులతో, సమర్పణతో కొనసాగిస్తూ మరింత ముందుకు తీసికొని వెళతారు. మనలా మరలా మరో గొప్పవ్యక్తి రావాలని ఎదురు చూడటం లేదు. వారు బాధ్యతలను భుజాన వేసికొంటారు. వారి శక్తిసామర్థ్యాలను బేరీజు వేసికొని ప్రవర్తిస్తారు, పనిచేస్తారు. మనమంతా సామాన్యులం, పరిమితశక్తితో కూడినవారం. మనమంతా కలిస్తే అసామాన్యమైన పనులు చేయగలం అనే భావనతో ముందడుగు వేస్తారు.

ఈ విధంగా సంఘటితంగా పనిచేసెడి తత్వం మొదట మన దేశం నుండే విదేశాలకు ప్రాకింది. నేడు యోగవిద్యను చూడండి. మనవద్ద నేర్చుకొని విదేశాలకు వెళ్ళి తిరిగి అతిథి ప్రొఫెసర్లుగా మనవద్దకు వస్తున్నారు. **ఈ దుస్థితికి కారణం మనలో పనిపట్ల శ్రద్ధ లోపించుటే!** విదేశీయులు నేడు మనదేశంలోని ఆశ్రమాలకు వస్తున్నారు, నేర్చుకుంటున్నారు. మన గ్రంథాలు తీసికొనిపోయి లోతుగా చదివి వాటి అర్థాలను, అంతరార్థాలను సంపూర్ణంగా ఆకళింపు చేసికొని, తిరిగి మనకే బోధిస్తున్నారు. ఇది చాలా దురదృష్టకరం. వ్యవస్థలు నిర్మించుట, పాలించుట, సంఘటితంగా పనిచేయించుట మన వారసత్వం.

**అపార్థం చేసుకొనే దానిలో పదోవంతును అర్థం చేసుకోవడానికై యత్నిస్తే ఎన్నో సమస్యలు తీరతాయి**

అవి మనరక్తంలోనే ఉన్నాయి. విదేశీయుల పాలనలో ఇవి కనుగమరుగయ్యాయి.

కులవ్యవస్థను తీసికోండి. ప్రజలలో వివిధ ఆదర్శాలు నైపుణ్యాలు, శక్తిసామర్థ్యాలు ఉన్నాయి. వీనిని స్వార్థానికి మరియు ఇతరులకు నష్టాన్ని కలుగజేసేలా వినియోగించు తున్నాం. హిందూసమాజం అలనాడు ఒక గొప్పవ్యవస్థకు ప్రతీకగా నిలిచింది. ఈనాడున్న రవాణాసౌకర్యాలు పూర్వం లేవు, అయినా ఉత్తరభారతంలోని బ్రాహ్మణుడు, దక్షిణ భారతంలోని బ్రాహ్మణుడు ఒకేలా ప్రవర్తించారు. ఇది ఎలా సాధ్యమైంది అని ప్రశ్నించుకుంటే అది కేవలం – ఆనాటివారికి గల ప్రతిభ, పరిపాలన దక్షతలే, దీనికి కారణమని తేలుతుంది. కాని దీనిని మనం మరచిపోవుట జరిగింది. అందువలననే నేటి ఈ దుస్థితి, మనకు సంప్రాప్తించింది.

మన వారసత్వ విలువల గురించి మనకన్నా విదేశేయులకు బాగా తెలుసు. ఛత్రపతి శివాజీ సమకాలీనులలో ఎవరైన ఆయనను గురించి సంస్కృతంలో వ్రాసిన గ్రంథమేదైన ఉన్నదా అంటే లేదు అని సమాధానం వచ్చింది. నిజంగా ఎవరైనా వ్రాసి ఉన్నట్లయితే అది ఒక గొప్ప గ్రంథంగా వెలుగొంది ఉండేది, పాలకులకు మార్గదర్శినిగా నిలిచి ఉండేది. ఇట్టి పుస్తకం కొరకై జర్మనీవారు వెతుకుతుండగా తంజావూరు గ్రంథాలయంలో అట్టి గ్రంథము ఉన్నట్లు తెలిసికొన్నారు. మన పూర్వీకులు రచించిన విలువైన గ్రంథాల చేతిప్రతులు జర్మనీలో ఉన్నాయి. వానిని వారు భద్రంగా దాచి వానిలోని విషయాలపై పరిశోధనలుచేసి, తిరిగి ఆ పరిశోధనా ఫలితాలను మనకే అమ్ముట అత్యంత విచారకరమైన విషయం. వారు వారి జీవితాలను ధారపోసి ఆ గ్రంథాలలోనున్న సత్యాలను వెలికితీయుచున్నారు. ఇవన్నీ అమెరికా, జర్మనీల ద్వారా మనకు చేరుట వానిని మనము స్వీకరించుట, చదువు కొనుట మిగుల శోచనీయం.

ఇలా చరిత్రను పరిశీలించిన మనకు తెలియుచున్నది ఏమనగా మనవద్దనూ సంఘటిత శక్తి ఉంది. అపారజ్ఞాన సంపదలు ఉన్నాయి. పాలనా దక్షతలున్నాయి వ్యాపారదక్షత కలిగి ఉన్నాం. ఒక గొప్పమనిషి రాకకై నిరీక్షించి ఈ జాతిని నడిపించ వలసిన అగత్యమూ లేదు. కాని ఇవన్నీ నేడు మనలో లోపించాయి. ఇదివాస్తవము. మనదేశంలో ఉద్యమాలు "ఆలోచనల" ఆధారంగా ప్రారంభం కావు, అవి "వ్యక్తి గొప్ప ననుసరించి" ప్రారంభించబడతాయి. దీనిని మనం మార్చాలి. **"మనమంతా సామాన్యులం, ఒకేస్థాయివారం, మనమంతా ఒక సంఘటిత శక్తిగా తయారై ఒక అసామాన్యమైన దానిని ఈ ప్రపంచంలో ఆవిష్కరించాలి". ఈ రీతిగా అది మనలో రూపుదాల్చి వెలికి రావాలి. జారుడు భూమిపై ఒకరిచెయ్యి ఒకరు పట్టుకుని, సంఘటితంగా ముందుకు సాగిపోదాం. మనం నేడు స్వార్థంలో మునిగిపోయాం. సమాజం యొక్క మంచి, దాని ప్రగతి మనకు పట్టకున్నది. మనమంతా దీనిని అధిగమించుటకై పోరాడాలి. మన శక్తి పరిమితమై ఉంది కాని మనలోని స్వార్థం అపరిమితంగా ఉంది. దీనిని తొలగించు కోవాలి.** వెలుగుతో సద్జ్ఞానంతో నిండిన స్వార్థచింతన ఉండాలి. మన దేశంలో పట్టుమని పది సంవత్సరాలపాటు పరస్పర సహకారంతో, భాగస్వామ్య కంపెనీలు నడవజాలకున్నాయి. అదే విదేశాలలో కొన్ని వందల సంవత్సరాల నుండి అవి అవిచ్ఛిన్నంగా నడుస్తున్నాయి.

ఎవ్వరైనా పేరు ప్రఖ్యాతులనార్జిస్తూ ఎదుగుతూ ఉంటే మనలో ఒక ఆలోచన బయలుదేరుతుంది? "అతనే ఎందుకు పేరు తెచ్చుకోవాలి? నేను ఎందుకు తెచ్చుకోకూడదు? అనెడిది మన దేశంలో రాజకీయ పార్టీలలో, సంస్థలలో వేళ్ళూనుకొని ఉంది.

దేశంలో గొప్పవారు పుట్టి ఎదిగినా, లేకున్నా, దేశానికి ప్రజలే ఆధారం మరియు పట్టుకొమ్మలు. ఒక వ్యక్తి కాదు. దీనికై సామూహిక సంఘశక్తి వేళ్ళూనుకోవాలి.

హిందువులకు మొదటి శత్రువు వారిలోగల ఈర్ష్య, వారి మధ్యగల వ్యతిరేకత, జడత్వం. ఇదే పార్టీలకు, సంస్థలకు వర్తిస్తుంది. కప్పల్ని తూయుట ఎంత కష్టమో, హిందువులను ఒకేత్రాటిపై నడిపించుట అంతటి కష్టము అని ఒకరు అన్నారంటే నిజమే కదా.

## హిందువులలో ఉన్న వాస్తవిక లోపాలు

మన గ్రంథాలు మన ఋషులు చెప్పెడివానిని మనం వింటాం, కాని వానిని మన నిజజీవితంలో ఆచరించుటకు సంసిద్ధంగా లేము. ఇదే ఈ జాతి ప్రగతికి పెద్ద అడ్డుగోడలా నిలిచింది. పునర్జన్మను మనం నమ్ముతాము. బట్టలు చిరిగి పోయి జీర్ణదశకు చేరినప్పుడు ఏ రీతిగా వానిని విడిచి నూతన

**న్యాయం గెలుస్తుందన్నది నిజం కాని గెలిచిందంతా న్యాయం కాదు సుమా!**

వస్త్రాలను ధరిస్తామో, అదే రీతిలో శరీరం జీర్ణమై శిథిలావస్థకు చేరినచో దానిని విడచి నూతన శరీరంలోనికి ఆత్మ ప్రవేశిస్తుంది అన్నది విన్నాం, చదివాం. కాని దీనిపై నిజంగా మనకు సంపూర్ణ విశ్వాసమున్నచో చావుకు వెరవం. ధైర్యంగా ముందుకు సాగుతాం. సాహసవంతులుగా జీవిస్తాం. ఆశ్చర్యాన్ని గొల్పెడిది ఏమనగా, పునర్జన్మపై విశ్వాసంలేని క్రైస్తవులు, ముస్లింలు జీవితం పరిసమాప్తం అగుట ఖాయమని ఎంచి జీవితంలో ఆనందాన్ని, సంపదలను అనుభవిస్తారు, సాహసకృత్యాలు చేస్తారు. భయమంటే తెలియదు, చావుకు వెరువరు. మరి మనము??

హిందువులమైన మనకు ఏదైనా ఒక సమస్య ఎదురైనచో, వెంటనే అతనికి/ఆమెకు తన ఇల్లు, బంధువులు, తల్లిదండ్రులు గుర్తుకు వస్తారు. అతడు/ఆమెకు ఒక భయంతో స్థిరనిర్ణయాన్ని గైకొనజాలరు. **అస్థిరమైన ఈ శరీరాన్ని గురించి నిరంతరం ఆలోచిస్తూ ఉంటాం. శరీరం లేకున్నా మనం ఉన్నాం, ఉంటాం.** ఈ జీవితం క్షణికమైనది. దీనిని గురించి యక్షధర్మరాజుల సంవాదంలో ఈ ప్రస్తావన వస్తుంది. **అన్నింటికన్నా విచిత్ర మైనది మనిషి చనిపోతాడని తెలిసికూడా, చిరకాలం జీవిస్తా ననెడి నమ్మకంతో పనులు చేస్తూ ఉంటాడు.** మంచి గాని, చెడు గాని తాను జీవించి ఉండగా చేసిన పనులకు తాను చనిపోయిన పిదప లెక్క చెప్పాలి అనెడి ధ్యాసను కూడా కలిగి ఉండకపోవుట ఆశ్చర్యము. ఇన్ని విన్న తరువాత కూడా ఈ ప్రపంచంలోని అల్పమైన వానిపై మక్కువ పెంచుకొని జీవించేది కూడా ఒక్క హిందూ జాతిమాత్రమే అంటారు వివేకానందులు.

మనం ఎప్పుడూ పశ్చిమదేశాలను తిడుతూ ఉంటాం, గేలిచేస్తూ ఈసడించుకుంటాం. కాని అచ్చట ఫాదరీలుగా – సన్యాసినులుగా కుటుంబాల వీడి క్రైస్తవమతప్రచారకులుగా చేరినవారిని వారి కుటుంబాలు ప్రేమిస్తాయి, ఆదరిస్తాయి, గౌరవిస్తూ, ఉన్నతంగా చూస్తాయి. దీనికంటే **ఉన్నతంగా ఆధ్యాత్మికతను, బ్రహ్మచర్యాన్ని, సన్యాస ఆశ్రమాన్ని పొగడుతూ మాట్లాడే హిందువులమైన మనం సమాజసేవకు, మత ప్రచారానికి చాలా దూరంగా ఉంటాం. కొన్ని సమయాలలో ఈసడించుకుంటాం! అందుకే మనదేశంలో 5,200 మంది క్రైస్తవమత ప్రచారకులుగా వచ్చి నిలబడగలిగారు దీనికి కారణం, బాల్యం నుండి మనం మన ధర్మసంస్కారాలకు నమ్మిన సిద్ధాంతాలకు దూరంగా ఉన్నాం. అందువలననే ఎదిగిన తరువాత వానిని ఆచరించలేకపోతున్నాం, పిరికితనం, స్వార్థం భయం మనలో తిష్టవేశాయి.**

## వివేకానందుని వ్యక్తిత్వం

వివేకానందుడు దేనిని త్వరగా నమ్మేవాడు కాదు. రామకృష్ణ పరమహంస మాటలను కూడా నమ్మలేదు. కాని రామకృష్ణునిపై తెలియని ప్రేమ ఆయనకు ఉండేది. అప్పుడప్పుడు వెళ్ళి రామకృష్ణులవారిని ప్రశ్నిస్తూ, ఆయన మాటలను వింటూ ఎగతాళి చేస్తూ ఉండేవాడు. ఒకరోజు రామకృష్ణుని వద్దకు ఆయన శిష్యులు వచ్చి మాట్లాడుతున్నారు. వివేకానందుడు కూడా వచ్చి వారితో మాటలు కలిపి ఇలా అన్నాడు. ఈ ముసలాయన అర్థం పర్థం లేని మాటలు మాట్లాడుతున్నాడు. ఆయన మాటలు వినాలంటే నాకు విసుగ్గా ఉంది. నేను ఇచ్చటకూర్చోను" అన్నాడు వివేకానందుడు. దీనిని రామకృష్ణుడు విన్నాడు. అందరూ వెళ్ళిపోయిన తరువాత రామకృష్ణుడు బయటకు వచ్చి "నేను మాట్లాడేదంతా పనికిరానిది అర్థము లేనిది. నావన్నీ పిచ్చివాని మాటలు. నీవు నమ్మవు" అంటూ వివేకానందుని తాకాడు. **వెంటనే వివేకానందునిలో ఎన్నో భయానక విస్ఫోటనలు సంభవించిన అనుభూతి కలిగి భయభ్రాంతుడైనాడు. మైనంతో తయారైన భవనం ఏ రీతిగా కరిగి ఒక లావాలా ప్రవహిస్తుందో వివేకానందుని శరీరం, మనస్సు, ఆ అనుభూతికి లోనయ్యాయి. విపరీత భయానికిలోనై "ఏమి చేస్తున్నారు? నాకు నా తల్లిదండ్రుల ఇల్లు ఉంది?" అన్నాడు.**

రామకృష్ణుడు తరువాత వివేకానందుడిని మామూలు స్థితికి తెచ్చాడు. అప్పటివరకు నేను బ్రహ్మమును, మిగిలినదంతా నమ్మకమే అన్నవాడు ఒక్కసారిగా రామకృష్ణుడు చాలా శక్తిశాలి, చేతనత్వాన్ని పొందిన ఆత్మ" అని వివేకానందుడు అన్నాడు. ఆయన చెప్పేది నిజం కావచ్చు, ఊహ కావచ్చు, అబద్ధం కావచ్చు, కాని నమ్మినందువల్ల నష్టమేమున్నది" అన్నాడు వివేకానందుడు.

*(మిగతాది వచ్చే సంచికలో...)*

*ఆంగ్ల మూలం: ఏకనాథ్ రనడే*
*"Story of Vivekananda Rock Memorial"*
*తెనుగు సంకలనం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**మంచికి ఉన్న స్వేచ్ఛ చెడుకు లేదు. చెడుకు ఉన్న ఆకర్షణ మంచికి లేదు**

# ఆరోగ్యము మందులపైన కాక మనలోనున్న జీవనీశక్తి మీద ఆధారపడి ఉంటుంది

వైద్యరంగములో గడచిన మూడు దశాబ్దములలో ఇంతకు ముందెన్నడూ జరగనన్ని పరిశోధనలు జరిగాయి. ఒకప్పుడు రాజయక్ష్మ అని పిలువబడే క్షయరోగమునకు చికిత్స చెయ్యడము అసాధ్యమని తేల్చివేశారు. దాని నివారణకోసము అనేకమైన ఔషధములు వాడబడినాయి. ఎట్టకేలకు టి.బి క్రిములను నశింపజేయగల్గిన రిఫామ్పిసిన్ అనే మందు కనుగొనబడినది. క్రమముగా ఈ మందు వాడకములోకి వచ్చి అద్భుతమైన ఫలితములనిచ్చింది. ప్రస్తుతము ప్రజలకు టి.బి.గురించిన భయము పూర్తిగాపోయింది. సూక్ష్మక్రిముల సిద్ధాంతమును ప్రతిపాదించిన తదుపరి వైద్యరంగములో పెద్ద ఆవిష్కారము జరిగిందనే చెప్పుకోవాలి. ఇన్‌ఫెక్షన్‌ను తగ్గించే యాంటీ బయాటిక్ మందుల యొక్క శక్తికన్నా సూక్ష్మక్రిముల శక్తి మరింతగా పెరిగిపోసాగింది. అందుచేత మరింత శక్తివంతమైన ఔషధములను కొనుగొనవల్సివచ్చింది. కానీ ఈనాడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

సూక్ష్మక్రిములను నశింపజేసే మందుల యొక్క దుష్పరిణామములను, శరీరములోని సమస్త జీవ రసాయనిక నిర్మాణము, క్రియాకలాపముల మీద వీటి ప్రతికూల ప్రభావములను గురించి ఇప్పుడు ప్రజలందరికీ కొంత అవగాహన ఏర్పడింది. మానవుని జీవనీశక్తి యొక్క అభివృద్ధికి తోడ్పడగలిగేదేదైనా ఉన్నదా అన్న అంశము మీద ఇప్పుడు పరిశోధన జరగాలి. 'జీవనీశక్తి యొక్క అధిష్ఠాత్రి'రూపములో భగవంతుడు మన శరీరములో ఒక సాటిలేని వ్యవస్థను ఏర్పాటు చేసుంచాడు. దాని పేరు 'ఇమ్యూన్ సిస్టమ్.' ఎప్పుడైనా భౌతికముగా ఆక్రమణ జరిగినప్పుడు ఈ వ్యవస్థలో యాంటీ బాడీస్ ఉత్పన్నమౌతాయి. సురక్షాసేనా రూపములో ఇవి వెలుపలి నుండి దాడిచేసిన సూక్ష్మక్రిములతో పోరాడి వాటిని ఓడించి వేస్తాయి. ఛాతి భాగములో థైమస్ అనే గ్రంథి ఉంటుంది. పుట్టిన తరువాత ప్రారంభస్థితిలో శరీరములో జీవనీ శక్తిని ఏర్పరచి ఉంచటానికి అవసరమైన తత్త్వము లేవైతే ఉంటాయో వాటిని ఈ గ్రంథి టీ సెల్స్ ద్వారా ఉత్పన్నము చేస్తుంది. తర్వాత కాలములో రక్తం-మజ్జలో ఉండే ప్రత్యేకమైన కణములు బి సెల్స్ యాంటీబాడీస్‌ను తయారుచేస్తాయి. సెల్ మీడియేటెడ్ ఇమ్యూనిటీ అంటే రాబోయే ఆపదలను ఎదుర్కొనటానికి కావల్సిన జీవనీశక్తికి ఆధారాన్నేర్పరిచి ఉంచడము వీని బాధ్యత. ఈ ప్రతిపాదనల నాధారముగా చేసుకొని అన్ని రకములైన వాక్సీన్లు తయారుచేయబడ్డాయి. ఈ వాక్సీన్లు యాంటీబాడీస్‌ను తయారుచేసే ప్రక్రియను నిరంతరము ఉత్తేజపరుస్తుంటాయి. ఈ ఇమ్యూన్‌సిస్టమ్ శక్తివంతముగా ఉన్నంత కాలము శరీరము ఆరోగ్యముగా ఉంటుంది. ఇది బలహీనపడినప్పుడు ఆక్రమణకారులకు స్థానము దొరుకుతుంది. బ్లడ్ క్యాన్సర్ రోగి-రోగం వలన మరణించడు. అతడిలోని జీవనీశక్తి బలహీనపడటము వల్ల లోపల ప్రవేశించిన సూక్ష్మక్రిముల సామర్థ్యము అధికమై అతడు మృత్యువాతపడతాడు.

ఐతే ఇందుకు వ్యతిరేకముగా మనకు మేలుచేసే కొన్ని రకములైన సూక్ష్మక్రిములు మన శరీరములో నిరంతరము ఉంటూ మనతోపాటే జీవిస్తూ 'సహచరుల' పాత్రను నిర్వహిస్తుంటాయి. 'బాక్టీరియల్‌ఫ్లోరా' అనే సూక్ష్మక్రిములు నోటినుండి మొదలుకొని చిన్నప్రేవుల చివరివరకూ కోటాను కోట్ల సంఖ్యలో ఉంటాయి. కొన్నిరకముల సూక్ష్మక్రిములు విటమిన్ బి-12 ను తయారుచేస్తాయి.

విజాతీయపదార్థములతో నిండిన శరీరము సూక్ష్మక్రిములకు నివాసస్థానమౌతుంది. జీవనీశక్తిని నశింపజేసే విజాతీయపదార్థములతో నిండిన శరీరము స్వయంపుష్టి కలిగిన 'దేహమును' ఈ సూక్ష్మక్రిములనే శత్రువులు ఏమీచెయ్యలేవు. **'జీవించటానికి మందుల మీద ఆధారపడటము మంచిది కాదు' అన్న సత్యమును బాగా అర్థము చేసుకోవాలి. ఆలోచనలు, భావనలు, నమ్మకాల ద్వారా నిర్మించుకున్న వ్యక్తిత్వము మీదనే ఆరోగ్యము ఆధారపడివుంటుంది. సాత్వికాహారము, నియమిత దినచర్య, సకారాత్మకతతో కూడిన స్వాధ్యాయము మొదలగు వాటిని అమలుచేస్తూ ఆరోగ్యమును వృద్ధిచేసుకొనటము సాధ్యమే.** పుష్టికరమైన ఆహారము, తేలికగా చెయ్యగలిగే వ్యాయామము, ఉదయముననే నడవటమూ మొదలైన పనుల వల్ల శరీర దారుఢ్యము వృద్ధిచెంది జీవనీశక్తి పెరుగుతుంది.

**ఇవ్వగలిగిన దానికి మించి ఇచ్చుట ఔదార్యం**

మనస్సు ఆరోగ్యముగా ఉండి మంచి ఆలోచనలలో నిమగ్నమై, సృజనాత్మక లక్ష్యమును ముందుంచుకొని పనిచేస్తుంటే జీవనీ శక్తి వృద్ధిచెందుతుంది. సంపూర్ణమైన ఆరోగ్యమును పొంద టానికి ఈ మూలభూతమైన ఆధారములను హృదయంగమము చేసుకోవాలి. **జీవాణువాదసిద్ధాంతములను (సూక్ష్మక్రిముల ద్వారా మన శరీరములో ఇన్‌ఫెక్షన్ కలగడము) అంగీకరించి వాటినుండి రక్షించుకొనటానికి భయంకరమైన యాంటి బయాటిక్ మందులను మ్రింగడము కన్నా శరీరములో స్వయంగా ఏర్పడియున్న ఇమ్యూన్‌సిస్టమ్‌ను శక్తివంతము గావించుకొని సూక్ష్మక్రిములతో పోరాడగలిగే యోగ్యతను పెంచుకోవటము మంచిది.**

'ఎంతో అవసరమైతే వాడాలి తప్ప మందుల వాడకమును తగ్గించడము మంచిది' అన్న విషయమును అర్థము చేసు కోవాలి. వ్యాధి ప్రారంభదశలోనే చిన్నచిన్న ఔషధీమొక్కలతోటి చిట్కావైద్యమును చేసుకొనడము శ్రేయస్కరము. ఎక్కువ భాగము జబ్బులు ఆహారవిహారముల పట్ల నియంత్రణ లేకపోవడము వల్లనే వస్తుంటాయి. కాబట్టి వాటిని క్రమబద్ధీకరించుకుంటే శరీరము దానంతటదే స్వస్థతను పొందుతుంది.

'వ్యాధి వచ్చినప్పుడు శరీరములో సూక్ష్మక్రిముల ఉనికి కచ్చితముగా ఉంటుంది' అనేది వాస్తవమే. ఐతే అవి ఎక్కడో బయటనుండి వచ్చి మన శరీరములో ప్రవేశించుటలేదు. ఇంకా చెప్పాలంటే వాటి కారణముగా మనకు వ్యాధులు రావటము లేదు. **శరీరములో మలినములు అధికమైనప్పుడు, మృతికి లేదా కాలుష్యము అధికమౌతుంది. ఫలితముగా రోగములు కలుగుతాయి. రోగముతోపాటే సూక్ష్మక్రిములు ఉత్పన్నమౌతాయి. ఫ్రెజర్ అనే కెనడాదేశపు వైద్యుడు అనేక మార్లు పరిశోధనలు, పరీక్షలు జరిపిన పిదప 'శరీరములో వ్యాధి ఉత్పన్నమైన తరువాతనే సూక్ష్మక్రిములు కనపడతాయి' అని నిరూపించాడు. రోగము కారణమైతే సూక్ష్మక్రిములు దాని ఫలితము. కారణము కన్నా క్రియ ముందుగా జరగడ మనేది అసంభవము.**

### విజాతీయపదార్థముల ఉత్పత్తి-వృద్ధి

శరీరములోని మలినములే రోగములకు ముఖ్య కారణముగా భావించబడుతున్నది. ప్రకృతి నియమములకు వ్యతిరేకముగా ప్రవర్తించి, ఆహార-విహారమును కలుషితము చేసుకొని, జిహ్వను-భోగేంద్రియములను తృప్తిపరచటానికి అవసరముకన్నా అధికముగా భోగపదార్థములను ఉపయోగిం చినట్లయితే మన శారీరక అవయవములపైన ఎక్కువ భారం పడుతుంది. ఫలితముగా అవి తమ పనిని సరైనరీతిలో నిర్వహించలేకపోతాయి. వీటిలో ముఖ్యమైనది జీర్ణాశయము. **ఈ జీర్ణాశయము మనము తీసుకున్న అన్నిరకములైన ఆహారపదార్థములను జీర్ణం చేసి, ఆ రసముతో దేహమునకు పుష్టిని చేకూరుస్తుంది. ఐతే దానికి పని భారం అధికమైతే మనము స్వీకరించిన భోజనములోని రసమును సంపూర్ణముగా వెలికి తియ్యలేదు. అప్పుడు సగము జీర్ణమైన ఆహారమే మలాశయములోనికి చేరుతుంది. అక్కడ అది చాలా త్వరగా కుళ్ళిపోతుంది. అందులోనుండి దుర్వాసనతో కూడిన రసం వెలువడి రక్తములో కల్సిపోతుంది. ఈ కలుషిత రక్తమే వ్యాధులకు మూలకారణము. ఎందుకంటే ఈ కలుషిత రక్తము రక్తనాళముల ద్వారా ప్రవహించి శరీరమంతటికీ చేరుకొని ఆ మలినములను అక్కడక్కడా వదిలిపెట్టడం ద్వారా శరీరములో అనారోగ్యమును ఉత్పన్నం చేస్తుంది.**

ప్రతిదినమూ మనం తిన్న ఆహారము పూర్తిగా జీర్ణమై మలినములు పూర్తిగా వెలువడతాయన్న నమ్మకము లేదు. జీర్ణమైన భోజన పదార్థముల నుండి మలినములు కొంత వెలువడతాయి. అలాగే చిన్నప్రేవులను బాగా శోధించి శోధించి బయటకు లాగబడే మలినములు కూడా అధిక పరిమాణము లోనే ఉంటాయి. అందుచేతనే మనం ఉపవాసం చేసిన రోజున కూడా ఎంతో కొంత మలం వస్తుంటుంది.

ఈ విజాతీయపదార్థములు శరీరములో ఏవిధముగా వృద్ధిచెంది రాశీభూతమౌతూంటాయో; క్రమముగా ఆరోగ్యం పాడై ఆ మనిషిలా రోగిష్టిగా మారతాడో అన్న విషయమును జల చికిత్సకు చెందిన ఆచార్య లూయీకూనే తాను వ్రాసిన 'యామై వెల్ ఆర్ సిక్' అనే గ్రంథములో వివరించాడు.

అప్రాకృతిక భోజనము, జీర్ణము కాని ఆహారపదార్థములూ శరీరములో చాలాకాలం వరకూ బయటకు వెళ్ళే మార్గము కనపడక నిల్వవుండిపోతాయి. ప్రారంభములో ఇవి మలమూత్ర విసర్జకావయవముల వద్ద జమ అవుతాయి. వాటిపైన నిత్యమూ క్రొత్తగా వచ్చిపడే విజాతీయపదార్థములతో కలిసి వాని పరిమాణము అంతకంతకూ పెరిగిపోతూ, లోలోపలే మార్పులు జరుగుతూంటాయి. అవి కుళ్ళటము ప్రారంభమవు తుంది. ఈ కుళ్ళిన ద్రవము రక్తములో కలిసి నెమ్మదిగా

**గెలిచినచో జ్ఞాపకాలు మిగులుతాయి. ఓడినచో అనుభవాలు మిగులుతాయి**

మస్తిష్కము నుండీ పాదాల వరకూ పయనిస్తూంటుంది. శరీరము దీనిని బయటకు నెట్టివెయ్యటానికి ఎంతగా శ్రమించినా ఫలితము బాగా ఉండదు. ఈ ప్రయత్నములో శరీరములో చెమట అత్యధికముగా ఉత్పన్నమౌతుంది. ఇదే రోగ లక్షణము.

ఈవిధముగా శరీరములో మలినములు, విజాతీయ పదార్థములు వృద్ధిచెందేకొద్దీ వాటి దుష్ఫలితములు కొద్ది కాలములోనే బహిర్గతమౌతుంటాయి. మనం తిన్న భోజనము, ఇంకా పూర్తిగా అరగని దశలో చిన్నప్రేవులు, పెద్దప్రేవుల గుండా వెడుతూంటుంది. అది నియమితమైన మలరూపములో బయటకు వెళ్ళలేక మధ్యలోనే ఆగిపోయి, కుళ్ళటం ప్రారంభ మవుతుంది. అందులో కొంత భాగము వాయురూపములో పై అవయవములకు పాకుతుంది. మధ్యలో అడ్డంకులేమీ లేకుంటే మెదడుకు కూడా చేరుతుంది. ఫలితముగా తలనొప్పి, జ్వరం కూడా వస్తాయి.

ఈ మలినములు అధికమయ్యేకొద్దీ మనిషి శరీరములో చురుకుదనము తగ్గిపోతుంటుంది. సోమరితనము, బద్ధకమూ పెరుగుతుంటాయి. ఆ వ్యక్తి నిస్తేజముగా పడుండటానికే ఇష్టపడుతుంటాడు. తన పనులు తానే చేసుకోవటానికి కూడా ఇష్టపడడు. ముఖాకృతి చెడిపోవటమే కాక మెదడు కూడా మందకొడిగా తయారవుతుంది. కొంతమంది వ్యక్తులకు ముఖం ఉబ్బరించినట్లుగా ఉంటుంది.

ఈవిధముగా మనము మన తప్పుల వల్లనే శరీరములో విజాతీయపదార్థములను నిరంతరముగా వృద్ధిచేస్తూంటే ప్రకృతి వాటిని ఏదోవిధముగా బయటకు పంపే ప్రయత్నము చేస్తూంటుంది. మనము అంతటితో శాంతి వహించి ఊరు కోకుండా హానికారకమైన పలురకాల మందులను మ్రింగుతూ ప్రకృతి చేసే పనికి అడ్డుతగులుతూంటాము. అంటే గొడ్డలి తీసుకుని మన కాళ్ళను మనమే నఱుక్కుంటున్నా మన్నమాట. **ఈ ఆపదనుండి రక్షించుకోవాలని అనుకుంటే ప్రకృతి సహజమైన ఉపాయములతో ఈ విజాతీయపదార్థములను బయటకు పంపించివేసి శరీరమును ఎల్లప్పుడూ స్వచ్ఛముగా, నిర్మలముగా ఉంచుకునే ప్రయత్నము చెయ్యాలి. మంచి ఆరోగ్యమును పొందటానికి ఇదే నిజమైన మార్గము.**

– పూజ్యగురుదేవుల వాఙ్మయం *41* నుండి

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## సాధనకై మనస్సును రాగద్వేషాలకు దూరంగా ఉంచాలి

*ఆర్యసమాజానికి చెందిన విఖ్యాత సన్యాసి మహాత్మాఆనందస్వామి సరస్వతి ఆ రోజులలో లాహోర్ పట్టణంలోని దైనిక్ మిలాప్ పత్రికకు సంపాదకునిగా ఉండేవారు! వారు చిన్ననాడు అజ్ఞాతవాసం కొరకు వెళ్ళారు. కొన్ని దినాలవరకు సాధన చేసి తిరిగి వచ్చారు. ఒకసారి తపస్సుకై అడవికి వెళ్ళారు. ధ్యానం కొరకై ఆయన కూర్చొనగానే ఆయన ఆలోచనలలోనికి లాహోర్‌లోనున్న వ్యక్తి వచ్చేవాడు. అతడిని ఆనందస్వామి తన శత్రువుగా భావించేవాడు. ఆనందస్వామి హృదయంలో కూడా అతని పట్ల కాఠిన్యత కలిగి ఉన్నాడు. ఇలా కొన్నిరోజులు గడచిపోయాయి, ఆనందస్వామి హృదయంలో అంతరాత్మ ప్రతిధ్వని ఇలా వినిపించింది. "ఒక వైపు నీవు ఆత్మశాంతిని కోరుతున్నావు మరోవైపు నీ హృదయంలో కాఠిన్యత నిండి ఉంది! ద్వేషంతో నిండి ఉన్న హృదయంలో శాంతి నెలకొనుట అసంభవం.*

*అంతరాత్మ వాణిని విన్న స్వామి ధ్యానంనుండి లేచి వెనువెంటనే లాహోర్ చేరుకున్నాడు. చేరిన వెంటనే తనను శత్రువుగా భావించెడి వ్యక్తి ఇంటికి చేరుకొని, అతనితో బిగ్గరగా "శత్రువు భావనతో కూడిన నా మనస్సు సాధనలో లీనం కాజాలకున్నది! నన్ను క్షమించండి నా నుండి దొర్లిన తప్పులను నేను సరిదిద్దుకుంటాను" అన్నాడు. ఈ మాటలను విన్న ఆ వ్యక్తి కన్నులు చెమ్మగిల్లాయి. అశ్రువుల ధారగా వెలువడ్డాయి! అతని మనస్సులోగల ద్వేషము మరియు శత్రుత్వ భావం, అశ్రువులతోపాటు బయటకు వెళ్ళిపోయింది! దీనిని చూచిన ఆనందస్వామి మనస్సు నిర్మలమైంది! మరునాడు ఆనందస్వామి సాధనకు కూర్చోగానే సమాధిస్థితికి చేరుకున్నాడు. రాగద్వేషాలనుండి విముక్తుడగుట చిత్తానికి మంచిది.*

*హిందీమూలం: అఖండజ్యోతి, మార్చి 2016*


*తెనుగుసేత: ఎ. వేణుగోపాలరెడ్డి*

**గెలుస్తామో, ఓడుతామే తెలియని ప్రేమ కన్నీళ్ళను మిగుల్చుతుంది**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# ఆధ్యాత్మికతకు అసలైన గీటురాయి

పరమపూజ్య గురుదేవుల అమృతవాణి ఎన్నిసార్లు చదివినా, చదివిన ప్రతిసారీ క్రొత్త భావాలకు జన్మనిస్తూ ఉంటుంది. అటువంటి ఒక విశిష్ట ప్రవచనంలో పరమపూజ్య గురుదేవులు భగవంతుడికి దగ్గర కావటానికి "ఆదర్శములు-ఔన్నత్యములను" కలిగి ఉండటమే గీటురాయిగా చెప్తున్నారు. భగవంతునికి భావనలంటే ఎంతో ప్రీతి. భగవంతుడు భావనాప్రియుడు కాబట్టి మన భావనలు ఎంత ఉదారపూరితంగా ఉంటే మనం భగవంతునికి అంతగా సన్నిహితులం కాగలం. వృద్ధుడైన జటాయువూ, అతిచిన్న ప్రాణియైన ఉడుత ఈ గుణముల ఆధారంగానే భగవంతునికి (ఆత్మీయులు) దగ్గర కాగలిగాయి. "మన అంతరంగంలో సాహసం, వివేకము జాగృతమైననాడే మనలో నిజమైన ఆధ్యాత్మికత ఉదయించగలదు" - అని యుగ ఋషి ప్రవచిస్తున్నారు. సూక్ష్మశరీరంలో సాహసము, వివేకములు అదే కారణశరీరంలో ప్రేమ, సేవలుగా రూపాంతరం చెంది వ్యక్తమౌతాయి. ఈ లక్షణాలన్నీ మానవునిలో ఉదయించిన నాడు మనిషి జీవితం ఆధ్యాత్మికతకు నిజమైన నిర్వచనంగా మారుతుంది. రండి, వారి అమృతవాణిని మరింతగా హృదయంగమం చేసుకుందాం!! స్థూలశరీరాన్ని ఆరోగ్యంగా, రోగరహితంగా ఉంచుకొనటానికి ఆహారవిహారము పట్ల నియమాలను పాటిస్తూ, యోగము - వ్యాయమము మొదలగు వానిని ఆచరిస్తూ! వానితో పాటే కర్తవ్య పరాయణత, క్రియాశీలతలతో కూడిన సత్కర్మలను ఆచరించటం అవసరమని మీకు ఇంతకు ముందే చెప్పియున్నాము. మానవుడిని రెండవశరీరమైన సూక్ష్మశరీరము భావనలు, ఆలోచనలకు సంబంధించి ఉంటుంది, సంస్కరించబడిన భావనలే మానవుని మహామానవునిగా, నరుని నారాయణునిగా తయారు చేయగలవు. ఒక మనిషి ఆదర్శములను, ఔన్నత్యమును ఎంత మేరకు జీవితంలో అమలు చెయ్యగలుగుతాడో ఆ మేరకు అతడు భాగవంతుడు కాగలడు. ఇది ఒక్కటే ఆధ్యాత్మికతకు గీటురాయి.



## జటాయువు యొక్క బలిదానమునుండే ప్రేరణను పొందండి

ఆదర్శమనే గీటురాయి మీద పరీక్షించబడుతూ, ముందుకు సాగి పోయిన శ్రీరాముడు తాను భగవంతుడనని నిరూపించుకున్నాడు. మనలను ఉద్ధరించి ముక్తిని ప్రసాదించే రామాయణంలో ఉత్కృష్టమైన భావనలు, ఆదర్శపూరితమైన జీవన విధానము, మంచిశీలము, ధైర్యము, ప్రేమ, సమర్పణ మొదలైన భావములన్నీ ఓతప్రోతమైయున్నాయి. జటాయువు యొక్క ఆదర్శపూరిత జీవనాన్ని చూసి మనం నేర్చుకొనవలసినది ఎంతో ఉన్నది. సీతను రావణుడు అపహరించి తీసుకు వెళ్ళడం చూసిన జటాయువు" నేను ముసలివాడనైనాను. ఈ ప్రపంచం ఎట్లా పోతే నాకేమి? నేను నా మనుమలు, మనమరాండ్రతో సుఖంగా కాలం గడిపితే చాలు" అనుకోలేదు. జటాయువులోని వర్చస్ జాగృతమైంది "ముసలి వాడినైతే నేమి? అన్యాయానికి ఎదురొడ్డి రావణునితో పోరాడలేనా?" అనుకున్నాడు. వెంటనే చెట్టుకొమ్మను వదలి బయటకు వచ్చి రావణునితో తలపడ్డాడు.

పిచ్చివాడా! నీదగ్గర బాణం లేదు, కత్తి లేదు, నాతో నీవేమి యుద్ధం చేయగలవు?" అన్నాడు రావణుడు. అందుకు సమాధానంగా "నిన్ను దీటుగా ఎదుర్కొనలేకపోవచ్చు. నిన్ను చంపలేకపోవచ్చు. జయించడం సాధ్యం కాకపోవచ్చు. కానీ ఓడిపోయి మరణించడం కూడా విలువైనదే! " అన్నాడు జటాయువు. గెలుపు లభించకపోయినా పోరాడి మరణించిన వారి చరిత్రలెన్నో ఈ ప్రపంచంలో ఉన్నాయి భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామపోరాటంలో గెలుపు లభించక విజయాన్ని పొందలేక పోయిన వారెందరో ఉన్నారు.

ఈ ప్రపంచంలో నీలా ఉండేది ఉండబోయేది ఉండాల్సింది కేవలం నీవు మాత్రమే అందుకే ఎవరినీ అనుకరించకు

వారు వీరమరణం పొందడం వల్ల విజయులైనట్లే. జటాయువు కూడా అదేవిధంగా "మరణించినప్పటికీ నేను విజయుడినే" అన్నాడు.

రావణుడు కత్తి దూశాడు. జటాయువు నిరాయుధుడై నప్పటికి తన వాడి గోళ్ళతో, ముక్కుతో రావణునిపై యుద్ధానికి దిగాడు, రావణుడు జటాయువు రెక్కలను ఖండించి వేశాడు. జటాయువు నేలకొరిగాడు. శ్రీరాముడు కన్నీటితో జటాయువును హృదయానికి హత్తుకున్నాడు. సాహసవంతుడైన జటాయువు ఆదర్శంకోసం బలిదానం చేశాడు.

భగవంతుడు భావనాప్రియుడు. ఆయనను పొందటానికి భావసంవేదనలే ముఖ్యమార్గం... అన్నమూ, రొట్టెలు నివేదించే వాళ్ళు, హారతులిచ్చేవాళ్ళు, 3 మాలలు జపం చేసేవాళ్ళు భగవంతుని హృదయంలోకి తొంగి చూడండి, ఆయన మనస్సును చదవండి. ఆయనకు ఎవరంటే ప్రేమో అర్థమవు తుంది. జటాయువు వంటి వారికోసం, ఉడుతలాంటి వారి కోసం ఆయన ప్రేమ భద్రపరచబడి ఉంటుంది. సేతుబంధనం జరుగుతున్న సమయంలో ఒక చిన్న ఉడుత వచ్చింది. వానరు లంతా సముద్రంలోనికి రాళ్ళు వేసి వారధి కట్టటం చూసింది. రావణుడిని వధించి సీతామాతను తీసుకురావటానికై జరుగుతున్న ప్రయత్నంలో తానూ పాలుపంచుకోవాలనుకున్నది, 'నేను అల్పప్రాణినే కావచ్చు. అయినా నాకు చేతనయినంత నేను చేస్తాను" అని నిర్ణయించుకున్నది. మట్టిలో పొర్లి నీటిలో మునిగింది. మరల ఒడ్డుకు వచ్చింది. మళ్ళీ మట్టిలో పొర్లటం, నీటిలో మునగటం. ఈ విధంగా ఉడుత పడుతున్న శ్రమను చూసి రాముడు ముచ్చటపడ్డాడు. అఅచేతిలో ఉంచుకొని ప్రేమతో దాని వీపుపై మూడు వ్రేళ్ళతో నిమిరాడు. అందుకే నేటికీ ఉడుత వీపుపై రాముని చేతవ్రేళ్ళ చిహ్నాలు ఉంటాయి.

### భగంతుడు ఏ విధంగా లభిస్తాడు?

"గాయత్రీమంత్రం జపిస్తే భగవంతుని సాక్షాత్కారం లభిస్తుందా? అని ఆలోచించడం వల్ల ప్రయోజనంలేదు. మీ హృదయంలోని మలినాలను తొలగించుకునే ప్రయత్నం చేయండి పిరికితనాన్నీ, స్వార్థాన్నీ విడనాడి మీ మనస్సును స్వచ్ఛపరచుకునేందుకు కావలసిన ధైర్యాన్ని, సాహసాన్ని కూడగట్టుకోవాలి. అప్పటిదాకా భగవంతుడిని చూడాలనే ఆలోచనను వదలిపెట్టండి. ఆధ్యాత్మికత యొక్క సిద్ధాంతాలను అంగీకరించి వాటిని అమలుపరిచేవాళ్ళు ఇంకా ఉన్నారు. తమ వ్యక్తిత్వాన్నీ, శీలాన్నీ వీలయినంత ఉన్నతంగా తీర్చిదిద్దుకొనగలగాలి. తద్వారా భగవంతుని సంపదలను పొందటానికి తమను తాము అర్హులుగా నిరూపించుకొనవచ్చు. మీకు ఆశీర్వాదాలు, వరదానాలు ఇవ్వటానికి ద్వారములు తెరచియే ఉన్నవి. అయితే ఇందుకు ఒక షరతు ఉంది. భగవంతుడు తన సంతానానికీ, భక్తులకు ఎంత ఉదారంగా కోరినవానిని ప్రసాదిస్తాడో మీరు కూడా అల్పుల పట్ల అంతే ఔదార్యంగా ఉండాలి. ఇచ్చేవారి చెయ్యి ఎప్పుడూ పైనే ఉంటుంది. అడిగేవారు అడుగుతూనే ఉంటారు, గుర్తుంచు కోండి, దేనికైనాసరే, పుచ్చుకొన్న పిదప పశ్చాత్తాపపడవలసి ఉంటుంది. ఎవరి ముందూ కొంగు చాచే అవసరం లేకుండా భగవంతుడు మీకు ఇన్ని వరాలను ప్రసాదించాడు, మీరు కూడా అటువంటి ప్రత్యేకతలను మీలోన ఉత్పన్నం చేసుకొనగలవేమో ఆలోచించండి.

### సాహసాన్నీ, వివేకాన్నీ జాగృతం చేసుకోండి

ధైర్యము, వివేకములను వికసింపచేసుకోవాలి. ధైర్యమంటే భౌతిక ప్రపంచంలో మీ ఇరుగుపొరుగులతో యుద్ధానికి తలపడటమని అర్థం చేసుకొనవద్దు.

మనతో మనం సంఘర్షణ పడటానికి కావలసిన ధైర్యం – అని తెలుసుకోవాలి. మనలోపల చెడు ఆలోచనలు, చెడు సంస్కారములు నిండి ఉన్నాయి. మనలో పిరికితనము, స్వార్థము నిండి ఉంది. ఇవి మనలోని శక్తులను ఒక హద్దు వరకు మాత్రమే పరిమితం చేస్తున్నాయి. మా వద్ద ఉన్న వనరులను సమాజం యొక్క అవసరాలకు వినియోగిస్తే, అవి ఏవిధంగా రూపుదాల్చుతాయో ఊహించలేము. జమ్నాలాల్ బజాజ్‌గారి వద్దనున్న ధనం గాంధీగారికి సమర్పించబడింది. ఫలితంగా గాంధీగారి శక్తి వెయ్యిరెట్లు వృద్ధి చెందింది. అలాగే మాంధాతగారి సంపద జగద్గురువులైన శంకరాచార్యుల వారికి సమర్పించబడటం ద్వారా శంకరుల శక్తి అనేక రెట్లు, అశోకుని ధనం బుద్ధభగవానునికి అర్పించడం ద్వారా బౌద్ధమతం విస్తృతంగా పెరిగింది. అదేవిధంగా ఆధ్యాత్మికత అభివృద్ధి చెందటానికీ, తద్వారా మానవులు సంస్కరించబడేందుకూ ఉపయోగపడే పనులకు మీ సహకారం జోడించబడినట్లైతే, ప్రపంచంలో ఎంత చక్కని మార్పులు సంభవించగలవో

**సమయాన్ని సరిగా వినియోగించుకోలేని వారు ఏ రంగంలోనూ రాణింపజాలరు**

ఊహించలేము. కాబట్టి మీరందరూ మీవంతు సహకారాన్ని ఆయా పనులకు వినియోగించి చూడండి. దేశం యొక్క స్వరూపమే మారిపోగలదు.

## దేశాన్ని జాగృతం చెయ్యటానికి కూడా ఆలోచించండి

ఒక పల్లెలో 500 మంది మనుష్యులు నివసిస్తున్నారు. అందులో ప్రతి ఒక్కరూ రోజూ పావలా ఖరీదు చేసే బీడీ త్రాగుతారు. వారందరూ గ్రామం యొక్క ప్రాముఖ్యతను, సమాజంపట్ల తమ కర్తవ్యాన్నీ తెలుసుకొని అప్రమత్తతతో బీడీ త్రాగడాన్ని మానివేయగల్గితే, 500 మంది వ్యక్తులు, 500 పావలాలు ఆదాచేసి తమ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం వినియోగించటం ప్రారంభించగల్గితే, రోజుకు, 125 రూపాయలు పొదుపుచేసినట్లే. అంటే నెలకు 3750 రూపాయలు ఆదా చేసినట్లు. అలాగే సంవత్సరానికి 45,000 రూపాయలు గ్రామంకోసం జాగ్రత్తచేసి ఆ ధనంతో ఒక సంవత్సరం హైస్కూలు కట్టించవచ్చు. మరో సంవత్సరం ఆడ పిల్లల బడి, తర్వాత ప్రసూతి వైద్యాలయమూ... ఇలా ఎన్నో వసతులను సమీకరించుకొని తమ గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుకొనవచ్చు.

అయితే మీరు ఉపయోగించకూడని విధంగా డబ్బును ఉపయోగిస్తున్నారు. ఫలితంగా మన జాతి యావత్తూ నిర్వీర్యమై పోతున్నది. ఒకవైపు సోదరులు మూల్యం చెల్లించనవసరం లేని సంస్కృత పాఠశాలలో చదివి బయటకు వస్తున్నారు. వారికి తగిన భవిష్యత్తు లభించటం లేదు. మరోవైపు మీరేమో స్వర్గం లభిస్తుందని దానధర్మాలు చేస్తున్నారు. ఫలితంగా ఏమవుతోంది? నా వారసులందరూ తేజోవిహీనులవుతున్నారు. భిక్షాటనకు బయలుదేరుతున్నారు. అలా కాక, మీరు ప్రతి పైసాను గ్రామాభివృద్ధికి, సమాజ శ్రేయస్సుకు ఉపయోగించి నట్లైతే దేశం సుభిక్షమయ్యేది. మీరు తప్పుదారిన నడుస్తున్నారు. మరోవైపు సంపదలను, వస్తుసామాగ్రిని ప్రోగు చేసుకుంటున్నారు. దేశం పెడదారిన పయనించి దిక్కుతోచక విలవిలలాడుతున్నది.

## నిజమైన ఆధ్యాత్మికతకు అర్థం - వివేకము, ధైర్యము

మీ సూక్ష్మశరీరాన్ని వికసింపచేసుకొనగలిగినప్పుడే మీరు నిజమైన ఆధ్యాత్మిక వ్యక్తి కాగలరు. మేము ఆవిధంగానే ప్రయత్నించి 'కారణశరీరము' యొక్క భూమికలో ప్రవేశించాము. మీరు కూడా కారణశరీరంలో ప్రవేశించినప్పుడు మీకు అంతరాత్మ యొక్క వెలుగు ప్రత్యక్షంగా కనపడుతుంది. కారణ శరీరాన్ని సాధనలో సంలగ్నం చేయటానికి రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి ప్రేమ, రెండవది సేవ. ఈ భూమిని స్వర్గంగా మార్చడానికి బండరాతి వంటి హృదయాలలో ప్రేమను ప్రవహింపచెయ్యవలసి ఉంటుంది. నేటి ప్రపంచంలో, కుటుంబం పట్ల మనం అనుకునే ప్రేమ, ఆత్మీయత మొదలైనవన్నీ స్వార్థపూరితమైనవే తప్ప సత్యమైనవి కావు. ప్రేమంటే ఏమిటి? ఒక వ్యక్తి తాను స్వయంగా కష్టాన్ని సహిస్తూ, ఇతరులకు ఆహారాన్ని సమకూర్చటానికి సహకరించడాన్నే ప్రేమ అంటారు. ప్రేమ ఒక్కటే మార్గంలో పయనిస్తూ ఉంటుంది. కారణశరీరాన్ని వికసింపచేసుకొనటానికి మనం భగవంతుడిని ప్రేమించడ మనేది చాలా అవసరం. వ్యాయామశాలకు వెళ్ళి డంబెల్ సహాయంతో మన కండరాలను దృఢతరం గాలించుకునేందుకు కృషి చేసే విధంగానే, అనంతశక్తి భాండాగారమైన, ఈ ప్రపంచ మంతటా వ్యాపించి ఉన్న, కరుణాప్రవాహస్వరూపుడైన ఆ భగవంతుడిని ఆయన కాంతిని మనపై ప్రసరింపచెయ్యమని ప్రార్థించాలి. భగవంతుని ఔదార్యం ప్రేమ ఈ ప్రపంచంలోని ప్రతి ఆకు లోనూ, జీవిలోనూ, ప్రాణిలోనూ ప్రసరిస్తూ ఉంటుంది. ఈ ప్రపంచాన్ని సుఖశాంతులతో నింపివేయటానికి ఎంతో ఔదార్యాన్నీ, ప్రేమను జీవితంలో నింపుకోగలగాలి. భగవంతుడు మన హృదయంలో ప్రవేశించినప్పుడు ఈ ప్రపంచమంతా ఎంతో ఆనందమయంగా కనపడుతుంది. కానీ ఈనాడు మన యొక్క ప్రేమలు, అభిమానాల విధానమే మారిపోయింది, సోదరీ సోదరులుకానీ, తల్లీ పిల్లల మధ్యగానీ అనుబంధాలనేవి బలహీనమైపోతున్నాయి. హిమాలయాల నుండి దిగివచ్చిన గంగ, ఎల్లలు లేకుండా ప్రవహిస్తూ సాగరంలో కలిసిపోతుంది. మనం కూడా ఆవిధంగానే మన ప్రియతముడైన భగవంతుడిని చేరుకొనటానికి అవధులు లేని ప్రేమను సాధనంగా చేసుకోవాలి. ఇదే ప్రేమయొక్క పరిణతి ప్రేమించేవారు కష్టాలలో చిక్కుకుంటారు, మోసగించబడతారు" అని ప్రజలు అపోహపడుతుంటారు. అది చాలా పొరపాటు. ప్రేమించే వారెప్పుడూ సుఖంగానే ఉంటారు. మోసగించే వ్యక్తులే ఆపదలలో చిక్కుకుంటారు.

ఒక మనిషి మరొక మనిషి అభ్యున్నతి కోసం ఇతరులకు

**ఏళ్ళ తరబడి నీటిలోనున్న రాయి మెత్తబడదు**

శాంతిని ప్రసాదించడం కోసం తనకు ఉన్నటువంటి సమస్తమైన వనరులను సమర్పించుకుంటూ వెళ్ళడమే ప్రేమకు ఆధారం. మనమంతా ఒకరికొకరం అంతరంగంలో 'మన' అని అనుకొని ప్రేమించగలిగితే మన సమాజం ఆనందంతో నిండుతుంది, అభివృద్ధి చెందుతుంది. సద్వినియోగం చేసుకొనమని భగవంతుడు బహుమూల్యమైన వరాలనెన్నింటినో మనకు ప్రసాదించాడు. కానీ మనం వాటిని నిరర్థకమైన పనులకు వెచ్చిస్తున్నాము. జీవితాన్ని దురుపయోగం చేస్తున్నాము. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఈ క్షణం నుంచీ జీవితాన్ని ప్రేమించు "జీవితం ఎంత గొప్పదో మీకు అర్థం కాగలదు. ఈరోజు మనం ఎంత కఠినమైన పరిస్థితుల్లో ఉన్నప్పటికీ, జీవితాన్ని సార్థకం చేయగలిగే సిద్ధాంతాలను క్రియాన్వితం చెయ్యగలిగితే మనం కూడా చిన్న చిన్న దివ్వెల వలె చరిత్ర పుటలను ప్రకాశవంతం చెయ్యగలము. అంధకారబంధురమైన అమావాస్యను పూర్ణిమనాటి కాంతులతో నింపగలము.

ప్రేమించుట అంటే భగవంతుని ఆకాంక్షలను నెరవేర్చటము, ఆయన సుందరరూపాన్ని దర్శించటం. ఈ ప్రపంచమంతా ఆయన యొక్క సుందరరూపమే. అయితే ఈనాడు ఆ సుందర రూపంలో శాంతి నశించింది. మంచితనం తొలగిపోయింది. చక్కని వ్యవస్థలు రూపుమాసిపోయినాయి వాటినన్నింటినీ తిరిగి ప్రతిష్ఠింపచెయ్యటానికి మీరు మీ సమయాన్ని, ధనాన్ని వెచ్చించి క్రియాశీలురు కావలసి ఉంటుంది. అప్పుడు మనం భగవంతునికి చేరువకాగలము. నరుడు నారాయణుడవుతాడు.

– *అఖండజ్యోతి*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

---

## ప్రపంచ కుబేరుని ఆఖరి క్షణాల్లో హృదయ స్పందన

*వ్యాపార జగత్తులో అత్యంత ఉన్నత శిఖరాన్ని చేరాను. నేను విజయానికి ప్రతీకగా నిలిచాను. పనితప్ప నాకు వేరే ఆనందం తెలీదు. సంపాదనకే అంకితమైపోయాను. ఇప్పుడు ఈ మరణశయ్యమీద రోజులు లెక్కపెట్టుకుంటున్న నేను ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకుంటే, ఇన్నాళ్ళూ నేను గర్వపడుటకు కారణమైన పేరు, డబ్బు సంతృప్తినివ్వజాలవని నాకు అనిపిస్తోంది. ఈ నిశిరాత్రిలో నా ప్రాణాల్ని నిలిపేందుకు అమర్చిన యంత్రాలు చేసే శబ్దంలో నాకు మృత్యుదేవత ఊపిరి చప్పుడు వినిపిస్తోంది.*

*నాకిప్పుడనిపిస్తోంది... జీవితంలో సరిపడా డబ్బు సంపాదించాక, మనం ఆలోచించాల్సిన విషయాలు వేరే ఉన్నాయి. కళలూ, అనుబంధాలూ, చిన్నప్పటి కలలూ, కోరికలూ. సేవ... ఇలా డబ్బుకి అవతల చాలా ప్రపంచం ఉంది. కానీ డబ్బు వెనుక పెట్టే పరుగు మనిషిని మరమనిషిలా మార్చేస్తుంది. అందుకు నేనే ఉదాహరణ. ఇతరుల మనసుల్లోని ప్రేమను గుర్తించాలనే దేవుడు మనకి జ్ఞానేంద్రియాలను ఇచ్చాడు. కానీ డబ్బుకు మాత్రమే విలువ ఇచ్చే కాల్పనిక జగత్తును మనం సృష్టించుకున్నాం. నేను సంపాదించిన డబ్బు ఈ క్షణం నాకు తోడుగా లేదు. నా ఈ ఆఖరి ప్రయాణంలో అది నా వెంటరాదు. నేను నాతో తీసుకువెళ్ళగలిగేది ప్రేమానుభూతులూ. అందమైన జ్ఞాపకాలూ మాత్రమే. ఈ ప్రేమపూర్వక అనుభూతులే ఎప్పుడూ మనతో ఉంటాయి. మనల్ని ఉన్నతస్థాయికి చేరుస్తాయి. నిజం. అంతా మన హృదయంలోనే, మన చేతుల్లోనే ఉంది. ఈ ప్రపంచంలో అత్యంత ఖరీదైన మంచం ఏదో తెలుసా?... నువ్వు రోగంతో బాధపడుతూ పడుకున్న మంచం. నీ కారు నడపడానికి ఒక డ్రైవర్‌ని నియమించుకోగలవు, కానీ నీ జబ్బునూ, నీ బాధనూ పంచుకొని అనుభవించే వ్యక్తివి మాత్రం ఎన్ని కోట్లు పెట్టినా నువ్వు ఏర్పాటు చేసుకోలేవు. నువ్వుదేన్ని కోల్పోయినా తిరిగి పొందవచ్చు. కానీ చేజారిన జీవితాన్ని మాత్రం తిరిగి పొందలేవు. జీవితంలో ఈరోజు మనం ఎంత గొప్పస్థితిలో ఉన్నా కథ ముగిసే రోజు, తెరపడే రోజు ఒకటి వస్తుంది. అప్పుడు–ఎంత ఆరాటపడినా కాలం వెనక్కి మళ్ళదు. అందుకే... కాస్త ముందే కళ్ళు తెరువు. డబ్బును కాదు. నీ కుటుంబాన్ని ప్రేమించు. నీ స్నేహితులను ప్రేమించు. ఆనందంగా జీవించు అందరినీ ఆనందంగా ఉంచు. (ఆపిల్ కంపెనీ సృష్టికర్త, ప్రపంచ మేధావుల్లో ఒకరైన స్టీవ్‌జాబ్స్ ఆస్పత్రిలో, తన ఆఖరి రోజుల్లో డైరీలో హృదయ స్పందనలు.*

– *సంకలనం: ఎ. వేణుగోపాలరెడ్డి*

---

**కష్టాలు చుట్టుముట్టినా ధీరుడు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోడు**

నావారితో నా మాట

# యువక్రాంతి సంవత్సరపు ప్రణాళిక - 1



యువాక్రాంతి సంవత్సరం యుక్త వయసుకు చేరుకుంది. నలుదిక్కులా ఉల్లాసం పొంగి పొర్లు తోంది. యువకులే కాదు, వారి శ్రేయోభిలాషులు, మిత్రులు, అందరూ మార్పు యొక్క స్వరూపాన్ని చూసి ఆహ్లాదంగా ఉన్నారు. 'యువాస్యాత్' - యువతగా మారండి, అన్నదానికి అర్థమేంటో అందరికీ బాగా తెలుస్తోంది. తైత్తరీయోపనిషత్తు లోని ఈ సూత్రం యొక్క ప్రాముఖ్యత అందరికీ తెలిసిందే. ఎక్కడ ఉన్నా, ఏ పరిస్థితుల్లో ఉన్నా యువకులుగా మారండి అన్నది దీని అర్థం. అంటే ఆయువులో కాదు, ఉప్పొంగే ఉత్సాహంలో, ఉల్లాసంలో, కొత్త సంకల్పాలలో, ఆత్మవిశ్వాసంలో మరియు విధేయాత్మక ఆలోచనలలో యువతగా మారాలి. ఈ విషయం అర్థమైతే నేడు 'యువత' పేరు మీద విభిన్న విశ్వవిద్యాలయాల్లో లేవనెత్తిన వితండ వాదాలు, వాటిని స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకునే రాజకీయ పార్టీలు, ఇవన్నీ మరి కనిపించవు. మన దేశంలోని యువశక్తంతా సృజనాత్మక ప్రయోజనాలకే ఉపయోగపడాలి.

గాయత్రి పరివారంలోని యువశక్తి చాలా ప్రత్యేకమైనది. చాలా ఉత్సాహంగా దేశమంతటా 12 జనవరి నుండి వచ్చే సంవత్సరం ఫిబ్రవరి వరకు ఈ ఉత్సవాలు జరుపుకుంటున్నాం. అవసరాన్ని బట్టి 22 జనవరి 2018 (వసంత పంచమి) వరకు దీన్ని పొడిగించవచ్చు. ఇందులో భాగంగా చేసే కార్యక్రమాలను టూకీగా 19 సంకల్పాలలో పొందుపరిచి ఇక్కడ ప్రచురిస్తున్నాం.

### 1. వ్యసన విముక్తి మరియు దురాచార ఉన్మూలన అభియానం (31 మే 2016 న ప్రస్తావించబోయేది)

నేడు సమాజంలో ప్రజలు చాలా త్వరగా వ్యసనాలకు బానిసలవుతున్నారు. పసిపిల్లలకు కూడా అలవాటవుతోంది. వీటి వల్ల సమాజంలో అపరాధ ప్రవృత్తులు పెరుగుతున్నాయి. మద్యం, మత్తుపదార్థాల అలవాటు దేశంలోని యువకుల్లో చాలా వేగంగా అంటుకుంటోంది. నకారాత్మకత, నిరాశ, చిరాకు వంటి వాటినుండి తప్పించు కోవడానికి ఇటువంటి వాటిని ఆశ్రయిస్తున్నారు. నిదానంగా పని చేసే ఈ విషం సామాజిక ఆరోగ్యానికి చాలా పెద్ద అడ్డుకట్ట. శరీరాలు కుళ్ళి పోతున్నాయి, జనశక్తి క్షీణిస్తోంది. అదే విధంగా వరకట్నం, ఖరీదైన పెళ్ళిళ్ళు, ఫ్యాషన్లు వంటి దురాచారాల వల్ల సమాజంలో మోసాలు, దారిద్ర్యం పెరుగుతున్నాయి. ఆదర్శ వివాహాలు తగ్గుముఖం పట్టాయి. తెలివైన వాళ్ళగా కనిపించేవాళ్ళు కూడా ఈ చిక్కులో పడిపోతూంటారు. వీటన్నిటి వెనుక ముఖ్య ఉద్దేశం అహాన్ని ప్రదర్శించడం.

గర్భంలోనే ఆడపిల్లలను చంపడం దేశానికి పట్టిన పెద్ద పీడ. దీని వల్ల ఆడ-మగ నిష్పత్తిలో చాలా తేడా వచ్చింది. ఇదంతా ఆడపిల్ల భారం అనే భ్రాంతి వల్ల పట్టిన పీడ. దీనికి విరుద్ధంగా ఆందోళనలు కొనసాగాలి. అలా చేస్తే గర్భంలోనే ఆడపిల్లలను చంపిన పాపం సమాజానికి అంటదు.

అడుక్కునే వ్యాపారం మన దేశంలో బాగా అభివృద్ధి చెందుతోంది. పిల్లలను అంగవిహీనులుగా చేసి అడుక్కోవడానికి ఉపయోగిస్తున్నారు. ఎన్నో నగరాల్లో వేల మంది ఈ పని మీదే ఉన్నారు. ప్రతి సంవత్సరం ఎందరో ముక్కుపచ్చలారని పిల్లలను ఎత్తుకుపోతున్నారు. ఇలాంటి పనుల వల్ల మన దేశానికి పెద్ద కళంకం అంటుకుంటోంది. గొప్ప పేద, మూఢాచారాలు, కుల మతాలు మొదలైన భేదాలన్నీ ఇప్పటికీ 21వ శతాబ్దంలోని రెండో దశాబ్దిలో కూడా అలాగే ఉన్నాయి. వీటన్నిటి నిర్మూలనకు కూడా మనం కృషి చేయాలి.

బద్ధకం, పనీపాటా లేకుండా ఉండటం లాంటి వాటిని పరమపూజ్య గురుదేవులు సామాజిక పాపాలన్నారు. ఇలాంటి ప్రవృత్తులు సమాజాన్ని బాగా దెబ్బతీస్తాయి. మనందరం ర్యాలీల ద్వారా వీటికి వ్యతిరేకంగా ప్రజలలో జాగురూకత తీసుకురావాలి. పలుచోట్ల శిబిరాలను ఏర్పాటు చేసుకుని

**కన్నబిడ్డ కోసం తల్లి కాలయముడినైనా ఎదిరిస్తుంది**

ఇటువంటి దురాచారాలకు వ్యతిరేకంగా సంకల్పం తీసుకోవాలి. సమాజంలో వ్యభిచారాన్ని విస్తరింపజేస్తున్న సోషల్ మీడియా గురించి కూడా అందర్నీ హెచ్చరించాలి. వాట్సాప్, ఫేస్‌బుక్, వీడియో క్లిప్స్ మొదలైనవాటి దురుపయోగం వల్ల సమాజంలో భయంకర వ్యసనాలు అలవాటవుతున్నాయి. వివేకంతో ఉపయోగించుకోవడం వల్ల ఉండే లాభాలు అందరికీ తెలియ జేయాలి, ప్రత్యేకించి యువశక్తికి.

**"డి-ఎడిక్షన్ క్యాంప్స్" - మత్తు అలవాట్లు మాన్పించే శిబిరాలు:** ఆయుర్వేదం మరియు హోమియోపతి ఔషధులతో నివారించే ప్రయత్నం జరగాలి. ప్రేరణాత్మకమైన పోస్టర్లను పలుచోట్ల అంటించాలి. దురాచారాల నిర్మూలనకు కూడా ఇలాంటి కార్యాలే చేపట్టాలి. సత్ప్రవృత్తుల సంవర్ధనకు ర్యాలీలు నిర్వహించాలి. సంకల్ప పత్రాలు నింపించాలి. ఈ సంకల్పాలని బలపరిచే ఆధ్యాత్మిక ఉపచారాలను (గాయత్రి సాధన, ధ్యాన, ధారణ మరియు యజ్ఞం మొదలైనవి) అలవర్చుకునేట్టు సహాయం చేయాలి. అంతరాష్ట్రీయంగా మత్తుపదార్థాల నిషేధ దినాన్ని జరుపుతారు. ఇందులో వీలైనంత ఎక్కువ మందిని భాగస్వాముల్ని చేయాలి. పొగాకు వల్ల ఆరోగ్యం ఎంతగా క్షీణిస్తుందో అందరికీ తెలుసు. అయినప్పటికీ వీటి ఉపయోగం పెరుగుతూనే ఉంది. అందుకే యుద్ధప్రాతిపదికతో ప్రయత్నాలను ముమ్మరం చేయాలి. డ్రగ్స్‌తో పాటు బామ్, దగ్గుమందు, అయొడెక్స్ వంటివి కూడా మత్తు పదార్థాలుగా ఉపయోగించబడుతున్నాయి. ప్రతి ఒక్కరిలో జాగురూకత తెస్తేనే ఈ మహాభారతాన్ని గెలవగలం.

## 2. ప్రవాస యువత

ప్రతిభావంతులు, భావనాశీలురు, సమయదానం ఇవ్వ గలిగే విద్యావంతులైన యువత కోసం ఈ ప్రత్యేకమైన కార్య ప్రణాళిక తయారు చేయబడినది. ఇటువంటి యువకులు వారి పరిస్థితులను బట్టి ఎంత సమయాన్ని కేటాయించగలరో నిర్ణయించుకోవాలి. చదువుకుంటూ, ఉద్యోగం చేస్తూ కూడా సమయాన్ని కేటాయించవచ్చు. ముందు వారున్న ప్రదేశాన్ని జాగృతపరచాలి, ఆ తరువాత శాంతికుంజ్ ఇచ్చే నిర్దేశాలను బట్టి దేశంలోని పలుచోట్లకు వెళ్ళి యువచైతన్య శిబిరాలను ఏర్పాటు చేయడం వారి పని. వారానికి కనీసం ఒక రోజు లేదా నెలకు నాలుగు రోజులు సమయాన్ని ఇవ్వగలిగే యువకులు ఈ శృంఖలలో పాల్గొనవచ్చు. మెల్లమెల్లగా వారే సమయాన్ని పెంచుతూంటారు. విదేశాల్లో కూడా 2002 నుండి యువ ఆందోళన కొనసాగుతోంది. ప్రతి సంవత్సరం అక్కడ యువ శిబిరాలు ఏర్పాటయ్యాయి. వాటివల్ల చాలా మంది యువకులు ప్రభావితులయ్యారు. ఆ శిబిరాలకెళ్ళి మేమే స్వయంగా మార్గదర్శనం చేసాం. నేడు ఆ యువకులే ఉద్యోగాలు చేస్తూ, వివాహితులైనా కూడా నెలకి మూడు వారాంతాల్లో (6 రోజులు) సమయదానాన్ని ఇస్తున్నారు. 2012వ సంవత్సరంలో కాలిఫోర్నియాలోని ప్రాకృతిక వాతావరణంలో జరిగిన శిక్షణ ప్రశిక్షణ శిబిరంలో పాల్గొన్న 40 మంది అనేక రెట్లై అమెరికా మరియు కెనడాలో చాలాచోట్ల యూత్ క్యాంప్స్ నిర్వహిస్తున్నారు. గత 10 సంవత్సరాల నుండి భారతదేశంలో చాలా నగరాలలో కూడా గాయత్రీ పరివార్ యూత్ గ్రూప్ ద్వారా ఇటువంటివి ఏర్పాటు జరిగాయి.

**దేశంలో యువత చేపట్టిన ముఖ్య కార్యాలు -**

ఎ) వారి వారి ప్రదేశాల్లో యువ చైతన్య శిబిరాలు ఏర్పాటు చేయుట.

బి) వారంలో వీలైనన్ని రోజులు-శని, ఆదివారాల్లో యువకుల కోసం విద్యాలయాలు, కాలేజీలు, కార్పోరేట్ ఆఫీసులు, గ్రామాలు, ఆస్పత్రులు, ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ మొదలైన వాటిల్లో కార్యక్రమాలు, కార్యశాలలను ఏర్పాటు చేయుట.

సి) యువ మండలాల సంఘటన, శాంతికుంజ్‌లో వాటిని నమోదు చేయుట

డి) బాలసంస్కారశాలల సంచాలన

ఇ) పలుచోట్ల యోగ కేంద్రాల ద్వారా ఆరోగ్య సంవర్ధన కార్యక్రమాలు

ఎఫ్) ఆదర్శ గ్రామాన్ని ఎంచుకుని, కనీస స్థాయినుండి మొదలు పెట్టి పూర్తి లక్ష్యాన్ని చేరడం.

జి) వృక్ష గంగా అభియానం, భగీరథీ జలాభిషేకం, శ్రీరామ స్మృతి ఉపవనాలు, శ్రీరామ స్మృతి సరోవరాలు మరియు ఆదర్శగ్రామ అభియానం గురించి అందరికీ పరిచయం చేయడం.

**తొలిశ్వాస తీసుకొని నీవు ఏడుస్తావు - చివరి శ్వాస విడుస్తూ ఏడిపిస్తావు, రెండు ఏడుపుల మధ్య నవ్వుతూ నవ్వించే కాలమే జీవితం**

హెచ్) దేవసంస్కృతి విశ్వవిద్యాలయం గురించిన పూర్తి వివరాలు అన్ని విద్యాలయాలు, మహావిద్యాలయాలు, విశ్వవిద్యాలయాలకు అందివ్వాలి. దాఖలు విధానాన్ని తెలపాలి. భవిష్యత్తులో మిగిలిన రాష్ట్రాలలో ఏర్పాటు కాబోయే విశ్వవిద్యాలయాల గురించి చెప్పడం.

ఐ) పుట్టినరోజు, పెళ్ళిరోజు, యజ్ఞ-సంస్కారాలు, దీపయజ్ఞాలు, సంచి పుస్తకాలయాలు మొదలైన వాటి సంచాలన.

జె) శాంతికుంజ్-హరిద్వార్, గాయత్రి తపోభూమి-మథుర, యుగతీర్థం-ఆవల్‌ఖేడాలో జరిగే ప్రత్యేకసాధనలు, కార్యక్రమాలను గురించిన వివరాలు తెలియజేయడం.

కె) విద్యాలయాలు - కాలేజీలలో ఆదర్శ విద్యార్థి కార్యశాలలు. వీటిలో శిక్షణ మరియు విద్యల సార్థక సమయన్వయం, శిక్షణతో పాటు రచనాత్మక కార్యక్రమాలు, నైతిక శిక్షణ, సమయ నిర్వహణ, ఒత్తిడి నివారణ, వనరుల నిర్వహణ, తెలివి పెంచుకునే వైజ్ఞానిక విధానం, సేవాభావాన్ని విస్తరింపజేయడానికి కాను శ్రమదానం, జీవించే కళ, సమాజ నిర్మాణానికి అనేక రకాల ప్రయోగాలు మొదలైన వాటిపై కార్యక్రమాలు ఏర్పాటవ్వాలి. వీటన్నిటికీ కావలసిన శిక్షణ సామాగ్రి శాంతికుంజ్ నుండి తెప్పించు కోగలరు.

ఎల్) ఆదర్శవంతులైన శిక్షకుల కార్యశాల-అధ్యాపకుల శిక్షణ-ప్రశిక్షణ. దేశ భాగ్యాన్ని రూపుదిద్దే విద్యార్థులను తయారు చేసే యుగనిర్మాతలు వీరు. వారు తెలుసు కోవలసిన 100 సూత్రాలు యుగనిర్మాణ యోజన ద్వారా తెలియ చెప్పచ్చు. 21వ శతాబ్దంలో ప్రశిక్షణ విధానాలు బాగా మారాయి. వాటి గురించి విస్తృతంగా తెలియ జేయాలి.

ఎమ్) 'యువక్రాంతి మార్గం', 'ఉత్తిష్ఠత్ జాగృత్' మరియు మన 'సప్త క్రాంతులు' - వీటిని స్వయంగా స్వాధ్యాయం చేసి ప్రచారం చేయాలి. వీటి ప్రాముఖ్యత అన్ని చోట్ల చెప్పాలి. 'యువక్రాంతి మార్గం' యొక్క రెండో భాగం కూడా ఈ సంవత్సరం ప్రచురించే అవకాశం ఉంది. దాంతో ఆందోళన మరింత విరాట్స్వరూపాన్ని పొందుతుంది.

ఎన్) గ్రామీణ క్షేత్రాలకు సంబందించిన కార్యక్రమాలు - పరమపూజ్యగురువుగారి గ్రామతీర్థ యోజనని అందరికీ తెలియజేసి ప్రజాదరణ పొందేటట్టు చేయాలి. గ్రామీణ స్థాయిలో స్వచ్ఛత, స్వావలంబన, గోకేంద్రిత (గోవుకు సంబంధించిన) ఆర్థికవ్యవస్థకు ప్రాముఖ్యతనివ్వడం పంచ మహా అభియానాలు, సప్త ఆందోళనలు, వ్యసన విముక్తి వల్ల లాభాలను తెలియచెప్పడం, గ్రామీణస్థాయిలో స్కూళ్ళు ఏర్పాటుకు తగిన కార్యక్రమాలు, ఆటపాటలు, ఆటల పోటీలు మొదలైనవాటి సంచాలన.

## 3. దివ్యత్వ జాగృతి కార్యశాల (డివైన్ వర్క్‌షాప్)

యువజాగృతిలో ముఖ్యభాగం. సరైన దారి దొరక్కపోతేనే యువత దారి తప్పేది. ఈ శరీరం మాత్రమే నేను అనుకోవడం వల్లనే ఈ స్థితి ఏర్పడ్డది. మనం శరీరం మాత్రమే కాదు, అంతకు మించిన ఆత్మలం, పరమాత్మ యొక్క అంశాలైన శక్తి వంతమైన ఆత్మలం. ఎప్పటికీ న్యూనతాభావంతో ఉండకూడదు. ఎప్పటికీ నిరాశ చెందకూడదు. **('ఉద్ధరేదాత్మనాత్మానం న ఆత్మానమవసాదయేత్. ఆత్మైవ హి ఆత్మనో బంధుః ఆత్మైవరి పురాత్మనః'** - భగవద్గీత 6.5.) మనసును మిత్రుడిగా ఉంచు కోవాలి, శత్రువుగా మార్చుకూడదు. ఎప్పటికీ నిరాశను దరిచేర నీయకూడదు.

యువతకు మార్గదర్శనం చేసి, మనోశక్తి పెంచి, మనో బలాన్ని సంస్కరించి, చిరాకుని తొలగించుకోడానికి అనేక కార్య శాలలు ఏర్పాటు చేయాలి. వీటిలో దివ్యత్వాన్ని అలవర్చు కోవాలని శపథం చేయిస్తారు. దివ్యత్వంతో ఎలా ముడిపడాలి, దివ్య సందేశాలు, సంగీతం, పాటల ప్రచారం ఎలా చేయాలి, వంటి విషయాల ప్రశిక్షణ ఇవ్వబడుతుంది. ఇవన్నీ తెలియచెప్పే విభిన్న కార్యశాలలు -

1. మానవ జీవిత గరిమ
2. మానవీయ ఉత్కృష్టత (హ్యూమన్ ఎక్సలెన్స్)
3. ఒత్తిడి నివారణ (స్ట్రెస్ మానేజ్‌మెంట్)
4. సమయ నిర్వహణ (టైమ్ మానేజ్‌మెంట్)
5. జీవన సాధనకు బంగారు సూత్రాలు
6. వ్యక్తిత్వ పరిష్కారానికి కార్యప్రణాళిక
7. ఎందుకు వైజ్ఞానిక ఆధ్యాత్మికత (వై సైంటిఫిక్ స్పిరిచ్యాలిటీ)
8. గ్రామ ప్రబంధన (రూరల్ మానేజ్‌మెంట్)
9. కార్పొరేట్ ఎక్సలెన్స్ - ఔద్యోగిక సామర్థ్యంలో దివ్యత్వాన్ని చేర్చటం

**ఒక చక్కటి బంధానికి కావలసిన మూడు - కన్నీరొలకని కళ్ళు, అబద్ధాలు చెప్పని పెదాలు నిజమైన ప్రేమ**

10. సమగ్ర ఆరోగ్య నిర్వహణ (హోలిస్టిక్ హెల్త్ మానేజ్‌మెంట్)
11. యోగ మరియు నిర్వహణ
12. ఆధ్యాత్మికానికి పర్యాయమైన జీవించేకళ (ఆర్ట్ ఆఫ్ లివింగ్) పై ప్రశిక్షణ. ఇదేదో ఒక పనిగా కాదు 24 గంటల జీవనశైలిని అభ్యసిస్తే జీవితం దివ్యంగా మారుతుంది.

ఈ సంచికలో కేవలం మూడు విషయాలను విస్తారంగా చెప్పి పాఠకులకు యువక్రాంతి సంవత్సరం యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. తరువాతి సంచికల్లో దీనికి సంబంధించిన మరిన్ని పక్షాలపై విస్తారంగా చర్చించడం జరుగుతుంది. ప్రత్యేకించి స్వావలంబన, గో కేంద్రిత అర్థవ్యవస్థ, స్వాలోక యోజన, పంచ మహాఅభియానం, వీడియో రథాల కార్య ప్రణాళిక, అన్ని జిల్లాలలోనూ యోగ - ఆరోగ్య కేంద్రాల స్థాపన, యూత్ ఎక్స్‌పో, కవి సమ్మేళనం, "దియా" మరియు దానితో అనుసంధాన పద్ధతి, సంగీత విభావరి, యువ ప్రవక్త పరిషద్ మరియు కుటుంబ యువసమ్మేళనాల గురించి విస్తారంగా చర్చించడం జరుగుతుంది.

పాఠకుల్లో ఎవరైన తాము యువకులం అనుకున్నవారు, యువకులతో సహచర్యం చేసేవారు, కుటుంబంలో యువకుల భాగస్వామ్యాన్ని పెంచాలనుకునేవారు, మాకు ఉత్తరాలు రాయాలని కోరుతున్నాం. ఈ సంచికలోని విషయాలను క్షుణ్ణంగా చదవండి. మీ మనసులోని జిజ్ఞాసను ఉత్తరం ద్వారా తెలియజేయండి. వాటికి సమాధానాలు వచ్చే సంచికల్లో ఇవ్వబడతాయి. క్షేత్రీయ స్థాయిలో కాని కేంద్రీయస్థాయిలో కాని ఎక్కువకాలం సమయదానం ఇవ్వదల్చుకున్న యువత ముందు శాంతికుంజ్‌లో జరిగే ఒక నెల వ్యవధి గల యుగశిల్పి శిబిరానికి అనుమతి తీసుకుని హాజరుకావాలి. అనుమతి లేకుండా స్వయంగా కానీ, కుటుంబంతో కానీ ఇక్కడికి రావడానికి లేదు. ఇక్కడ పరిమితమైన స్థలం ఉంది. ప్రతి చోట మన కార్యక్రమాలు ప్రగతి సాధించే అవకాశాలు చాలా ఉన్నాయి. వాటిని ఎక్కడైనా ఉపయోగించవచ్చు. ఇది మహామానవులు వజ్రాలవలే యుగ దేవత పాదాలకు ఇచ్చే సమయదానం. సామాన్యమానవుల నుండి మహామానవులుగా మారడానికి నడుం బిగించి యువ శౌర్యాన్ని మేల్కొల్పండి. శక్తివంతులుగా తయారవండి, స్థానికంగా పైన తెలిపిన విషయాలలో సక్రియులవ్వండి. యుగ దైవమైన మహాకాలుడు మీకోసం ఎదురు చూస్తున్నాడు.

*- అఖండజ్యోతి, మే 2016*
*అనువాదం: ఎం.వి. ప్రసాద్*

---

## ఆత్మసమర్పణ

*థాయిలాండ్‌లోని గ్రీన్‌ల్యాండ్‌పార్కులో స్వామి వివేకానంద చక్కని ఉపన్యాసం ఇచ్చారు. జనం కిటకిటలాడిపోయారు. కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. వేనోళ్ళ పొగడుతూ ఉన్నారు. వివేకానంద అందరిని సావధానపరచారు. మేఘ గంభీర స్వరంతో అన్నారు. "ఈనాటి స్థితిగతులను చూస్తుంటే నవయుగనిర్మాణం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. దానిని సాధించటానికి నేను సిద్ధంగా ఉన్నాను. కాని స్వచ్ఛందంగా ఆత్మసమర్పణ చేయగలిగిన ఒక్క 20 మంది సమాజసేవకులు నాకు తోడుగా రావాలి. మీలో ఎవరైనా ఉంటే ముందుకు రండి."*

*అందరు ఒకరి ముఖాలు ఒకరు చూచుకుంటూ వెళ్ళిపోయారు. 10 నిముషాలలో మైదానం ఖాళీ అయింది. స్వామి తన విడిదికి వెళ్ళిపోయారు. ప్రశాంతంగా నిద్రపోయారు. తెల్లవారి నిద్రలేచి తలుపు తెరిచారు. దర్వాజాను ఆనుకొని ఒక స్త్రీ నిలబడి ఉంది. స్వామి ఆశ్చర్యపోయారు. ఆమెను సగౌరవంగా కూర్చుండబెట్టి వచ్చిన కారణం అడిగారు. స్వామీ! నేను నిన్న మీ ఉపన్యాసం విన్నాను. మిగిలిన 19 మంది విషయం నేను చెప్పలేను. నేను మాత్రం త్రికరణశుద్ధిగా మీకు తోడుగా ఉంటాను ఆత్మసమర్పణ చేస్తున్నాను." అంటూ పాదాలపైబడి నమస్కరించింది. స్వామి ఆమెను వెంటబెట్టుకుని భారతదేశం వచ్చేశారు. ఆమెయే సోదరి నివేదిత భారతీయ సంస్కృతీ పరిరక్షణకు చేయూతనిచ్చింది. ఆ జన్మాంతం కృషి చేసింది.*

- ప్రజ్ఞాపురాణం నుండి
*అనువాదం : శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

**విజయానికి మూలం ఆత్మ విశ్వాసం**

ఆయుర్వేద వైద్యం-14

# క్యాల్షియం భాండాగారము - నువ్వులు

పూజాసామగ్రిలో నువ్వుల ఉపయోగించుట ప్రాచీన కాలంనుండి వస్తున్నది. యజ్ఞములో నువ్వులను హవిస్సులుగా వినియోగించుట ఆనవాయితీగా ఉంది. పితృతర్పణాలు విడచు నప్పుడు నువ్వుల వినియోగించుట తప్పని సరి– దీనికి తోడు నువ్వులను పితృతర్పణాలని పిలచుట కద్దు. నువ్వులతో మిఠాయిలను, తయారుచేస్తారు. విభిన్న వ్యంజముల తయారీలో (పైపూతకైవాడెడి మందులలో) నువ్వులను వాడెదరు. క్యాల్షియం అధిక మొత్తంలో కలిగియున్నవి నువ్వులు. సీతాకాలమందు నువ్వులు – బెల్లం కలిపి తయారుచేసిన మిఠాయిలను తినుట ద్వారా జీవన శక్తి వృద్ధి ద్వారా ఆరోగ్యం రక్షింపబడుతుంది. నల్ల నువ్వులు అత్యంత శ్రేష్ఠము నల్ల నువ్వులు లభించనిచో తెల్లనువ్వులు వాడవచ్చును. నువ్వులనూనె మాలీసు కొరకు, తలవెంట్రుక కుదుళ్ళలో రాయుటకు అల్లోవేరారసంతో కలిసి ఉపయోగించుకొనవచ్చును–

**ఆయుర్వేద వైద్య ఆధారంగా గుణదోషాలు:** గాయాలు మాన్పుట, దంతాలనొప్పుల నివారించి వాతాన్నిహరించి, బుద్ధిని పెంచి పాలను వృద్ధిచేసి, చెమటను నిరోధించెడి, వానిలో బహుళ ఉపకారి మరియు చర్మరోగ నివారిణి. బలాన్ని వృద్ధి చేసి, కఫాన్ని హరించి పిత్తాన్ని వృద్ధి చేస్తుంది.

**నువ్వుల భస్మము తయారీ విధానము:** నువ్వుల మొక్కలను పెకలించి, ఎండ బెట్టి కాల్చి వాని భస్మాన్ని నీటిలో వెయ్యాలి. నీరు తేరుకున్నాక, భస్మంనీటి అడుగగు భాగానికి చేరుతుంది. ఒనీటిని నెమ్మదిగా ఒక పాత్రలోనికి జాగరూకతతో సేకరించి, ఆ నీటిని కాచాలి అది చిక్కగా తయారవుతుంది. ఎండలో దీనిని ఎండబెట్టాలి దీనినే నువ్వుల భస్మం అనెదరు.

## గృహోపచారము

**మొలలవ్యాధి నివారణ:** దీనిలో రెండు రకాల మొలలు ఉన్నాయి. ఎర్రని రక్తంతో మలం వెలువడుతుంది. రెండవది చాలా నొప్పితో కూడి ఉంటుంది. స్త్రీల తెల్ల కుసుమవ్యాధికి కూడా ఇది బాగా పని చేస్తుంది. 10 గ్రాముల నల్ల నువ్వులు రాత్రంతా నీటిలో నానబెట్టాలి. ఉదయాన్నే నువ్వుల పైపొట్టును వలిచి సరిసమానమైన వెన్నను, మిస్రీని కలిపి ఉదయాన్నే ఖాళీకడుపుతో, నిత్యము 40 దినాలు సేవించాలి. ఉత్తమ పథ్యము: ఆపిల్, జామ, బొప్పాయి, పచ్చని ఆకుకూరలు, తాజా పాలు సేవించుట ఉత్తమం

**ప్రక్కలో మూత్రం విడచేవారికి విముక్తి:** కొందరు పిల్లలు నిద్రలో తెలియకుండానే ప్రక్కలో మూత్రవిసర్జన చేస్తుంటారు. ఇది నరాల బలహీనత వలన వచ్చెడి రోగం. ప్రతిదినం 10 గ్రాముల నువ్వుల పొడిచేసి బెల్లాన్ని కలిపి తిన్నచో లాభకారిగా ఉంటుంది.

**కీళ్ళలో నొప్పి:** నువ్వులలో వాతాన్ని హరించే గుణమున్నది. 20 గ్రాముల నువ్వులను పిండి చేసికొని బెల్లంతో పాటు తిన్నచో శరీరంలో నిత్యము లోపించెడి క్యాల్షియం పూరింపబడుతుంది. దీనితో సంధివాతం నివారణ అవుతుంది. కీళ్ళనొప్పులు నివారింపబడతాయి.

**శారీరక నొప్పులు:** నువ్వుల నూనెతో మాలీసు చేసిన అత్యంత సుగుణంగా ఉంటుంది. 500 గ్రాములు నూనె 20 గ్రాముల వెల్లుల్లి ముద్ద 10 గ్రాముల శొంఠి 20 గ్రాములవాము కలిపి కాచాలి. వానిలోని నీటి ఆవిరైపోగానే (చిక్కబడగానే) పొయ్యి మీదనుండి దించి చల్లారనివ్వాలి. కొంచెం కర్పూరం కలిపి, కలియబెట్టి గాజుసీసాలో నిల్వ చెయ్యాలి! ఈ నూనెతో మాలీసు చేసిన రక్తప్రసరణ వృద్ధి జెందుతుంది. నరాలకు రక్తనాళాలకు బలం చేకూరుతుంది. రక్తంలోని మలినాలు విసర్జించబడతాయి.

**వెంట్రుకలు రాలుట నివారణ:** నల్ల నువ్వుల పూల నుండి తాజారసాన్ని తీసిరోజూ 3 సార్లు వెంట్రుకల కుదుళ్ళలో వ్రాసిన లాభకారిగా ఉంటుంది.

**వ్రణాలు మరియు భగేంధ్ర రోగనివారణకై:** నలపరంతో తీవ్రంగా నొప్పి కల్గించెడి వ్రణాలు, గాయాలకు అవిశ ఆకులతో, నువ్వులు నూరి వెంటనే పాలలో ముంచి, బాగుగా పిసికి దీనిని పై పూతగా వేసిన లాభకారి.

విద్యను పంచిన కొలది నీవు ఎదుగుతావు

**కుష్టు రోగనివారణ:** నువ్వులు మరియు బావచి చెరిసమానంగా తీసికొని బాగుగా కలిపి రోజు ఉదయం మరియు సాయంత్రం 5-5 గ్రాముల ఒక సంవత్సరం పాటు సేవించిన లాభం.

**విషజ్వరాలు:** నువ్వుల పొడిని నేతితో కలిపి సేవించిన విష జ్వరాలు నివారణ జరుగుతుంది.

**చిన్న సాలెపురుగు విషం:** శరీరంపై సాలెపురుగు విషం యొక్క దుష్ప్రభావం నివారణకై నువ్వులు, పసుపు కలిపి నూరి కుట్టినచోట లేపనంగా పూయాలి.

**వెంట్రుకలు తెల్లబడుట (నెరిసినప్పుడు) నివారణకై:** చిన్న వయస్సులోనే వెంట్రుకలు తెల్లబడుట నివారణకై నువ్వులపప్పు, నువ్వుల ఆకులు కలిపి నూరి వెంట్రుకల కుదుళ్ళలో రోజూ రాసి మర్దించిన లాభం కలుగుతుంది.

**మొటిమల నివారణకై:** పాత నువ్వులు, గో మూత్రంలో ముంచి పొడిచేసి మొటిమలపై పూతగా రాసినచో లాభకారిగా ఉండి హానికారమైన పెద్ద మొటిమలను నివారిస్తుంది.

**అతి మూత్రవ్యాధి:** నువ్వులు మరియు వాము సరిసమానంగా కలిపి నూరి 5 గ్రాముల రోజు ఉదయం, సాయంత్రం తినాలి.

**దగ్గు నివారణకై (కఫంతో నిండినది):** 20గ్రాముల నువ్వులు, మిస్రీ తగినంత, 250 గ్రా॥ నీరు మరిగించి, తరువాత చల్లబరిచి త్రాగాలి.

**గర్భస్రావము జరిగినపుడు:** 10 గ్రా॥ నువ్వులు 15 గ్రా॥ ఎర్రచందనం చూర్ణం కలిపి, మెత్తగా చేసి 100 గ్రా॥ నీటిలో, మిస్రీ కలుపుకొని రోజూ 2 సార్లు త్రాగాలి. ఇది 40 రోజుల త్రాగాలి.

**రక్తవిరేచనాలు:** 10 గ్రా॥ నల్లనువ్వులు మిస్రీ 20 గ్రా॥ పొడరుచేసి మేకపాలు 150 గ్రా॥ తో కలిపి త్రాగాలి.

**స్త్రీలకు కుసుమ వ్యాధి:**

**అధికరక్తస్రావం ఋతుక్రమం జరిగినపుడు:** 10 గ్రా॥ నల్ల నువ్వులు + 200 గ్రా॥ నీటిలో వేసి మరిగించి కలిపి త్రాగిన లాభం.

**అపక్రమ ఋతుస్రావం నొప్పితో ఉన్నప్పుడు:** 10 గ్రా॥ నల్ల నువ్వులు + 200 గ్రా॥ నీటితో మరిగించి శొంఠిని కలిపి + నల్లమిరియాల + పిప్పలి చూర్ణం మట్టిపాత్రలో మరిగించాలి. సన్నని సెగపై కాయాలి. తరువాత చల్లబరచిన త్రాగాలి.

**ఎముకలు చిట్లినప్పుడు, ఎముకలు బలహీనపడినప్పుడు:** నూనె లేకుండా 20 గ్రా॥ నల్లనువ్వులు వేయించి, చల్లార్చి రోజూ బాగా నమలాలి, ఎముకలు గట్టిపడతాయి.

**పథ్యము:** టీ, కాఫీ, పంచదార, వేపుడు పదార్థాలు తినరాదు. పాలు చక్కెర లేకుండా త్రాగాలి. తాజా పండ్లు, కూరలు తినాలి - పంచదారకు బదులుగా, బెల్లం, మునక్కా (గింజలున్న ఎండుద్రాక్ష) ఖర్జూరం, దేశాఖాండ మున్నగు వానిని తినాలి.

**కాలిన చర్మము:** (అగ్ని వలన) నల్లనువ్వులు పొడిచేసి, వెన్నతో కలిపి దానిపై పూయాలి.

**బెణికినపుడు:** నువ్వులతో పాటు, విప్ప పువ్వు కలిపి రుబ్బి, బెణికినదానిపై పట్టు వేసిన త్వరగా స్వస్థత చేకూరుతుంది.

**కిడ్నిలో రాళ్ళు (మూత్రంలో రాళ్ళు):** నువ్వులు చెట్లు చిగురుటాకులను నీడలో ఎండబెట్టి, కాల్చి భస్మం తయారు చెయ్యాలి! ఈ భస్మాన్ని నిత్యం సేవించిన రాళ్ళు పడిపోతాయి. రెండవ పద్ధతి: నువ్వుల భస్మాని వాడుటతోపాటు నిత్యం నీరు బాగుగా త్రాగాలి. మజ్జిగ, నిమ్మకాయ నీరు, బత్తాయి, కమలా, కీర, పుచ్చకాయ, కర్బూజా, ముల్లంగి, క్యారట్, బొప్పాయి వగైరా తినాలి.

## పండుగలు

**జూన్ 2016**

| | |
|---|---|
| 04-06-2016 | వటసావిత్రి వ్రతం |
| 07-06-2016 | మహారాణా ప్రతాప్ జయంతి |
| 15-06-2016 | గాయత్రీమాత జయంతి, పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల మహా ప్రయాణం |
| 20-06-2016 | సంత్ కబీర్‌దాస్ జయంతి |
| 21-06-2016 | ప్రపంచ యోగా దినోత్సవం |

**జులై 2016**

| | |
|---|---|
| 06-07-2016 | పూరీ జగన్నాథస్వామి రథయాత్ర |
| 15-07-2016 | తొలి (శయన) ఏకాదశి |
| 19-07-2016 | గురు (వ్యాస) పౌర్ణమి |

గెలుపును అతిగా ఆలోచించకు. అందిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకో

# స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు - 25

## శ్రీమతి & శ్రీ గంధం పద్మావతి-జగన్నాథం దంపతులు, హైద్రాబాద్



శ్రీమతి గంధం శాంతమ్మ – శ్రీ గంధం సత్యన్నారాయణ దంపతులకు నవమ సంతానంగా జగన్నాథంగారు 14 మార్చి 1959న అమలాపురం, తూర్పుగోదావరి జిల్లాలో జన్మించారు. ఉన్నత పాఠశాలవిద్య వరకు అమలాపురంలో చదివి ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం ద్వారా దూరవిద్య మాధ్యమంగా బి.కాం పట్టాను పొందారు. తదుపరి భారతదేశ పదాతిదళంలో ఎంపికై మద్రాసు ఇంజనీర్స్ విభాగంలో బెంగుళూరులో నియమితులై, బాధ్యతలు స్వీకరించెడి దశలో, తల్లిదండ్రుల నుండి తదితర కుటుంబసభ్యుల నుండి తీవ్ర అభ్యంతరాలు ఎదురు కాగా సైన్యంలో చేరలేదు. ఈ రీతిగా దేశసేవ చేయుటకై తాను చేసిన మొదటి ప్రయత్నం విఫలం కాగా, తన దృష్టిని వ్యాపారరంగంపై మరల్చారు. దీనిలో భాగంగా తన అదృష్టాన్ని అల్లోపతి మందుల విక్రయంలో, హోటల్ మేనేజ్‌మెంట్ రంగంలో, వ్యవసాయరంగంలో పరీక్షించుకుంటూ ఉన్న సమయంలో 1978లో విద్యావతి, సౌశీల్యవతి అయిన కుమారి పద్మగారితో వివాహమై గృహస్థజీవనంలో అడుగు పెట్టారు. శ్రీమతి పద్మగారు అప్పటికే స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైద్రాబాద్‌లో ఉద్యోగానికి ఎంపికై, వివాహమైన మూడు మాసాలకు మెదక్‌జిల్లాలోని నర్సపూర్ బ్యాంక్‌శాఖలో నియమితులైనారు. దీనితో శ్రీ జగన్నాథం దంపతులు నర్సపూర్‌కు తమ నివాసాన్ని మార్చారు. శ్రీ జగన్నాథంగారు నర్సపూర్‌లో వ్యాపారాన్ని ప్రారంభిస్తూ రియల్ ఎస్టేట్ రంగంలో ప్రవేశించారు. ఈ విధంగా ప్రజలతో తన సంపర్కాన్ని పెంచుకొనుట తన అనుభవానికి మరింత మెరుగులు దిద్దుకుంటూ, రానున్న కాలంలో తాను నిర్వహించబోయెడి పనులకు పునాదిని తనకు తెలియకుండగనే ఏర్పాటు చేసికొనుట జరిగింది.


నర్సపూర్‌లోని మంజీరా గ్రామీణ బ్యాంక్‌లో పని చేయుచున్న శ్రీ కె.ఎల్ఎన్.మూర్తి గారి ద్వారా గాయత్రీ పరివార్ గురించి తెలిసికొనుట జరిగింది. దీనితో గాయత్రీ పరివార్ యజ్ఞాలు, సంస్కారాల పట్ల అవగాహన పెరిగి మరింతగా గాయత్రీ పరివార్‌తో అనుబంధాన్ని పెంచుకొన్నారు. ఈ ప్రభావం తన అర్ధాంగియైన శ్రీమతి పద్మగారిపై కూడా పడింది. దీనితో భార్య భర్తలిరువురు గాయత్రీ పరివార్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనసాగారు. ఒక పర్యాయం దౌలతాబాద్‌లో పంచకుండీ గాయత్రీ యజ్ఞము ఒక మర్రిచెట్టు క్రింద పెట్టి చేశారు. పూర్ణాహుతి తదనంతరం విసర్జనం చేస్తుండగా, మర్రిచెట్టుపై నున్న తేనెతుట్టెలోని ఈగలు లేచి వీరి వెంటపడ్డాయి. ఎవ్వరికి ఎట్టి హాని జరుగలేదు.

1996లో సతీమణి హైదరాబాద్ నగరానికి ఉద్యోగరీత్యా బదిలీకాగా నివాసాన్ని హైదరాబాద్ నగరానికి మార్చారు. ఆనాటి నుండి సంజీవరెడ్డినగర్, బి.కె.గూడలోనున్న గాయత్రీ చేతనా కేంద్రముతో జోడింపబడి తన సేవలను గాయత్రీ పరివార్‌కు అందించసాగారు. తదుపరి కూకట్‌పల్లిలోనున్న పి.ఎన్.ఎమ్. ఉన్నత పాఠశాలలో నిర్వహింపబడిన 108 కుండముల గాయత్రీయజ్ఞములో ఉత్సాహంగా పాల్గొని తద్వారా గాయత్రీపరివార్ వరిష్ఠ కార్యకర్తలతో పరిచయం పెంచుకొని వారికి తలలో నాలుకలా ప్రవర్తించి వారి ప్రేమాను రాగాలను చవిచూడసాగారు. ఈ రీతిగా పూజ్యులు డా॥ ప్రణవ్‌పండ్యా, డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్, శ్రీ పరమానంద ద్వివేది, శ్రీ అశ్విని సుబ్బరావు, శ్రీ తుమ్మూరిగార్లకు చేరువై గాయత్రీ పరివార్ విస్తరించుటకు తీవ్రంగా కృషి చేస్తూ ఉన్నారు. శాంతి కుంజ్‌ను, నారాకోడూరు కేంద్రాలను అనేకమార్లు సందర్శించారు. 2001లో తిరుపతిలో జరిగిన అశ్వమేధ యాగంలో పూజ్య గురుదేవుల సాహిత్యవిక్రయాలలో పాల్గొని దాదాపు 3 లక్షల ఖరీదుచేసే సాహిత్యాన్ని విక్రయించుట జరిగింది. దీనితోపాటు మాసపత్రిక యుగశక్తి గాయత్రి ముద్రణలో ప్రముఖపాత్రను పోషించి, దానిని బట్వాడా చేయుటలో కూడా తన సహాయ సహకారాలను సంపూర్ణంగా అందించారు.

**చెయ్యాలన్న తాపత్రయం ఉంటే ఏదైనా సాధ్యమే. ఇప్పుడెందుకులే అనే బద్ధకం ఉంటే అన్నీ అసాధ్యమే**

దీనికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నెలకొల్పబడిన గాయత్రీ శక్తిపీఠాలన్నింటిలోని గాయత్రీమాత మూర్తులను అలంకరించుటకు కావలసిన అలంకార వస్త్రాలను, నగలను వీరి సతీమతి శ్రీమతి పద్మ జగన్నాథంగారు ప్రత్యేక శ్రద్ధ తీసికొని తమ స్వంత అంశదానంతో అందజేశారు. ఈ రీతిగా పరమపూజ్య గురుదేవులు, వందనీయమాతాజీల యుగనిర్మాణ ప్రణాళిక సఫలీకృతానికై తమవంతు సహకారాన్ని అందిస్తూ తమ జీవితగమ్యాలను నిర్దేశించుకొని జీవసాధన చేస్తున్న వీరు ధన్యజీవులు - ఆదర్శ దంపతులు. వీరికి వీరి కుటుంబానికి సంపూర్ణ ఆయురారోగ్యాలను, సిరిసంపదల చేకూర్చి గురుసత్తా కాపాడుగాక.

## శ్రీ మార్గం సదానందం, ధర్మసాగర్



శ్రీ మార్గం మల్లయ్య-వెంకటమ్మ దంపతులకు సదానందం గారు 14 జులై 1955న ధర్మసాగర్ గ్రామము, వరంగల్లు జిల్లాలో జన్మించారు. ఉన్నత పాఠశాల విద్యవరకు ధర్మసాగరంలో పూర్తిగావించారు. తదుపరి వరంగల్లు లోని అజాంజాహి మిల్లులో నౌకరిచేశారు. నౌకరిచేస్తూ తీరిక సమయాన తన ఆదాయాన్ని పెంచుకొనెడి మార్గంలో అనేక చిరువ్యాపారాలు చేస్తూ ఉండేవారు. తన 21వ సంవత్సరములో కుమారి భాగ్యలతగారితో వివాహమై గృహస్థజీవనంలో ప్రవేశించుట జరిగింది.

తదుపరి యోగాను అభ్యసిస్తూ వారి ద్వారా గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్ పేరు వినుట జరిగింది. ఒకసారి వ్యాపారనిమిత్తం ఢిల్లీకి వచ్చుట జరిగింది. హరిద్వార్ పట్టణము ఢిల్లీకి దగ్గరగా ఉన్నదని తెలిసికొని అప్రయత్నంగా హరిద్వార్ చేరుకొని 2005లో శాంతికుంజ్‌ను మొదటిసారి సందర్శించారు. అప్పుడు శాంతికుంజ్‌లో ఉంటున్న శ్రీ కల్నల్‌గారితో పరిచయం కాగా, 9 రోజుల సంజీవిని సాధనా శిబిరంలో పాల్గొని ప్రాథమిక శిక్షణ తీసికొనుట జరిగింది. క్రమక్రమంగా గాయత్రీ మంత్రం పట్ల, యజ్ఞవిధానంపట్ల ఆకర్షితులై 2007లో 30 రోజుల యుగశిల్పి శిబిరంలో పాల్గొని శిక్షణను పొందుట జరిగింది. ఈ రీతిగా గాయత్రీ యజ్ఞము మరియు షోడశ సంస్కారాలు నిర్వహించుటలో తగిన శిక్షణ పొంది, తన జన్మ స్థలమైన ధర్మసాగర్‌లో మరియు ధర్మసాగర్ చుట్టుప్రక్కల గ్రామాలలో గాయత్రీ మంత్రము, గాయత్రీ యజ్ఞము మరియు షోడశ సంస్కారాల పట్ల ప్రజలలో అవగాహనను పెంచి, గాయత్రీ పరివారాన్ని నిర్మించుటలో చాలా శ్రమించారు.

అటు పిమ్మట 2009లో శాంతికుంజ్‌లో 3 మాసాల పరివ్రాజక శిబిరంలో పాల్గొని శిక్షణను పొందారు. అటు పిమ్మట గోశాలలో పనిచేసి గో ఆధారిత అర్క్‌ను మందులను తయారు చేయుటలో శిక్షణను పొందారు.

ధర్మసాగర మండలలో ఉన్న మల్లికుదురు గ్రామంలో 6 ఎకరాల స్థలంలో గాయత్రీప్రజ్ఞామండలికి శ్రీకారం చుట్టుట జరిగింది. ఈ రీతిగా గాయత్రీ పరివార్ నిర్మాణంలో భాగంగా అనేక గ్రామాలు తిరుగుతూ కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలో కూడా కలిపి రమారమి 700 యజ్ఞాలు చేయించారు.

పై రీతిలో పూజ్యగురుదేవుల యుగనిర్మాణ కార్యక్రమాల్లో అలుపెరుగని అవిరళ కృషి చేయుచున్న సదా ఆనందంలో ఉండెడి శ్రీ సదానందం గారికి దీర్ఘాయుష్షును, ఆరోగ్యాన్ని ప్రసాదించి ఆశీర్వదించవలసిందిగా యుగశక్తి గాయత్రి ప్రార్థిస్తున్నది.


దైవీశక్తుల తోడ్పాటుకై
కష్ట నష్టముల నివారణకై
చేసిన కృషి సత్ఫలితములనిచ్చుటకై
జ్ఞానము, సంపదల ఆర్జన కొరకై
జీవితంలో స్థిరపడుటకై

యుగశక్తి  గాయత్రి

మాసపత్రిక చదవండి !
చదివించండి !!

ప్రతుల కొరకై సంప్రదించండి:
ఫోన్: 040-23700722, 9949111175


**గెలవకపోవటం ఓటమి కాదు. మరల ప్రయత్నించకపోవుట ఓటమి**

# తొమ్మిది రోజుల సంజీవిని సాధనా శిబిరంపై నివేదిక-1

గాయత్రీతీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌లో తొమ్మిది రోజుల సంజీవిని సాధనా తెలుగువారి శిబిరము 2016, మే నెల 11 నుండి 19వ తేది వరకు సంతృప్తికరంగా నిర్వహింపబడింది. శిబిరము 11వ తేది ఉదయం 10 గం॥లకు శాంతికుంజ్ వరిష్ట ప్రతినిధి సంత్ డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్ దక్షిణ భారత ప్రధాన సంచాలకులు దీపప్రజ్వలనతో ప్రారంభిం చారు. శిబిర ప్రారంభోపన్యాసం గావించారు. డా॥బ్రిజ్‌మోహన్ గౌర్‌గారు, ఈ క్రింది అంశాలను వెల్లడించారు.

పరమపూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య, పరమ వందనీయ మాతా భగవతీదేవిశర్మగార్లచే స్థాపింపబడిన గాయత్రీ పరివార్ యుగనిర్మాణ కార్యకలాపాలను దేశ వ్యాప్తంగా పరివార్ యుగనిర్మాణ కార్యకలాపాలను దేశవ్యాప్తం గావించుటలో భాగంగా, గాయత్రీ పరివార్ వరిష్ట ప్రతినిధి పూజ్య శ్రీరామకృష్ణమాస్టారు అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో గుంటూరు పట్టణాన్ని కేంద్రంగా చేసికొని తమ కార్యకలాపాలను నాలుగు దశాబ్దాల క్రితం ప్రారంభించుట జరిగింది. ఆనాటి నుండి తన శరీరాన్ని విడచిపెట్టెడి వరకు విశాఖపట్నం మొదలు కొని రాయలసీమలోని కడప, కర్నూలు, చిత్తూరు వరకు, ఇటు తడ వరకు మూలాగ్రం పర్యటించి అనేక చోట్ల యజ్ఞాలు నిర్వహించి, మంత్రదీక్షనిచ్చి, పీఠాలు, ప్రజ్ఞా మండళ్ళను, వేల సంఖ్యలో కార్యకర్తలను, సాధకుల తయారు చేసి ఆంధ్రప్రదేశ్ గాయత్రీప్రదేశ్‌గా రూపాంతరం చెందింప జేసి, సూక్ష్మస్థితిలో తన గురుదేవులు పరమపూజ్య శ్రీరామశర్మగా, పరమ వందనీయ మాతాజీలకు గురుదక్షిణగా సమర్పించాలని తన వారిని ఆదేశించారు. అట్టి మహనీయుని స్మృతిచిహ్నంగా 2018లో 1008 కుండముల గాయత్రీ మహాయజ్ఞాన్ని ఆంధ్ర ప్రదేశ్‌లో నిర్వహించి 'రామకృష్ణనగర్' ఏర్పాటు చేయాలనెడి సందేశాన్ని అందించారు. ఇది మనందరికి ఎంతో ముదావహం. అందువలన ఈ తొమ్మిది రోజుల సంజీవని సాధనా శిబిరాన్ని 2018 అశ్వమేధ మహాయజ్ఞ సాధనా శిబిరంగా నామకరణం చేసి ఆ మహాయజ్ఞ నిర్వహణకు కావలసిన కార్యకర్తలను తద్వారా సాధకుల తయారుచేసెడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టుట జరిగింది. పూజ్య గురుసత్తా ప్రేరణతో మీరంతా ఇచ్చటికి వచ్చారు. భగవంతుని కృప, గురుకృప రూపంలో మనపై వర్షిస్తుంది. ఇది కాషాయాంబర ధారుల రూపంలో లేక మందిరాలలోని మూర్తుల రూపంలో కాక విభూతి, రుద్రాక్ష మాలలధారుల రూపంలో లభించదు. కేవలం సద్గురు రూపంలో మాత్రమే లభిస్తుంది.

నేడు భూమిపై ధర్మానుసరణను జనులు విడిచిపెట్టారు. తత్ఫలితంగా అరాచకం, అసమ్మతి, అసంతృప్తి, స్వార్థం రాజ్యమేలుతున్నాయి. మానవ జీవన మనుగడ ప్రమాదంలో పడింది. భగవంతుని సృష్టి పెడత్రోవపట్టి వినాశనం వైపు చరిస్తుండగా, దీనిని తిరిగి సన్మార్గం దారి వైపు మళ్ళించాలనెడి దానికై భూమిపై తిరిగి జన్మించుట జరుగుతుంది. ఇదే రీతిలో పరమ పూజ్యగురుదేవులు జన్మ తీసికొనుట జరిగింది. గురుదేవులు తన సర్వస్వాన్ని సమాజ కళ్యాణానికై, మానవాళిని జ్ఞానమార్గం వైపు మళ్ళించుటకై వెచ్చించారు. అంతేకాని తన సంపదలను పెంచి పోషించుటకై, తన పరివార సుఖ సంతోషాలకై మనలా వెచ్చించలేదు. స్వార్థం స్థానంలో, ప్రేమ, కరుణ, మమత, త్యాగం, బలిదానాలను ప్రవేశపెట్టి మనందరికి మార్గదర్శనం చేశారు. 44 సంవత్సరాలు తీవ్ర తపస్సు చేశారు. ఇట్టి పవిత్రమైన, శక్తివంతమైన, తపస్సంపన్నమైన, తీర్థస్థలానికి వచ్చిన మీరంతా గురుదేవులవలె తపశ్శక్తిని, పుణ్యాన్ని, శక్తిని, ప్రజ్ఞను తిరిగి వెళ్ళేటపుడు మీరు పొంది వెళ్ళాలి. అప్పుడు మీ యాత్ర సఫలమై మీకు పూజ్యగురుసత్తా మరియు గాయత్రీ మాత కృపకటాక్షములు లభిస్తాయి. కావున ఇచ్చట ఉన్న తొమ్మిది రోజులు మీరు నియమిత జపం, తప్పక చేసి సూర్యార్ఘ దానం చెయ్యండి. 2018లో అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞాన్ని నిర్వహించుటకై కావలసిన శక్తిని ప్రేరణను పొంది వెళ్ళండి. మీ మీ ప్రాంతాలలో కార్యకర్తలను, సాధకులను తయారు చేయుటలో మీ కర్తవ్యాన్ని నిర్వహించండి.

మీ జీవితాలు మంగళకరమగు గాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**ప్రత్యర్థి ఓటమి నీ గెలుపు కాదు. అట్లే నీ ఓటమి ప్రత్యర్థి గెలుపు కాదు**

వార్తలు

# ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## రాష్ట్ర ప్రగతికై సుఖశాంతులకై 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞముల శృంఖల తెలంగాణా రాష్ట్రములో ప్రారంభము

గాయత్రీ జ్ఞానమందిరం, స్వర్ణధామనగర్, పాతబోయినపల్లి, సికింద్రాబాద్‌వారి సారథ్యంలో తెలంగాణా రాష్ట్ర ప్రగతి మరియు సుఖశాంతులకాంక్షిస్తూ, సర్వమంగళకారకము, సర్వ శ్రేయోదాయకము, సర్వశక్తిదాయకము అయిన గాయత్రీ యజ్ఞ శృంఖలను ప్రారంభించుట అత్యంత ముదావహము.

ఈ యజ్ఞశృంఖలను మే 3వ తేది 2016న మెదక్ జిల్లాలోని రామాయంపేట నుండి ప్రారంభించి, నిజామాబాద్ జిల్లాకు విస్తరించుట జరిగింది. ఇప్పటివరకు దాదాపు అష్టమ సంఖ్యలో యజ్ఞాలు పూర్తిచేయుట జరిగింది.

ఈ యజ్ఞ శృంఖల ద్వారా సమాజంలోని అన్ని వర్ణాల-వర్గాల ప్రజలను, ధనిక-పేద తేడాలేకుండా, పండిత-పామరులనెడి తేడా లేకుండా అగ్ర-నిమ్న వర్ణాలనెడి తేడాల మరపించి, సహ పంక్తిన కూర్చొని, ఒక సామూహిక శక్తిగా ఏర్పడి, దైవపూజనం చేస్తూ, తదుపరి తమ శక్తికొలది తమ ఇచ్ఛానుసారం, తమ శ్రమఫలాన్ని వస్తు, ధనరూపంలో అంశదానముగా చేర్చి, సమాజ కళ్యాణానికి శ్రీకారము చుట్టి ముందుకు అడుగు వేయుట రాష్ట్ర ప్రగతికి శుభసూచకము.

నిజామాబాద్ జిల్లా కామారెడ్డి పట్టణం చుట్టుప్రక్కలనున్న గ్రామాలైన క్రియాత్, గాంధారి, కన్‌కల్, సరంపల్లి, మద్దికుంట తదితర ప్రదేశాలలో యజ్ఞాలు పూర్తిచేయుట జరిగింది.

నేడు సమాజంలో పెచ్చరిల్లుచున్న అశాంతికి, అరాచకానికి, స్వార్థపరత్వానికి, అసంతృప్తికి, నైరాశ్యానికి, మత్తుపదార్థాల సేవనానికి, నైతికపతనానికి, నిరుద్యోగానికి, సోమరితనానికి, అవినీతికి, బంధుప్రీతికి, వర్ణవైషమ్యాలకు, అసహనానికి ప్రధానకారణము ప్రజలలోని అజ్ఞానము. ప్రజలలో తద్వారా సమాజంలోని అజ్ఞానాన్ని తొలగించుటకు స్వాధ్యాయ, సత్సంగాలు చేయుట అత్యవసరము. ఈ గాయత్రీ యజ్ఞశృంఖల ద్వారా ప్రజలను, సమాజాన్ని చైతన్యపరచి, వారి దృష్టికోణాన్ని, వారి రోజువారి ఆలోచనా విధానంలో, తద్వారా వారినిత్యజీవితాల్లో సమగ్రమైన, శాశ్వతమైన మార్పును తెచ్చి తద్వారా సమాజ సర్వతోముఖ, సమగ్ర ప్రగతి సాధనాఫలాలను వారికి రుచి చూపించుట జరుగుచున్నది. పాషాణ హృదయాలను మెత్తపరచి, మృదుత్వాన్ని చేకూర్చెడి బీజాలను వారిహృదయాలలో నాటుట, తదపరి కరుణ, ప్రేమ, మమతలు కలిగియున్న హృదయాలలో వీనిని పెంచిపోషించి, పుష్టింపజేసి తద్వారా అందెడి ఫలాలను సమాజానికి ఉపయోగపడేలా చూడాలనెడి సంకల్పంతో సాగుచున్నది గాయత్రీ యజ్ఞశృంఖల.

గాయత్రి 'మాత' – యజ్ఞము 'తండ్రి'కి ప్రతీకగా నిలిచినది. గాయత్రీ యజ్ఞము యావన్మందిలో సదాలోచనలను సద్భావనల పెంపొందింపజేసి తద్వారా సుఖశాంతులను ప్రగతిని సమాజానికి చేకూర్చుతుంది. ఈ యజ్ఞశృంఖలతో పాటుగా పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ విరచిత సాహిత్యాన్ని ప్రజల ముంగిటకు చేర్చి, వీని పఠనంద్వారా వారిలో గూడుకట్టుకొని ఉన్న అజ్ఞానతిమిరాలను తొలగించి, వారి హృదయాలలో జ్ఞానదీపాల వెలిగించుటకై గాయత్రీజ్ఞాన మందిరము, స్వర్ణధామనగర్ కంకణం కట్టుకొనుట అత్యంత శ్రేయోదాయకం మరియు అభినదందనీయం.

దీనికై తమ సమయాన్ని ధనాన్ని వెచ్చిస్తూ కావలసిన అండదండలను అందించుచున్న గాయత్రీమాత ముద్దుబిడ్డ, సరళహృదయుడు, దానశీలి, కామారెడ్డి పట్టణ నివాసి శ్రీ చాట్ల ఉపేంద్రగారిని యుగశక్తి గాయత్రి మనసారా అభినందిస్తూ హృదయానికి హత్తుకొనుచున్నది.

అన్నింటికన్నా ముఖ్యమైంది గాయత్రీ జ్ఞానమందిరం వ్యవస్థాప స్ఫూర్తిదాతలు శ్రీమతి & శ్రీ వాణి-రంగారావు దంపతుల సత్సంకల్పము, పట్టుదల, కార్యాచరణ ఈ గాయత్రి యజ్ఞశృంఖలాల విజయానికి మూలాధారము. వీరు తమ

కలల ప్రయాణం మెలకువ వరకు - అలల ప్రయాణం తీరం వరకు - ప్రేమ ప్రయాణం పెళ్ళి వరకు - స్నేహం ప్రయాణం జీవితాంతం వరకు

వృత్తిధర్మాన్ని పాలిస్తూ, తమజీవన అంతిమలక్ష్యసాధనకై గృహస్థాశ్రమదశనుండి కృషి చేయుట అత్యంత ఆదర్శప్రాయం మరియు స్ఫూర్తిదాయకం. ఈ దంపతులిరువురిని, వీరి కుటుంబాన్ని యుగశక్తి గాయత్రి మనసారా ప్రస్తుతించు చున్నది. వీరిని తగిన బలోపేతుల గావించమని గురుసత్తాను వేడుకొనుచున్నది. పై యజ్ఞశృంఖల సంకల్పాన్ని వాడవాడకు చేర్చి సఫలం చేయుటలో అవిశ్రాంతి, అవిరళ కృషిచేయుచున్న శ్రీ లక్ష్మీనర్సయ్యగారిని, శ్రీ విక్రమ్‌గారిని, శ్రీమతి & శ్రీ సావిత్రి పూల్‌సింగ్ దంపతులను కూడా యుగశక్తి గాయత్రి అభినందిస్తూ వారి అభివృద్ధిని కాంక్షిస్తున్నది

ఓం శాంతిః శాంతిః శాంతిః

## లక్ష్మీపురంలో

లక్ష్మీపురం గ్రామం, కాకాని పంచాయితీ శివారు, నర్సరావుపేట (మం॥), గుంటూరు జిల్లాలో 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞము 23 మార్చి 2016న గాయత్రీ శక్తిపీఠము, లక్ష్మీపురం వారి సారథ్యంలో నిర్వహించారు.

పరమ పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యుల వారి మార్గ నిర్దేశానుసారము యజ్ఞ నిర్వహణానంతరము సంబంధిత యజ్ఞ జమా ఖర్చులను వెల్లడించుట సత్సంప్రదాయము. ఈ సత్సంప్రదాయాన్ని మన్నించి యజ్ఞనిర్వహణలో ప్రధానపాత్ర పోషించిన శ్రీమతి ఎ.అనితగారు సంబంధిత జమా ఖర్చులను పత్రికలో ప్రచురణార్థము యుగశక్తి గాయత్రి మాసపత్రిక కార్యాలయానికి అందజేయుచూ ఈ సత్సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు.

| | |
|---|---|
| యజ్ఞానికి అందిన నగదు | |
| అంశదానం జమ | రూ. 3,17,350/- |
| యజ్ఞానికి ఖర్చు చేసినది | రూ. 2,83,350/- |
| మిగులు నగదు | రూ. 34,000/- |
| అంశదాన రూపంలో ఖర్చు కాగా | |
| మిగిలిన బియ్యం విలువ | రూ. 23,000/- |
| మొత్తం మిగులు | రూ. 57,000/- |

*(గమనిక: జమాఖర్చుల పూర్తి వివరాలను శ్రీమతి అనితగారి నుండి పొందగలరు.)*

పై సత్సంప్రదాయాన్ని నెలకొల్పిన శ్రీమతి అనితగారిని యుగశక్తి గాయత్రి మనసారా అభినందించుచున్నది.

## అర్హత మొదట, తదుపరి కోరిక

*మన ప్రగతికై పరిస్థితులను తదనుగుణంగా మలచుకొనుటకై మనము ఎవ్వరిని ప్రాధేయపడనవసరంలేదు. దేన్నినైనా మనము పొందుటకు తగిన అర్హత మనకు లేనప్పుడు దేవుళ్ళను యాచించుట వృధా ప్రయాస. ఏలనన దేవుళ్ళు కూడా కొన్ని నియమిత సూత్రాలకు బద్ధులై మాత్రమే అర్హులైన వారికి వరదానాలిస్తూ ఉంటారు. మనలాగే, దేవుళ్ళు కూడా వారిదైనందిన జీవితంలో నిర్ధారితమైన నియమాలను అతిక్రమించరు. ఈ నియమాన్ని ప్రముఖంగా ప్రేమ చూపించుటలో పాటిస్తారు. ఏలనన ప్రేమామృతాన్ని తాము అభిలషించిన వ్యక్తిపై కురిపించేముందు, ఆ వ్యక్తి ఎంతమేరకు తన వ్యక్తిత్వాన్ని, గుణగణాలను అత్యంత ఉచ్ఛస్థితికి పెంపొందించుకొన్నది నిర్ధారించుకొనెదరు.*

*మనిషికి వేడి వేడి పాలను త్రాగుటకు కావలసిన సహన శీలత, ఓర్పు, పట్టుదల ఎంత ఉండాలో, అంతకుమించిన సహశీలత, ఓర్పు తన వ్యక్తిత్వాన్ని పరిష్కరించుకొని ఉచ్ఛస్థితికి తీసికొని పోవుటకు కావాలి. ఇట్టి వ్యక్తులకు మాత్రమే దైవీ ప్రేమ, వరదానాలు పొందెడి అర్హతను కలిగి ఉంటారు. ఇట్టి ఉచ్ఛస్థితిలో నున్న వ్యక్తులకు మాత్రమే దైవీ ప్రేమ, వరదానాలు సహాయ సహకారాలు అన్నివైపులనుండి అయాచితంగా లభిస్తాయి.*

*మన నాగరికత, చరిత్ర ఇట్టి వానికి గొప్ప ఋజువు.*

– హిందీమూలం: పండిత శ్రీరామశర్మ ఆచార్య

తెలుగుసేత: ఎ. శారద

**నీవు ఉచితంగా పొందిన దానిలో ఆనందం క్షణికం. నీ కృషితో పొందిన దానిలో ఆనందం శాశ్వితం**

# దేవసంస్కృతి విశ్వవిద్యాలయము

గాయత్రికుంజ్, శాంతికుంజ్, హరిద్వార్, ఉత్తరాఖండ్ - 249411
ఫోన్: 01334-261367, 262094, ఫ్యాక్స్: 01334-262095
Websites: www.dsvv.ac.in / www.awgp.org, E-mail: chinmay.pandya@dsvv.ac.in

## 2016-17 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సులలో ప్రవేశానికి ప్రకటన

- ప్రవేశ దరఖాస్తు ఫారములు విక్రయించుట ప్రారంభము: **27 జనవరి 2016**
- దరఖాస్తును పూరించి దాఖలు చేయుటకు చివరి తేది: **28 జున్ 2016**
- దరఖాస్తును పూరించి, ఆలస్య రుసుముతో (రూ.100/-) చెల్లించి దాఖలు చేయుటకు చివరి తేది: **2 జులై 2016**

### బి.ఇ.డి. సర్టిఫికెట్ కోర్సులకు

- వ్రాతపరీక్ష బి.ఇ.డి. కోర్సులో ప్రవేశానికి: **9 జులై 2016**
- (బి.ఇ.డి.కోర్సులో ప్రవేశానికి మాత్రమే-వ్రాతపరీక్ష హరిద్వార్‌లో నిర్వహింపబడుతుంది)
- వ్రాతపరీక్ష బి.ఇ.డి ఫలితాల వెల్లడి: **1 జులై 2016**
- మౌఖిక పరీక్ష (ఇంటర్వ్యూ) బి.ఇ.డి. సర్టిఫికెట్ కోర్సులకు: **12-13 జులై 2016**
- ఎంపిక కాబడిన అభ్యర్థుల జాబితా విడుదల: **15 జులై 2016**
- వైద్యపరీక్ష మరియు ప్రవేశము పూర్తి: **16-19 జులై 2016**
- వేచి ఉన్న అభ్యర్థుల ప్రవేశము పూర్తి: **21-23 జులై 2016**

### గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడుయేట్ మరియు డిప్లొమా కోర్సులలో ప్రవేశము

- వ్రాతపరీక్ష అన్ని కోర్సులకు: **8 జులై 2016**
- ఎంపికైన అభ్యర్థుల పేర్లు విడుదల: **12 జులై 2016**
- మౌఖికపరీక్ష (ఇంటర్వ్యూ) బి.ఏ, బి.ఎస్సీ., మరియు బి.సి.ఏ.: **15-16 జులై 2016**
- మౌఖికపరీక్ష (ఇంటర్వ్యూ) పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా: **16-17 జులై 2016**
- ఎంపికైన అభ్యర్థుల పేర్లు విడుదల: **19 జులై 2016**
- వైద్యపరీక్ష మరియు ప్రవేశము: **20-22 జులై 2016**
- రెండవదఫా కౌన్సిలింగ్ ఇంటర్వ్యూ: **21 జులై 2016**
- ఎంపికైన అభ్యర్థుల పేర్లు ప్రకటన: **23 జులై 2016**
- వైద్యపరీక్ష మరియు ప్రవేశము పూర్తి: **24-25 జులై 2016**
- జ్ఞానదీక్ష (విద్యార్థులకు): **27 జులై 2016**
- పరిచయము మరియు శిక్షణ సంసిద్ధుల గావించుట: **28-30 జులై 2016**
- నూతనంగా ప్రవేశించిన వారికి మరియు 2016-17 విద్యా సంవత్సర తరగతులు ప్రారంభము: **1 ఆగస్టు 2016**

### ఇతర వివరములు

- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు పొందుటకు: **http online: www.dsvv.ac.in (రూ.75/-)**
- డౌన్‌లోడ్ ఫామ్‌ను వెబ్‌సైట్ ద్వారా పూరించి పోస్టుద్వారా పంపవచ్చు **(రూ.750/-)**
- వ్యక్తిగతంగా విశ్వవిద్యాలయం నుండి పొందుటకు: **(రూ.225/- + రూ.525/-)**
- పోస్టు ద్వారా పొందుటకు: **(రూ.275/- + రూ.525/-)**
- బ్యాంకు డిమాండ్ డ్రాఫ్టును దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం పేరిట, హరిద్వార్‌లో చెల్లుబాటయ్యేలా పంపాలి.

### వ్రాత పరీక్షా కేంద్రాలు

1. దేవ సంస్కృతి విశ్వవిద్యాలయ ప్రాంగణం; 2. నోయిడా (ఉత్తరప్రదేశ్); 3. లక్నో (ఉత్తరప్రదేశ్); 4. పాట్నా (బీహార్); 5. భోపాల్ (మధ్యప్రదేశ్); 6. రాజనందగామ్ (ఛత్తీస్‌ఘడ్); 7. నాగపూర్ (మహారాష్ట్ర); 8. వడోదర (గుజరాత్); 9. కలకత్తా (పశ్చిమబెంగాల్); 10. జైపూర్ (రాజస్థాన్); 11. హైదరాబాద్ (తెలంగాణ)

**పని చెయ్యాలనుకునేవారికి పని దొరుకుతుంది - వద్దనుకొనేవానికి సాకు దొరుకుతుంది**